# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 152 | హైదరాబాద్ | గురువారం 04-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00



11లో

దేశవ్యాప్తంగా ఎయిర్ పోర్టుల్లో చెక్ ఇన్ సమస్య.. విమానాలు తీవ్ర ఆలస్యం



## బస్తర్ అడవుల్లో
# భారీ ఎన్‌కౌంటర్

11లో

- దద్దరిల్లిన ఛత్తీస్‌గఢ్ అడవులు
- 12 మంది మావోయిస్టుల మృతదేహాలు స్వాధీనం
- కాల్పుల్లో ముగ్గురు డీఆర్‌జీ జవాన్లు మృతి

## కోకాపేటలో మరోసారి
# కోట్లు పలికిన భూములు..

రూ.131 కోట్లు ఎకరా భూమి

- నియోపొలిస్ భూములకు ముగిసిన మూడో విడత వేలం
- ప్లాట్ నెంబర్ 19లో ఎకరా రూ.131 కోట్లు, ప్లాట్ నెంబర్ 20లో ఎకరా రూ.118 కోట్లు



11లో

## నేటి భారతం

- గ్రామం బలపడితే దేశం బలపడుతుంది.. పంచాయితీ నిజాయితీగా పని చేస్తే ప్రజాస్వామ్యం పుష్పిస్తుంది.
- గాంధీజీ చెప్పినట్లే భారత ఆత్మ గ్రామాల్లోనే ఉంటుంది.. ఆ ఆత్మను కాపాడేది జనమే, జనాలకు సేవ చేసే పరిపాలనే.
- కానీ ఇవన్నీ చెప్పుకోవడానికి మాత్రమే గొప్పగా ఉన్నాయి.. పట్టుకొమ్మల్లాంటి పల్లెలను నిర్వీర్యం చేస్తున్నాయి రాజకీయాలు..
- డబ్బు, మద్యం వెదజల్లి తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయి.. ఇది దేశ అభివృద్ధిపై ప్రభావం చూపిస్తుంది..
- రేపు జరుగబోయే పంచాయితీ ఎన్నికల్లో.. విజ్ఞతతో ఓట్లు వేయండి.. పవిత్రమైన ఓటును అమ్ముకోకండి..

– వి.జీ (సీనియర్ జర్నలిస్ట్)


11లో

## మూగ బాలుడిపై
# కుక్కల దాడి..

సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

- హయత్‌నగర్‌లో మూగ బాలుడిపై వీధి కుక్కల దాడి
- బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు రేవంత్ ఆర్డర్
- వీధి కుక్కల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశం

## జీహెచ్ఎంసీ
# విస్తరణ ప్రక్రియ..

నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం



11లో

# ఆటోలో మృతదేహాలు..

హైదరాబాద్ పాతబస్తీలో కలకలం

- ఘటనా స్థలంలో మూడు సిరంజీల లభ్యం
- డ్రగ్స్ ఓవర్ డోస్ కారణంగానే మరణించారని అనుమానాలు
- మృతదేహాలను పోస్ట్ మార్టం కోసం తరలించి పోలీసుల దర్యాప్తు


11లో

## కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగిందా..?
## బీఆర్ఎస్ ఉనికి చాటుకుంటుందా..?
# బీజేపీ బలపడిందా..?


12లో

పల్లెలు, పంచాయితీలు దేశానికి పట్టుకొమ్మలు అని మహాత్మా గాంధీ చెప్పిన మాటలు అక్షర సత్యాలు.. ఎప్పడైనా గ్రామాలు పటిష్ఠంగా ఉంటేనే దేశం కూడా పరిష్టంగా ఉంటుంది.. అదేవిధంగా గ్రామీణ రాజకీయాలు రాష్ట్ర, దేశ రాజకీయాలను శాసిస్తాయి.. అందుకే గ్రామీణ స్థాయి ఎన్నికలు అంటే పంచాయతీ ఎన్నికలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.. అయితే పల్లెలను తీర్చిదిద్దాల్సిన రాజకీయ నాయకులు పట్టించుకోవడం మానేశారు.. పంచాయితీ స్థాయి ఎన్నికలను సైతం నిర్వీర్యం చేస్తున్నారు.. గ్రామ సర్పంచ్‌లను బానిసల కంటే హీనంగా చూడటం మొదలుపెట్టారు.. పంచాయితీలకు చెల్లించాల్సిన బకాయిలను కూడా చెల్లించడం మానేశారు..దీంతో ఎంతోమంది సర్పంచులు అప్పులపాలై ప్రాణాలు తీసుకున్న సందర్భాలు ఎన్నెన్నో చూసాం.. పంచాయితీ స్థాయిలో పాలనను పటిష్టం చేయగలిగితే ఎంతో మేలు జరుగుతుందని రాజకీయ విశ్లేషకులు ఎప్పడూ సూచిస్తూనే వుంటారు.. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో పంచాయితీ ఎన్నికల నగారా మ్రోగింది.. ఈ ఎన్నికలు అధికార పార్టీతో పాటు, ఇటు బీఆర్ఎస్. అటు బీజేపీ పార్టీలకు ఎంతో ప్రతిష్టాత్మకంగా మారాయి.. ఎలాగైనా క్షేత్ర స్థాయిలో పట్టు సాధించి పరువు నిలుపుకోవాలని చూస్తున్నాయి..

## వ్యవసాయ రంగం బలోపేతానికి
# పంచసూత్రాలు..

గత పాలనను సరిదిద్దుతాం: సీఎం చంద్రబాబు

- 'రైతన్నా.. మీ కోసం' సభలో సీఎం చంద్రబాబు ప్రసంగం
- అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించిన సీఎం
- సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని రోడ్లపై గుంతలు ఉండవని వెల్లడి
- ఏపీ వ్యవసాయ ఉత్పత్తులను గ్లోబల్ బ్రాండ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమన్న చంద్రబాబు


11లో

# ఆర్థిక వృద్ధిలో దూసుకెళ్తోన్న భారత్

భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం బలంగా, స్థిరంగా పెరుగుతున్నదని తాజా లెక్కలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. జీడీపీ భారీ పెరుగుదలను నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో భారతదేశ వృద్ధి రేటు సాధించింది. శుక్రవారం విడుదలైన తాజా అధికారిక గణాంకాల ప్రకారం, సెప్టెంబర్ 30, 2025 ముగిసే రెండవ త్రైమాసికంలో భారతదేశ స్థూల దేశీయోత్పత్తి 8.2 శాతంగా పెరుగుదల నమోదు చేసింది. భారత ఆర్థిక వ్యవస్థ సెప్టెంబర్ 2024 త్రైమాసికంలో 5.6% వృద్ధి చెందింది ఇది ఏడు త్రైమాసికాలలో అత్యల్ప రేటు. మునుపటి త్రైమాసికంలో 7.8% నుంచి కోలుకుంది. భారతదేశ రెండవ త్రైమాసిక జీడీపీ డేటా విడుదలైంది. 2025-26 ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి 8.2 శాతం పెరిగింది. 2025-26 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో వాస్తవ ధరల వద్ద జీడీపీ రూ.48.63 లక్షల కోట్లుగా అంచనా వేయడం జరిగింది. ఇది 2024-25 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో రూ.44.94 లక్షల కోట్లుగా ఉంది. ఇది 8.2 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో నామమాత్రపు జీడీపీ, ప్రస్తుత ధరల వద్ద జీడీపీ రూ.85.25 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఇది 2024-25 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో రూ.78.40 లక్షల కోట్లుగా ఉంది. ఇది 8.7 శాతం వృద్ధి రేటును చూపుతోంది.ముఖ్యంగా ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఎకో సిస్టమ్.. వేగంగా విస్తరిస్తుండడం ఈ వృద్ధికి అద్దం పడుతోంది. పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసుల, అల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ వంటి పెట్టుబడులు గత 10 ఏళ్లలో 31.24% తో పెరుగుతున్నాయి. 2015లో ఈ పెట్టుబడులు రూ. 1.54 లక్షల కోట్లు ఉండగా.. 2025లో పరాయ పెట్టుబడులు: రూ. 23.43 లక్షల కోట్లకు చేరాయి.ప్రపంచవ్యాప్తంగా మారుతున్న ఆర్థిక పరిస్థితులు, అనిశ్చితులు పెట్టుబడిదారులను సంప్రదాయ ఈక్విటీ, డెట్ మార్కెట్ల నుంచి బయటకు నడిపించి, కొత్త ప్రత్యామ్నాయాల వైపు మళ్లించాయి. స్టార్టప్ వ్యవస్థాపకులు, ప్రొఫెషనల్స్, యువ పెట్టుబడిదారులు మాత్రమే కాదు? చిన్న పట్టణాల్లో కూడా ఆల్టర్నేటివ్ పెట్టుబడులపై ఆసక్తి భారీగా పెరుగుతోంది. పరిశ్రమ పదేళ్లలో 1.27 లక్ష కోట్ల నుంచి 8.37 లక్షల కోట్లుకు ఎగబాకింది అంటే.. ఎంత డెవలప్‌మెంట్ ఉందో అర్థం చేసుకోవచ్చు. పరిశ్రమ రంగం కూడా 49.23% తో అత్యంత వేగంగా విస్తరణ చెందింది.ఇక దేశంలో గృహ వినియోగ వంట గ్యాస్ వినియోగం కొత్త రికార్డులు నమోదు చేస్తోంది. పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ తాజా గణాంకాల ప్రకారం 2024?25లో దేశవ్యాప్తంగా గృహ గ్యాస్ వినియోగం 31.3 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరింది. ఇది కేవలం డిమాండ్ పెరుగుదలకే సంకేతం కాదు? సురక్షిత, శుభ్రమైన వంట ఇంధనాల వైపు దేశం మొగ్గు చూపుతున్నట్టు కూడా సూచిస్తోంది.గత ఇరవై ఏళ్లలో దేశంలో గ్యాస్ వినియోగం దాదాపు మూడు రెట్లు పెరిగింది. 2004?05లో 10.2 ఎంఎంటీ, 2013?14లో 16.3 ఉండగా.. పెద్ద ఎత్తున పెరుగుదల గత దశాబ్దంలోనే నమోదైంది. 2024?25 నాటికి వినియోగం 31.3 ఓటుకి చేరి? 2013?14తో పోలిస్తే రెండింతలకు పైగా పెరిగింది. మోదీ ప్రభుత్వం గత కొన్నేళ్లుగా గ్యాస్ కనెక్షన్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ముఖ్యంగా ఉజ్వల పథకం ద్వారా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు పెద్ద సంఖ్యలో వంట గ్యాస్‌ను వినియోగించడం ప్రారంభించాయి. అదనంగా దేశంలోగ్యాస్ సరఫరా వ్యవస్థ గణనీయంగా బలోపేతమైంది. రిఫైనరీ సామర్థ్యం పెరగడం, పెద్ద గోదాములు, మెరుగైన పంపిణీ నెట్వర్క్ కారణంగా గ్యాస్ రీఫిల్ అందుబాటు సులభమైంది. ఇటీవలి కాలంలో గ్యాస్ ధరలు తగ్గటం కూడా డిమాండ్‌పై ప్రభావం చూపింది.ఈ నెలలో గృహ ఎల్ పీజీ ధరల్లో మార్పు లేకపోయినా, కమర్షియల్ గ్యాస్ ధరలు మాత్రం తగ్గాయి. మూడీస్ రేటింగ్స్ 2025 లో 7 శాతం జిడిపి విస్తరణ, వచ్చే ఏడాది 6.4 శాతంతో భారతదేశం అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఆసియా పసిఫిక్ ప్రాంతంలో వృద్ధికి సూచిక అని తెలిపింది. ప్రపంచ అనిశ్చితి మధ్య భారతదేశం దేశీయ వృద్ధి దాని ఆర్థిక స్థితిస్థాపకతను బలపరుస్తాయని మూడీస్ తెలిపింది. సెప్టెంబర్ చివరలో ఊు రేటు తగ్గింపు కారణంగా పండుగ అమ్మకాలు జోరుగా సాగడంతో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికంలో భారతదేశ జీడీపీ వృద్ధి 7.5 శాతం, అంతకంటే ఎక్కువకు చేరుకుంటుందని ాఃఎ పరిశోధన నివేదిక అంచనా వేసింది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో జిడిపి వృద్ధికి ప్రధానంగా వ్యవసాయ రంగం మంచి ప్రదర్శన, వాణిజ్యం, హోటల్, ఆర్థిక, రియల్ ఎస్టేట్ వంటి సేవలు కూడా దోహదపడ్డాయి. దేశ జీడీపీ లో గతంలో అత్యధిక వృద్ధి రేటు 2024 జనవరి-మార్చిలో 8.4 శాతంగా నమోదైంది. ఏప్రిల్-జూన్ కాలంలో చైనా జిడిపి వృద్ధి 5.2 శాతంగా ఉండటంతో భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతోంది. జాతీయ గణాంకాల కార్యాలయం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, వ్యవసాయ రంగం 3.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది 2024-25 ఏప్రిల్-జూన్ కాలంలో 1.5 శాతం నుండి పెరిగింది.విడుదల చేసిన డేటా ప్రకారం, ఒక నిర్దిష్ట కాలంలో ఒక దేశ భౌగోళిక సరిహద్దులలో ఉత్పత్తి చేసిన తుది వస్తువులు, సేవల మొత్తం విలువను జీడీపీ సూచిస్తుంది. జాతీయ గణాంక కార్యాలయం (ఔూ) డేటా ప్రకారం, 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తం దేశ జీడీపీ 8.2 శాతం చొప్పున పెరిగింది.

# మామిడికాయ స్థానంలో అరటిపండు...

అనంతపురం,డిసెంబర్ 03(భారత శక్తి):

ఏపీలో అరటి రైతుల సమస్యలపై అధికార, విపక్షాల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగుతున్నాయి. ఏపీలో కిలో అరటి 50 పైసలు మాత్రమే పలుకుతోందంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ సోమవారం విమర్శలు గుప్పించారు. ఈ విషయంపై ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. అయితే వైఎస్ జగన్ ట్వీట్ మీద ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెకింగ్ విభాగం స్పందించింది. వైఎస్ జగన్ అబద్ధాలు చెప్తున్నారని ఆరోపించింది. డిసెంబర్ రెండో వారం నుంచి అరటి ధరలు పెరుగుతాయని.. రైతులు అపోహలను నమ్మవద్దని సూచించింది.ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎప్పుడు ఏ విషయం చర్చనీయాంశమవుతుందో చెప్పడం.. చాలా కష్టం. చిన్న అవకాశం దొరికినా అధికార పార్టీని ఇరుకున పెట్టాలని విపక్షం.. విపక్షానికి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా ఎదురు దాడి చేయాలని అధికార పక్షం.. ఎప్పటికప్పుడు కొత్త లెక్కలు, ఎత్తులకు పైఎత్తులు వేస్తూ.. రాజకీయ చదరంగాన్ని రసవత్తరంగా మారుస్తుంటాయి . అయితే ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో అరటి కాయ లేదా అరటి పండు.. చాలా హాట్ టాపిక్‌గా మారింది. ఈ విషయం మీద విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.. అధికార కూటమి వాగ్బాణాలు, విమర్శలు, ప్రతివిమర్శలు సంధించుకుంటున్నాయి.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల సొంత జిల్లాలో పర్యటించారు. పులివెందుల వెళ్లిన వైఎస్ జగన్ అక్కడ అరటి తోటలను పరిశీలించారు. అరటి ధర పతనం గురించి రైతులతో చర్చించారు. తమ హయాంలో అరటికి మంచి గిట్టుబాటు ధర ఉండేదన్న వైఎస్ జగన్.. కూటమి పాలనలో అరటికే కాదు.. ఏ పంటకూ గిట్టుబాటు ధర లేకుండా పోయిందని ఆరోపించారు. రాష్ట్రంలో డిమాండ్ లేకపోతే ఇతర రాష్ట్రాలకు రైళ్లల్లో రవాణా చేయించిన ఘనత తమ పార్టీ సొంతమని వైఎస్ జగన్ చెప్పుకొచ్చారు. కానీ ఇప్పటి సీఎం చంద్రబాబు అరటి రైతులను అసలు పట్టించుకోవడమే లేదని మండిపడ్డారు.ఇక సోమవారం రోజున అరటి రైతుల సమస్యపై ఓ ట్వీట్ చేశారు వైఎస్ జగన్..భారతదేశ ప్రజలరా.. ఒక్కసారి ఆంధ్రప్రదేశ్ వైపు చూడండి.. ఇక్కడ ఒక కిలో అరటిపండ్లు కేవలం 50 పైసలు మాత్రమే! ఆంధ్రప్రదేశ్‌లో అరటి రైతులు పడుతున్న కష్టాలు ఇవి. అగ్గిపెట్టెకన్నా, బిస్కెట్ కన్నా చవకగా ఇక్కడ అరటి పండ్లు దొరుకుతున్నాయి. అరటి మాత్రమే కాదు ఉల్లి నుంచి టమోటాల వరకూ.. ఇలా ఏ పంటకూ ఏపీలో గిట్టుబాటు ధర లేదంటూ వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ట్వీట్ చేశారు. రైతులు కష్టాలలో ఉంటే ఉచిత పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీలు. పెట్టుబడి సాయం వంటివేవీ లేవని విమర్శించారు. తమ పాలనలో టన్ను అరటి రూ.25000 ఉండేదన్న జగన్.. ఇప్పుడా పరిస్థితి లేదంటూ విమర్శలు చేశారు.అయితే ఏపీలో కిలో అరటి పండ్లు కేవలం 50 పైసలు మాత్రమేనంటూ వైఎస్ జగన్ చేసిన ఆరోపణలపై ప్రభుత్వం స్పందించింది. కిలో అరటిపండ్లు కేవలం 50 పైసలకు మాత్రమే అంటూ వైఎస్ జగన్ చెప్పడం పూర్తిగా సత్యదూరమని ఏపీ ప్రభుత్వం ఫ్యాక్ట్ చెకింగ్ విభాగం తెలిపింది. అక్టోబర్ నెలలో ఈ సీజన్ ప్రారంభం కాగానే అరటి టన్ను రూ.12 వేల నుంచి రూ.14 వేల వరకూ అమ్ముడైందని.. నవంబరు నెల మొదటి వారంలో ఏ గ్రేడు అరటి పండ్లు రూ.7 వేలు, బీ గ్రేడ్ రూ.4 వేలు, సీ గ్రేడ్ రూ.3వేలకు అమ్ముడైనట్లు తెలిపింది. నవంబర్ నెల నాలుగో వారంలో ఏ గ్రేడు అరటి పండ్లు టన్ను రూ.8 వేల నుంచి రూ.10 వేలకు పెరిగాయని.. బీ గ్రేడు రూ.6 వేల నుంచి రూ 8 వేలకు, సీ గ్రేడు




రూ. 4 వేల నుంచి రూ.6 వేల వరకు అమ్ముడైనట్లు తెలిపింది.అనంతపురం, సత్యసాయి , కడప, నంద్యాల జిల్లాల్లో 34,000 హెక్టార్లలో అరటి పంట సాగవుతోందని తెలిపింది. కడప, అనంతపురం జిల్లాల నుంచి 700 మెట్రిక్ టన్నుల అరటిని ఉత్తర భారతదేశానికి తరలించి.. అక్కడ విక్రయించినట్లు తెలిపింది. గత వారం రోజులుగా అరటి మెట్రిక్ టన్నుకు రూ 2 వేల నుంచి రూ.4 వేలు పెరిగిందని.. అరటి రైతులకు రవాణా రాయితీ ఇవ్వాల్సిందిగా భారతీయ రైల్వేను కూడా కోరామని వెల్లడించింది. డిసెంబర్ రెండో వారం నుంచి అరటి ధర మరింత పెరిగే అవకాశం ఉందన్న ఏపీ ప్రభుత్వం.. రైతులను నిరాశకు గురిచేసేలా ప్రకటనలు చేయడం సరికాదని సూచించింది.

# ఏపీలో బుల్లెట్ రైళ్లు..

## కర్నూలులో శంకుస్థాపన అడుగులు

కర్నూలు, డిసెంబర్ 03(భారత శక్తి):

దేశవ్యాప్తంగా బుల్లెట్ రైళ్ల నెట్‌వర్క్‌ను విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది ఆగస్టులో హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు కారిడార్లకు ప్రాథమిక అనుమతులు మంజూరు చేసింది. హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌కు సంబంధించి ఏపీలో ఉన్న 263 కిలోమీటర్ల మార్గంలో పలు చోట్ల మట్టి నమూనాలు సేకరించే పనులు ప్రారంభమైనట్లు సమాచారం. ఈ బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే గంటకు 320 కిలోమీటర్ల వేగంతో కర్నూలు నుంచి బెంగళూరుకు కేవలం గంట 20 నిమిషాల్లో చేరుకోవచ్చు.దేశంలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టి మార్పులకు శ్రీకారం చుట్టింది. అంతేకాకుండా ప్రపంచంతో పోటీ పడేలా బుల్లెట్ రైళ్లు తీసుకొస్తోంది. ఇప్పటికే ముంబై-అహ్మదాబాద్ మధ్య బుల్లెట్ ట్రైన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో బుల్లెట్ రైళ్ల నెట్‌వర్క్ మరింత విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్- బెంగళూరు కారిడార్లను ప్రకటించింది. ఈ రెండు బుల్లెట్ రైలు ప్రాజెక్టులకు దాదాపు రూ. 5.5 లక్షల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. ఈ క్రమంలో హైదరాబాద్- బెంగళూరు బుల్లెట్ ట్రైన్ కారిడార్‌కు సంబంధించి ప్రాథమిక సర్వే పనులు ప్రారంభమయ్యాయి.హైదరాబాద్- బెంగళూరు బుల్లెట్ ట్రైన్ కారిడార్ మొత్తం పొడవు 605 కిలోమీటర్లు. ఇందులో 263 కిలోమీటర్ల మార్గం ఆంధ్రప్రదేశ్‌లో ఉంటుంది. ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా ఈ మార్గం ఉంది. ఈ కారిడార్‌కు సంబంధించి ప్రాథమిక సర్వే పనులు ప్రారంభమయ్యాయి. బుల్లెట్ రైళ్లు పరుగెత్తడానికి అనువైన ట్రాక్ నిర్మాణం కోసం.. ఏపీలో పలు



చోట్ల మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. ఈ సర్వే పూర్తయ్యాక తదుపరి ప్రక్రియ కొనసాగుతుంది. బుల్లెట్ రైలు గరిష్ఠ వేగం గంటకు 350 కిలోమీటర్లు. భద్రతా కారణాల రీత్యా 320 కిలోమీటర్ల వేగంతోనే నడుపుతారు. ఈ వేగం తట్టుకునేలా అనువైన ట్రాక్ నిర్మించాల్సి ఉంటుంది.నిర్దేశించిన వేగంతో బుల్లెట్ రైలు దూసుకెళ్లాలంటే.. ట్రాక్ పటిష్ఠంగా ఉండాలి. అందుకోసం సాయిల్ టెస్టింగ్ (మట్టి పరీక్షలు) చేస్తారు. ట్రాక్ నిర్మించే ప్రదేశంలో జియో టెక్నికల్, జియో ఫిజికల్ పరీక్షలు చేస్తారు. డ్రిల్లింగ్ చేసి మట్టి, బండరాళ్ల నమూనాలు సేకరిస్తారు. అనంతరం ఆ మట్టి ఏ రకానికి చెందింది, అందులో తేమ ఎంత మేర ఉంది, స్వెల్ ప్రెషర్ ఎంత ఉందని విశ్లేషిస్తారు. బుల్లెట్ రైలు ట్రాక్ నిర్మాణంలో మట్టి పరీక్షల వివరాలు కీలకం. ఏయే ప్రాంతాల్లో ఎలివేటెడ్ మార్గాలు, సొరంగాలు, నిర్మించాలో దీన్ని బట్టే నిర్ణయిస్తారు.ఈ బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే.. ఉమ్మడి కర్నూలు వాసులు బెంగళూరుకు మరింత వేగంగా వెళ్లొచ్చు. కర్నూలు- బెంగళూరు మధ్య దూరం 427 కిలోమీటర్లు ఉంది. ప్రస్తుతం వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లాలంటే.. 5.30 గంటల సమయం పడుతోంది. బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే కర్నూలు నుంచి బెంగళూరు కంటోన్మెంట్ స్టేషన్‌కు.. గంట 20 నిమిషాల్లో చేరుకోవచ్చు.

# స్థానిక కల్చర్ కనిపించేలా రైల్వే స్టేషన్ నిర్మాణాలు

ఏలూరు, డిసెంబర్ 03(భారత శక్తి):


ఏలూరు రైల్వే స్టేషన్. పూర్తిగా ట్రెడిషనల్ లుక్ లో ఏలూరు కి దగ్గర్లోని ద్వారకా తిరుమల ఆలయ గోపురాన్ని తలపించేలా రైల్వే స్టేషన్ ను నిర్మిస్తున్నారు. "అమృత్ భారత్ స్టేషన్ " స్కీమ్ క్రింద దేశం లోని చాలా రైల్వే స్టేషన్ లను డెవలప్ చేస్తోంది కేంద్రం. ఒకప్పుడు రైల్వే స్టేషన్ అంటే గుర్తు వచ్చే పాడుబడిన భవనాలు, అపరిశుభ్రం గా ఉండే పరిసరాల స్థానం లో కోట్లు ఖర్చు పెట్టి పూర్తిగా న్యూ లుక్ ఇస్తుంది రైల్వే శాఖ. ఇప్పటికే కొన్ని స్టేషన్ లు రెడీ అయ్యాయి. మరికొన్ని స్టేషన్ ల ఆధునీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి .అయితే ఈ నిర్మాణాల సమయం లో లోకల్ కల్చర్ కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆమధ్య పూర్తిగా డెవలప్ చేసిన సూళ్లూరు పేట రైల్వే స్టేషన్ కు దగ్గర్లోని చెంగాలమ్మ గుడి ని తలపించే ఎలివేషన్ ఇచ్చారు. ఇప్పుడు ఏలూరు స్టేషన్ కు ద్వారకా తిరుమల టెంపుల్ లుక్ ఇస్తున్నారు.ద్వారకా తిరుమల (చిన తిరుపతి ) కి వెళ్లాలంటే ఏలూరు స్టేషన్ లోనే దిగాలిఏలూరు కి దగ్గర్లోనే ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రం చిన్న తిరుపతి (ద్వారకా తిరుమల ) కి వెళ్లాలంటే ఎక్స్ ప్రెస్ ట్రైన్స్ ఆగేది ఏలూరు స్టేషన్ లోనే. 20 కిమీ దూరం లో ఉన్న భీమడోలు స్టేషన్ లో అన్ని రైళ్ళు ఆగవు. అందుకే ద్వారకా తిరుమల వెళ్లే భక్తులకు ఏలూరు స్టేషన్ లో దిగడమే బెస్ట్ అప్షన్ గా ఉంది.

దాన్ని దృష్టిలో పెట్టుకునే ఏలూరు రైల్వే స్టేషన్ కు ఆ డివోషనల్ టచ్ ఇస్తున్నారు. ఇది పూర్తి అయితే ఏలూరుకు ఒక ఐకానిక్ బిల్డింగ్ గా మారుతుంది అంటున్నారు అక్కడి ప్రజలు.ఈ మధ్యనే ఏలూరు స్టేషన్ లో అమృత్ సంవాద్ పేరిట స్థానికుల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకుంది సౌత్ సెంట్రల్ రైల్వే విజయవాడ డివిజన్ అధికారుల బృందం. ఆ సందర్భంగా రైళ్లకి కొన్ని అదనపు కోచ్ లను ఏర్పాటు చెయ్యాలని.. స్టేషన్ లో కొన్ని అదనపు సౌకర్యాలు పెంచాలని ప్రయాణికులు కోరారు.

# క్వాంటం వ్యాలీకి 50 ఎకరాలు

అమరావతి,డిసెంబర్ 03(భారత శక్తి):

రాజధాని అమరావతిలో క్వాంటం వ్యాలీకి 50 ఎకరాలను కేటాయించారు. అందులో రెండు ఎకరాల్లో అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్(ఎక్యూసిసి) ఏర్పాటు చేయనున్నారు. ఇది జాతీయ సాంకేతిక భవిష్యత్ కేంద్రంగా మారనుందని పేర్కొన్నారు. ప్రస్తుతం రాయపూడి పరిధిలోని సీఆర్‌ఎ ప్రధాన కార్యాలయానికి ఉత్తరభాగంలో సీడ్ యాక్సెస్రోడ్డు అవతల దీనిని నిర్మించనున్నారు. క్వాంటం బిల్డింగ్ నిర్మాణం కోసం ఆసక్తి ఉన్న వారిని టెండర్ల కోసం పిలిచారు. ఈ నెల ఆరోతేదీతో టెండర్ల గడువు ముగియనుంది. ప్రాజెక్టు వ్యాల్యూను స్పష్టంగా పేర్కొనకపోయినా నిర్దేశిత ధరకంటే ఎవరు తక్కువకు టెండర్ వేస్తే వారికి కేటాయించేలా ప్రతిపాదనలు రూపొందించారు.ప్రస్తుతం విట్ యూనివర్శిటీలో క్వాంటం కంప్యూటర్ సెంటర్ తాత్కాలిక భవనాన్ని ఏర్పాటు చేశారు. భవిష్యత్ లో రాయపూడి వద్ద నిర్మించే శాశ్వత భవనంలోకి దీన్ని మార్చనున్నారు. అనంతరం అమరావతిని పూర్తిస్థాయి క్వాంటం సిటీగా మార్చాలనేది ప్రభుత్వ ఆలోచన. భవన నిర్మాణానికి అయ్యే ఖర్చును సీఆర్‌డిఎ ఐటీ అండ్ ఈ శాఖ సంయుక్తంగా ఖర్చు చేయనున్నట్లు టెండర్లలో పేర్కొన్నారు. ప్రస్తుత భవనాన్ని ఉ ప్లస్1 అంతస్తుగా 4,201 చదరపు మీటర్ల విస్తీర్ణంలో మెకానికల్ ఎలక్ట్రికల్ ప్లంబింగ్, ఫైర్(ఎంఈపిఎఫ్)తో గ్రీన్ బిల్డింగ్ నిబంధనల ప్రకారం నిర్మించనున్నారు. దీనిలో గ్రౌండ్ ఫ్లోర్ 1,990 చదరపు మీటర్లు, మొదటి ఫ్లోర్ 1,996 చదరపు మీటర్లు, బేస్ మెంట్ 210 చదరపు మీటర్లతో నిర్మించున్నారు. ఇవి కాకుండా హెడ్ రూము 109, డెక్ ఏరియా 130 చదరపు మీటర్ల విస్తీర్ణంతో ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు.భవిష్యత్తులో జాతీయస్థాయి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్గా మార్చాలనేనది ప్రతిపాదనగా ఉంది. దీనికోసం ఇటీవల క్వాంటం వర్కుషాపు కూడా నిర్వహించారు. టిసిఎస్, ఐబిఎంతోపాటు దేశంలో పలు ఐటి కంపెనీల ప్రతినిధులనూ దీనికి ఆహ్వానించారు. ఇందులో భాగంగా ఐబిఎం 150 క్యూబిట్ కెపాసిటీతో కంప్యూటర్ ఏర్పాటు వేసేందుకు ముందుకు వచ్చింది. టిసీఎస్ అవసరమైన సాంకేతిక నైపుణాన్ని ఇవ్వనుంది. ఎల్ అండ్ టీ నిర్మాణపరమైన అంశాల్లో భాగస్వామ్యం కానుంది. ఇలా మూడు కంపెనీలతో ఇటీవల ప్రభుత్వం ఒప్పందం. చేసుకోవడంతోపాటు క్వాంటం పాలసీని విడుదల చేసింది. వీటిలో భాగంగా క్యాంటం కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటు చేయడానికి టెండర్లు పిలిచింది కూటమి ప్రభుత్వం.ఏపీలో క్వాంటం కంప్యూటింగ్ పై అవగాహన పెంచేందుకు 50,000 మందికి శిక్షణ ఇవ్వబోతోంది ప్రభుత్వం. అమెరికా లోని వైజర్, హైదరాబాద్ లోని క్యూబైటెక్ స్మార్ట్ సొల్యూషన్స్ కలిసి ఈ శిక్షణ ఇవ్వబోతున్నట్టు



ప్రభుత్వం ప్రకటించింది. డిసెంబర్ 8 నుండి ఈ ట్రైనింగ్ ప్రారంభం కానుంది.ఈ ట్రైనింగ్ మూడు పార్టు లుగా ఉంటుంది. ఫేజ్ 1 ట్రైనింగ్ 4 వారాలు ఉంటుంది. ఏపీ విద్యార్థులకు ఫీజ్ 500. మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంజనీరింగ్, కంప్యూటర్ కోర్సులు చదువుతున్న వారు, ఆల్రెడీ చదువు పూర్తి చేసుకున్న వారు, ఆయా సబ్జెక్టు ల్లో ప్రొఫెసర్ లుగా పనిచేస్తున్న వారు ఈ కోర్స్ కోసం అప్లై చేసుకోవచ్చు. వేరే రాష్ట్రాలకు చెందిన విద్యార్థులయితే 1000 రూపాయలు, ఆల్రెడీ టీచర్స్ గా జాబ్ చేస్తున్న వారు 2000 రూపాయలు ఫీజ్ చెల్లించాల్సి ఉంటుంది. ఫేజ్ 1 లో మంచి మార్కులు తెచ్చుకున్న 3000 మందిని ఎంపిక చేసి వారికి రెండో ఫేజ్ లో శిక్షణ ఇస్తారు. ఈ ట్రైనింగ్ మొత్తం ఆన్ లైన్ లోనే ఉంటుంది.

# కొడాలి నానిపై ఉపేక్ష ఎందుకు

విజయవాడ, డిసెంబర్ 03(భారత శక్తి):

వైసీపీ హయాంలో కొడాలి నాని వాయిస్ బలంగా వినిపించేది. అయితే అదేదో ఆయన నిర్వర్తించిన శాఖకు సంబంధించినది కాదు. ఈ రాష్ట్ర సమస్యలపై అంతకంటే కాదు. నందమూరి కుటుంబం పేరు చెప్పుకుంటూ నారా కుటుంబాన్ని టార్గెట్ చేయడం నానికి అలవాటైన విద్యగా మారిపోయింది. నాడు టిడిపి ప్రజా సమస్యలపై పోరాటం ప్రారంభిస్తే.. కొడాలి నాని మాత్రం నందమూరి కుటుంబానికి నారా కుటుంబం అన్యాయం చేసిందని.. ఎన్టీఆర్ ను వెన్నుపోటు పొడిచి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని చెబుతూ చివరకు.. జూనియర్ ఎన్టీఆర్కు అన్యాయం చేశారని ముగించేవారు కొడాలి నాని. అటువంటి కొడాలి నాని పై సగటు టిడిపి అభిమాని ఆగ్రహంగా ఉండేవారు. కూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే కొడాలి నాని అరెస్టు ఉంటుందని భావించారు. కానీ అటువంటిదేమీ జరగలేదు. చంద్రబాబు కుటుంబమే టార్గెట్.. కొడాలి నాని నోటికి చంద్రబాబు కుటుంబమంతా బలి అయ్యేది. వాడు వీడు అంటూ చంద్రబాబు పై ప్రయోగించే భాష చెవులకు ఇబ్బందిగా ఉండేది. లోకేష్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడేవారు. హద్దులు దాటి మాట్లాడేవారు. సగటు టిడిపి అభిమాని అయితే కొడాలి నాని పై ప్రతీకార వాంఛతో రగిలిపోయేవారు. చంద్రబాబు అరెస్టు సమయంలో మానవత్వం మరిచి చేసిన వ్యాఖ్యలను విన్నవారి రక్తం మరిగిపోయేది. అంతలా ఆ కుటుంబాన్ని టార్గెట్ చేసిన కొడాలి నాని తప్పకుండా మూల్యం చెల్లించుకోవాలని సగటు టిడిపి అభిమాని బలంగా కోరుకునేవారు. జగన్ కళ్ళలో ఆనందం కోసం కొడాలి నాని ఆ వ్యాఖ్యలు చేసేవారు. అయితే ఆనందం మాట పక్కన ఉంచితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘోర వైఫల్యానికి, ఫలితాలకు కూడా కొడాలి నాని వంటి వారు ప్రధాన కారణం. గుడివాడ కొడాలి నాని అడ్డా.. దమ్ముంటే రండిరా అంటూ జగన్ ప్రోత్సాహంతో రెచ్చిపోయేవారు కొడాలి నాని. విపరీతమైన విజయగర్వంతో, అహంకారపూరిత మాటలతో ఐదేళ్లపాటు టిడిపి శ్రేణులను చుక్కలు చూపించారు. పద్ధతి లేని మాటలతో,



బూతు వ్యాఖ్యలతో జగన్మోహన్ రెడ్డిని ఆకట్టుకున్నారు. టిడిపి శ్రేణులకు వ్యతిరేకంగా మారిపోయారు. 18 నెలల కిందట అధికారంలోకి వచ్చిన టిడిపి శ్రేణులు నాని అరెస్టును కోరుకున్నాయి కానీ అది జరగలేదు. వంశీని అరెస్టు చేసి.. వల్లభనేని వంశీ మోహన్ కు మించి కొడాలి నాని మాట్లాడేవారు. అయితే వంశీ మోహన్ ను అరెస్టు చేసి ఉంచినప్పుడు ఆయనపై సానుభూతి లభించలేదు. ఎందుకంటే ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలు తెలుసుకున్నారు కూడా. అయితే ఇప్పటికీ కొడాలి నాని మాటలు విని.. చేతలు చూసిన టిడిపి శ్రేణులు కొడాలి నాని అరెస్టు ఎప్పుడు అని ఎదురు చూస్తున్నాయి. ఆయన విషయంలో ఎందుకు ఉపేక్షిస్తున్నట్టు అని అనుమానం ఒకటి కలుగుతోంది. అయితే గుడివాడ జంక్షన్ లో కొట్టుకొని తీసుకెళ్దాం అంటూ రెడ్ బుక్కును గుర్తుపెట్టుకొని మాట్లాడారు లోకేష్. కానీ అటువంటిదేమీ కనిపించకపోవడంతో కొడాలి నాని క్షమించేసారని నాయకత్వం పై టిడిపి శ్రేణులు అనుమానిస్తున్నాయి.

# సీఎం లోకేష్... టాక్ ఆఫ్ హస్తిన

న్యూఢిల్లీ,డిసెంబర్ 03(భారత శక్తి):

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఢిల్లీ స్థాయిలో పట్టు సంపాదించారు. ఏపీకి భవిష్యత్ నేతగా ఇప్పటికే హస్తినలో ముద్రపడిపోయారు. అనేక మంది కేంద్ర మంత్రులు సయితం లోకేశ్ త్వరలోనే కీలకమైన పదవి చేపట్టనున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. కేవలం రెండేళ్లలోనే లోకేశ్ ఈ రేంజ్ లో దూసుకుపోయారు. తండ్రి చంద్రబాబు రాజకీయ వారసత్వంతో పాటు తండ్రి ఎన్టీఆర్ లెగసీని కూడా ఒడిసిపట్టుకుని తాను నాయకుడుగా ఎదిగేందుకు ఉపయోగించుకున్నారు. ఇప్పటికే హస్తినలో లోకేశ్ గురించి పెద్ద స్థాయిలో చర్చ జరుగుతుంది. చంద్రబాబు నాయుడు ఇప్పటికే నాలుగు దఫాలుగా ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టడంతో లోకేశ్ పగ్గాలు చేపట్టడం ఎంతో దూరం లేదని అనుకుంటున్నారు. నేడు కూడా ఢిల్లీలో ఆయన పర్యటిస్తున్నారు.కానీ చంద్రబాబు నాయుడు వయసు మీదపడినా ఆరోగ్యంగా ఫిట్ గా ఉన్నారు. ఆయన ఏపీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తరహాలో ఎక్కువ కాలం రాష్ట్ర రాజకీయాల్లోనే ఉండాలని భావిస్తున్నారు. కానీ దీపం ఉండగానే ఇల్లు చక్కపెట్టుకోవాలని భావించిన చంద్రబాబు నిన్న మొన్నటి వరకూ పార్టీ కార్యక్రమాలతో పాటు అన్ని విషయాలను లోకేశ్ కు అప్పగించిన చంద్రబాబు పాలనపరమైన విషయాల్లోనూ లోకేశ్ ను చురుగ్గా పాల్గొనేలా చేస్తున్నారు. మంత్రిగా ఉన్న లోకేశ్ ను తన వెంట తిప్పుకుంటున్నారు. పుట్టపర్తికి ప్రధాని వచ్చినా, రాష్ట్రపతి వచ్చినా, ఉప రాష్ట్రపతి వచ్చినా చంద్రబాబుతో పాటు లోకేశ్ కూడా హాజరవ్వడాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు ఈ ధోరణితోనే చూస్తున్నారు. నారా లోకేశ్ కూడా ఏ స్థాయిలో తొందరపడటం లేదు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ తర్వాత తాను అంటూ బయటకు కనిపించే ప్రయత్నం చేస్తున్నారు. మరొకవైపు రాష్ట్రంలో ఇప్పటికే పట్టు పెంచుకున్న నారా లోకేశ్ ఢిల్లీ స్థాయిలో పరిచయాలు, పట్టు పెంచుకునే కార్యక్రమంలో భాగంగా వరసగా హస్తిన చుట్టూ తిరుగుతున్నారు. ఇక విదేశాల్లో కూడా ఆయన పర్యటిస్తూ నాటి చంద్రబాబు తరహాలోనే పార్టీని బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తుంది. ఇప్పటికిప్పుడు లోకేశ్ ను అత్యున్నత పదవిలో చూడకపోయినా ఆయన ట్రైనింగ్ పూర్తయి సిద్ధంగా ఉన్నారని, ఏ సమయంలోనైనా కీలక పదవి చేపట్టే అవకాశముందని పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు. అందుకే లోకేశ్ వద్దకు నాయకులు క్యూ కడుతున్నారు. గత ఎన్నికలకు ముందు నుంచే ఈ రకమైన అభిప్రాయం వినిపించినా రెండేళ్లకు అది రెట్టింపయిందని అంటున్నారు.



# విజయసాయికి చెక్ పెట్టిన టీడీపీ




విజయవాడ, డిసెంబర్ 03(భారత శక్తి):

మాజీ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి బీజేపీలో చేరాలని చేసిన ప్రయత్నాన్ని కొందరు అడ్డుకున్నారు. అయితే ఆయన ఎప్పుడో బీజేపీలో చేరాల్సింది. అయితే ఒక రకంగా వైసీపీ ఆడిన నాటకంలో ఇది వికటించిందంటున్నారు. విజయసాయిరెడ్డి నేరుగా వైసీపీ నుంచి వచ్చి బీజేపీలో చేర్చుకునే పరిస్థితి లేదు. ఎందుకంటే చంద్రబాబు నాయుడు అవసరం బీజేపీకి ఉంది. కేంద్ర ప్రభుత్వంలో చంద్రబాబు అవసరం బీజేపీకి లేకపోతే 2014 ఎన్నికల్లో ఓటమి తర్వాత సుజనా చౌదరి, సీఎం రవేష్ వంటి వారు చేరిన తరహాలోనే విజయసాయిరెడ్డి కూడా బీజేపీలో చేరే వారు. కానీ సాయిరెడ్డిని బీజేపీలో చేర్చుకుంటే టీడీపీ అంగీకరించదు. అందుకే బీజేపీలో ఆయన చేరికకు రెడ్ సిగ్నల్ పడిందంటున్నారు.బీజేపీలో చేరడానికే విజయసాయిరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. అందుకే జగన్ కు వ్యతిరేకంగా ఏమీ మాట్లాడకపోయాని ఆయన చుట్టూ ఉన్న కోటరీపైన మాత్రమే విమర్శలు చేశారు. జగన్ ను మంచి నేతగానే ఇప్పటికీ మాట్లాడుతున్నారు. రెండు సార్లు రాజ్యసభ పదవి ఇచ్చిన జగన్ కు, అదే సమయంలో జగన్ ఆస్తుల చిట్టా అంతా తెలిసిన విజయసాయిరెడ్డి బంధాన్ని ఎవరూ అంత తేలిగ్గా తుంచలేరు. సాయిరెడ్డి వైసీపీ నుంచినేరుగా బయటకు వచ్చి బీజేపీలో చేరితే తప్పుడు సంకేతాలు వెళతాయని భావించి, ఆ పార్టీకి, రాజ్యసభకు రాజీనామా చేసిపడేశారు సాయిరెడ్డి. అయితే టీడీపీ మాత్రం సాయిరెడ్డిని జగన్ కోవర్టుగానే భావిస్తుంది. అందుకే బీజేపీలో సాయిరెడ్డి చేరికను అడ్డుకుందంటున్నారు.విజయసాయిరెడ్డి తనకు పవన్ కల్యాణ్ తో సత్సంబంధాలున్నాయంటున్నారు. చంద్రబాబు తో తనకు విభేదాలు లేవని చెబుతున్నారు. కానీ విజయసాయిరెడ్డిని ఎవరూ నమ్మడం లేదు. పార్టీలో చేర్చుకోవడానికి సిద్ధపడటం లేదు. సాయిరెడ్డి, జగన్ కు మాత్రమే కాదు వైఎస్ కుటుంబంతో ఆయనకు కొన్ని దశాబ్దాలుగా ఉన్న సంబంధాలు వేరు చేయలేనివి. ఆడిటర్ గా వైఎస్ కుటుంబానికి చెందిన ఆస్తులను పరిరక్షించేందుకు ఆయన కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే సాయిరెడ్డి టీటీడీ మెంబర్ అయ్యారు. అందుకే జగన్ కోవర్టుగానే విజయసాయిరెడ్డిని చూస్తున్నారు. సాయిరెడ్డిని ఏ రాజకీయ పార్టీ నమ్మక పోవడంతో తిరిగి జగన్ వద్దకు చేరడానికి సిద్ధమవుతున్నారన్న ప్రచారం కూడా జరుగుతుంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# జీయర్ స్వామి ఆశీస్సులతో విద్యార్థుల్లో సమానత్వ జాగృతి

## వ్యాస, వక్తృత్వ పోటీల ఫలితాలను ప్రకటించిన ప్రజ్ఞా వికాస్ రాష్ట్ర అధ్యక్షులు శేఖర్ రావు


కరీంనగర్, డిసెంబర్ 3(భారతశక్తి ప్రతినిధి):విద్యార్థుల్లో కృతజ్ఞత, సమానత్వ భావనలు పెంపొందించాలనే ఉద్దేశంతో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి మంగళాశాసనాలతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక ప్రతిభా పోటీలో భాగంగా కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా నిర్వహించబడ్డాయనీ ట్రస్మా ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల నుంచి ఆరవ తరగతి నుండి పదో తరగతి వరకు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కరీంనగర్



లోని కోట రెసొనెన్స్ జూనియర్ కళాశాలలో జరిగిన వ్యాసరచన, వక్తృత్వ విభాగాల్లో గణనీయ సంఖ్యలో విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారు. పూర్తయిన పరీక్షల ఫలితాలను నేడు జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విడుదల చేశారు. వ్యాసరచన విభాగంలో శ్రీ సరస్వతి శిశు మందిర్, కరీంనగర్ కు చెందిన బి. సాయి శ్రేష్ఠ ప్రథమ స్థానం, సరస్వతి పాఠశాల, వెలిచాలకు చెందిన నెట్టు సంజన ద్వితీయ స్థానం సాధించారు.వక్తృత్వ విభాగంలో పారామిత హెరిటేజ్ విద్యార్థి ఎ. సినీతిక ప్రథమ స్థానం, జెడ్పీహెచ్ఎస్ ఆసిఫ్నగర్ విద్యార్థి డి. లక్ష్మీ శ్లోక ద్వితీయ స్థానం గెలుచుకున్నారు.జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన ఈ నలుగురు విద్యార్థులు హైదరాబాద్లోని జీయర్ స్వామి ఆశ్రమంలో జరగనున్న రాష్ట్రస్థాయి ఫైనల్ పోటీల్లో పాల్గొననున్నారు.రాష్ట్రస్థాయి విజేతలకు బహుమతులు స్వయంగా చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా ప్రదానం చేయబడనున్నాయి. ఫలితాలను ప్రజ్ఞ వికాస్ రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్రావు, కోట జూనియర్ కళాశాలల చైర్మన్ డాక్టర్ డి. అంజిరెడ్డి సంయుక్తంగా విడుదల చేశారు, వికాస్ తరంగిణి అధ్యక్షులు గౌతమ్ రావు అధ్యక్షతన జరిగింది.విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్రస్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని అభిలషించారు.

# బోడుప్పల్ లో డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ పర్యటన

మేడిపల్లి, డిసెంబర్ 03(భారత శక్తి):అర్హులైన నిరుపేద కుటుంబాలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందించడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. బుధవారం బోడుప్పల్ కార్పొరేషన్ 26వ డివిజన్‌లో 29 మంది బెనిఫిషియరీలకు కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ నిరుపేదల గృహసంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తి చేయాలనే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు.ఈ కార్యక్రమంలో బోడుప్పల్ కార్పొరేషన్ అధ్యక్షుడు పోగుల నరసింహ రెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ యాదవ్, మేడ్చల్ నియోజకవర్గం బి%-%బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, తోటకూర రాజు యాదవ్, రాపోలు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



# ఉపసంహరణలో ఎలాంటి ఒత్తిడి చేయకూడదు: కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్

సూర్యాపేట (భారతశక్తి జిల్లా ప్రతినిధి) డిసెంబర్ 3:అభ్యర్థులను నామినేషన్ ఉపసంహరణలో ఎలాంటి ఒత్తిడికి, ప్రలోభాలకు గురి చేయరాదని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.కలెక్టరేట్ కార్యాలయం లోని వి సి హాల్ లో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫి రెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి విడత కింద నిర్వహించనున్న 8 మండలాల్లోని గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి నేటితో ఉపసంహారణ పూర్తి అవుతుందని పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటించాలని సూచించారు.సర్వీస్ ఓటర్లకు,ఎన్నికల నిర్వహణలో పాల్గొనే అధికారులకు, సపోర్టింగ్ స్టాఫ్ కు, ఎన్నికలలో ఉపయోగించే వాహన డ్రైవర్లకు ఫారం 14 ద్వారా పోస్టల్ బ్యాలెట్ జారీ చేయాలని,వారి ఓటు ఉన్న సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఫెసిలిటేషన్ సెంటర్ నందు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.పోస్టల్ బ్యాలెట్ పంపిణి ప్రక్రియ సాఫీగా,పారదర్శకంగా నిర్వహించాలని,ప్రతిరోజు ఉదయం స్ట్రాంగ్ రూమ్ నుండి పోస్టల్ బ్యాలెట్ బాక్సులను పోలీస్ స్ట్రాంగ్ రూమ్ నుండి ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ కు పోలీస్ బందోబస్తు తో తీసుకెళ్లాలని అక్కడ గ్రామపంచాయతీల వారీగా బ్యాలెట్ బాక్స్ లను ఏర్పాటు చేసి అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాట్లు చేయాలని మరలా సాయంత్రం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్ కి పోలీస్ ఎస్కార్ట్ తో తరలించి భద్ర పర్చలని సూచించారు. ఈ ప్రక్రియను మొత్తం వీడియో రికార్డ్ చేయాలని అన్నారు.పోస్టల్ బ్యాలెట్ ఎలా ఉపయోగించాలో ఎంపీడీవో కార్యాలయంలోని ఫెసిలిటేషన్ సెంటర్ నందు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అన్నారు.మొదటి దశ లో జరిగే గ్రామ పంచాయతీ సర్పంచ్ లకు, వార్డు సభ్యులకు నామినేషన్ల ఉపసంహరణ నేటి తో పూర్తవ్వడంతో పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటించాలని పోటీ చేసే అభ్యర్థులు ఆరుగురు కంటే ఎక్కువగా ఉంటే బ్యాలెట్ పేపర్లు ప్రింట్ చేయాల్సింది కాబట్టి తగ్గిన ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.పోటీ చేసే అభ్యర్థుల జాబితా ఖరారు అయిన తర్వాత అభ్యర్థులతో ఆర్ ఓ లు సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రవర్తన నియమావళి మార్గదర్శకాలు, ఎన్నికల ఖర్చుల నిర్వహణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.మొదటి విడత, రెండో విడత నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగిందని ఇలాగే అధికారులు సమన్వయం చేసుకుంటూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు.అంతకుముందు అవినీతి నిరోధక శాఖ పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ వీడియో కాన్ఫి రెన్స్ లో ఎస్పి కే నరసింహ, అదనపు కలెక్టర్ కే సీతారామారావు, జడ్పీ సి ఈ ఓ వివి అప్పారావు, డి పి ఓ యాదగిరి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి శ్రీనివాస్,డి ఎల్ పి ఓ నారాయణ రెడ్డి, తదితరులు ఈ వీడియో కాన్ఫి రెన్స్ కు హాజరైనారు.

# జనసేనలోకి హేమ



హైదరాబాద్, డిసెంబర్ 03(భారత శక్తి):

సినీ పరిశ్రమకు చెందిన చాలామంది వ్యక్తులు రాజకీయాల్లో రాణించారు. అయితే అందులో సక్సెస్ అయిన వారు కొంతమందే. ఆర్కే రోజా రాజకీయాల్లోకి వచ్చి మంత్రి స్థాయికి ఎదిగారు. ఆపై పవన్ కళ్యాణ్ సైతం ఈ రాష్ట్రానికి డిప్యూటీ సీఎం అయ్యారు. మెగా బ్రదర్ నాగబాబు సైతం ఎమ్మెల్సీ అయ్యారు. వైసీపీ హయాంలో పోసాని కృష్ణ మురళి, అలీ, 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీరాజ్ తదితరులు నామినేటెడ్ పదవులు అనుభవించారు. అయితే చిత్ర పరిశ్రమ నుంచి వచ్చిన వ్యక్తులు వివాదాస్పద ముద్రను చాటుకున్నారు. అయితే కొంతమంది ఇలా వచ్చి అలా మళ్లీ సినీ పరిశ్రమలోకి వెళ్ళిపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్, నటిగా గుర్తింపు తెచ్చుకున్న హేమ రాజకీయాల్లోకి వస్తారని తెలుస్తోంది. ఇటీవల తన మనసులో ఉన్న మాటను కూడా ఆమె బయటపెట్టారు. డ్రగ్స్ కేసులో ఇరుక్కుని.. కామెడీ పరంగా కూడా చాలామంది మహిళ నటీమణులు రాణించారు. అందులో హేమ కూడా ఒకరు. గత కొంతకాలంగా ఆమె సినిమాల్లో పెద్దగా కనిపించడం లేదు. డ్రగ్స్ కేసులో ఇరుక్కున్నారు. జైలుకు కూడా వెళ్లారు. ఇటీవల ఆమెకు క్లీన్ చీట్ లభించింది. అయితే ఇప్పుడు ఆమె మూవీ ఆర్ట్స్ అసోసియేషన్ కు సంబంధించిన వివాదాన్ని పరిష్కరించేందుకుగాను పవన్ కళ్యాణ్ ను కలుస్తానని చెబుతున్నారు. పనిలో పనిగా తన రాజకీయ ఆసక్తి, తన అభిలాషను సైతం పవన్ కళ్యాణ్ కు వివరిస్తానంటున్నారు. త్వరలో జనసేనలో చేరుతానని కూడా హింట్ ఇస్తున్నారు. అయితే ఆమెను జనసేనలోకి తీసుకుంటారా? లేదా? అన్నది చూడాలి. నటిగా గుర్తింపు.. గోదావరి ప్రాంతాలకు చెందిన హేమ క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా సినీ పరిశ్రమలో అడుగుపెట్టి తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు. కామెడీ టైమింగ్ ఉన్న నాటిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే 2014 ఎన్నికల్లోనే ఆమె రాజకీయాల్లోకి వచ్చారు. సమైక్యాంధ్ర ఉద్యమ పార్టీ నుంచి పోటీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు చివరి ముఖ్యమంత్రిగా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి ఆ పార్టీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో గోదావరి జిల్లాలో ఓ నియోజకవర్గంలో నుంచి పోటీ చేసిన హేమ నాలుగువేల వరకు ఓట్లు సొంతం చేసుకున్నారు. అయితే తర్వాత ఆమెకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి సైతం ఆఫర్లు వచ్చినట్లు తెలుస్తోంది. కానీ ఆమె మాత్రం జనసేనలో చేరుతారని ప్రచారం అన్నది సాగుతోంది. తనకు టీటీడీ బోర్డు మెంబర్ గా ఆసక్తి ఉందని ముందుగానే ప్రకటించుకున్నారట హేమ. చూడాలి ఆమె జనసేనలో చేరుతారా? లేదా? అన్నది.

# మారని పాకిస్తాన్ వక్రబుద్ధి

## వరద బాధితులకు ఎక్స్‌పైర్ ఫుడ్

లాహోర్, డిసెంబర్ 3,

పాకిస్థాన్ చిల్లర పనులకు అంతేలేకుండా పోతుంది. భారతదేశంపై నిత్యం అసత్యాలతో కూడిన వ్యాఖ్యలు చేసే పాకిస్థాన్.. తమ దేశంలో పరిస్థితులు దిగజారుతున్నా సరిచేసుకొనే ప్రయత్నం చేయడం చేయడం లేదు. పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతున్నా.. ఉగ్రవాదులను పెంచిపోషిస్తూ భారతదేశంపై దాడులకు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అయితే, తాజాగా.. పాకిస్థాన్ తనకు అలవాటుగా మారిన చిల్లర పనులతో ప్రపంచ దేశాల ముందు పరువు పోగొట్టుకుంది.దిత్వా తుపాను ఇటీవల శ్రీలంకలో విధ్వంసం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ తుపాను కారణంగా ఆ దేశం అతలాకుతలమైంది. భారీ వర్షాల కారణంగా 350మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.. వేల సంఖ్యలో నిరాశ్రయులయ్యారు. దాదాపు 11.18లక్షల మందిపై విపత్తు ప్రభావం పడిందని శ్రీలంక పేర్కొంది. దిత్వాతో భారీ నష్టపోయిన శ్రీలంకను ఆదుకునేందుకు పలు దేశాలు ముందుకొస్తున్నాయి. భారతదేశం కూడా శ్రీలంకకు అండగా నిలిచింది.శ్రీలంకలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో భారత ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ముమ్మరంగా సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. ఆపదలో ఉన్నవారిని రక్షిస్తున్నాయి. ఆపరేషన్ సాగర్ బంధు పేరిట శ్రీలంకలో భారత్ సహాయక చర్యలు నిర్వహిస్తోంది. అంతేకాక.. తమ వంతుగా ఆహారం, వైద్య సామగ్రి, అత్యవసర సదుపాయాలను శ్రీలంకకు అందిస్తోంది.దిత్వా తుపాను ప్రభావంతో వణుకుతున్న శ్రీలంకకు భారత్ తో పాటు పాకిస్థాన్ సాయం అందించింది. అయితే, పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని చాటుకుంది. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాల్సింది పోయి.. వారికి గడువు ముగిసిన వస్తువులను సాయంగా పంపించిందనే వార్తలు వస్తున్నాయి. వీటికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. శ్రీలంక అధికారులు కూడా ఈ వ్యవహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.



పాకిస్థాన్ హైకమిషన్ సోషల్ మీడియాలో స్వయంగా పంచుకున్న కొలంబోకు వెళ్లే సహాయ ప్యాకేజీలపై గడువు తేదీ ఇప్పటికే ముగిసినట్లుగా ఉంది. దీంతో పాకిస్థాన్ తీరుపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీలంకకు సాయంగా ఆహారం, ఔషధాలను పాకిస్థాన్ పంపించింది. ఇవి కొలంబోకు చేరుకున్న విషయాన్ని తెలయజేస్తూ శ్రీలంకకు పాకిస్థాన్ ఇప్పుడు ఎప్పుడూ అండగా ఉంటుంది అని ముద్రించిన ప్యాకెట్లను శ్రీలంకలోని పాకిస్థాన్ హై కమిషన్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది.ఆ ప్యాకెట్లపై గడువు తేదీ 2024 అక్టోబర్ లోనే ముగిసినట్లు తెలిసింది. వీటిని గమనించిన శ్రీలంక అధికారులు.. ఈ విషయాన్ని పాకిస్థాన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. పాకిస్థాన్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. పాకిస్థాన్ పొరుగుదేశాలకు అందించే సహాయంలోనూ చిల్లర పనులకు పాల్పడటంతో ప్రపంచ దేశాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌కు కేంద్రం నిధులు

వరంగల్, డిసెంబర్ 03(భారత శక్తి):




వరంగల్‌ను రెండవ రాజధానిగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంలో భాగంగా.. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కేంద్ర ప్రభుత్వం నిధులను వేగవంతం చేస్తోంది. ఇప్పటికే రూ.30 కోట్లు రాష్ట్రానికి అందజేయగా.. త్వరలో మరో రూ.30 కోట్లు ఇస్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. రూ.1,700 కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా పెట్టుకున్న ఈ పార్కులో.. ఎవర్ టాప్ టెక్స్ అనే కొరియా కంపెనీ రూ.1,100 కోట్లు పెట్టుబడి పెట్టి 12 వేల మందికి ఉపాధి కల్పించనుంది. ఈ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా స్థానిక యువతకు.. ముఖ్యంగా మహిళలకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత రెండవ రాజధానిగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తున్న వరంగల్ జిల్లా రూపురేఖలను మార్చే శుభవార్త ఇది. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా స్థానిక యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. దేశంలోని అతిపెద్ద మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఒకటైన ఈ మెగా టెక్స్‌టైల్ పార్కు పనులు వేగవంతం కావడంపై ఓరుగల్లు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కేంద్ర ప్రభుత్వ పీఎం-మిత్ర పథకం కింద ఎంపికైన దేశంలోని 7 మెగా టెక్స్‌టైల్ పార్కుల్లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఒకటి. ఈ ప్రాజెక్టు పురోగతిపై కేంద్ర మంత్రి సమీక్ష నిర్వహించారు. మొత్తం రూ. 200 కోట్ల వ్యయంతో ఈ మెగా టెక్స్‌టైల్ పార్కు నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం చేపడుతోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి తొలి విడతగా రూ. 30 కోట్లు అందజేయగా.. త్వరలోనే మరో రూ. 30 కోట్లు కేటాయిస్తామని కిషన్ రెడ్డి తెలిపారు. వరంగల్ జిల్లాలోని గీసుకొండ మండలం శాయంపేట, సంగెం మండలం చింతపల్లి గ్రామాలలో సుమారు 2 వేల నుండి 3 వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ పార్కును ఏర్పాటు చేస్తున్నారు.భూసేకరణ పనులు దాదాపుగా పూర్తయ్యాయని మంత్రి పేర్కొన్నారు. ఈ పార్కు ద్వారా మొత్తం రూ. 1,700 కోట్ల పెట్టుబడులు వస్తాయని.. తద్వారా 12,500 మందికి పైగా స్థానిక యువతకు.. ముఖ్యంగా మహిళలకు ఉపాధి లభిస్తుందని అంచనా. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో విజయం సాధించింది. ఎవర్ టాప్ టెక్స్ అనే దక్షిణ కొరియా కంపెనీ ఈ పార్కులో ఏకంగా రూ. 1,100 కోట్ల మేర భారీ పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందం చేసుకుంది.ఈ పెట్టుబడితో 11 వేల మందికి ఉపాధి కల్పిస్తామని కంపెనీ హామీ ఇచ్చింది. ఇది ప్రభుత్వ యాజమాన్యంలోని ప్రాజెక్టు కావడంతో... దీని నిర్మాణాన్ని తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక, మౌలిక సదుపాయాల సంస్థ పర్యవేక్షిస్తుంది. ఈ పార్కులో పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడానికి అన్ని రకాల అత్యాధునిక మౌలిక వసతులను (రోడ్లు, విద్యుత్, నీరు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు) కల్పిస్తున్నారు.యంగ్ వన్ కార్పొరేషన్ కంపెనీ ఇప్పటికే ఈ పార్కులో తన వాణిజ్య ఉత్పత్తిని (2025 అక్టోబర్ నుండి) ప్రారంభించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించి పార్కు భూమిపూజ చేయించాలనే ఉద్దేశంతో ఉన్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రాజెక్టు వరంగల్ ఆర్థిక దశను పూర్తిగా మార్చనుంది.

# మాట నెగ్గించుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

నల్గొండ, డిసెంబర్ 03(భారత శక్తి):

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మద్యం షాపుల నిర్వహణపై తనదైన శైలిలో కొన్ని షరతులు విధించిన సంగతి తెలిసిందే. ఊరి చివరనే మద్యం షాపులు, మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే అమ్మకాలు, పర్మిట్ రూములకు సాయంత్రం 6 గంటల తర్వాతే అనుమతి వంటి సూచనలు చేశారు. తాజాగా మద్యం దుకాణాలు గెలుచుకున్న షాపు యజమానులు.. ఇప్పుడు వాటిని అమలు చేస్తున్నారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యే మాట నెగ్గిందని చర్చించుకుంటున్నారు. అన్ని చోట్లా ఇలానే ఉంటే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. నిత్యం ఏదో ఒక అంశం మీద స్పందిస్తూ వార్తల్లో నిలుస్తుంటారు. ఈక్రమంలో గతంలో మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వైన్ షాపులు దక్కించుకున్న వారు.. గ్రామానికి చివర మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని.. అలానే ఉదయం నుంచే వైన్స్ తెరవద్దని.. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే మద్యం అమ్మకాలు ప్రారంభించాలని సూచించారు. దీనితో పాటుగా.. అసలు పర్మిట్ రూములకు అనుమతి ఇవ్వొద్దని.. ఒకవేళ ఇవ్వాల్సి వస్తే.. సాయంత్రం ఆరు గంటల తర్వాతే వాటిల్లోకి అనుమతివ్వాలని సూచించిన సంగతి తెలిసిందే. దీనిపై అప్పట్లో పెద్ద గందరగోళమే చెలరేగింది. కానీ ఈ అంశంలో రాజగోపాల్ రెడ్డి తన మాట నెగ్గించుకున్నారు. మద్యం షాపుల నిర్వహణలో ఆయన సూచనలు అమలు చేస్తున్నారు దుకాణాదారులుమునుగోడు నియోజకవర్గంలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వైన్స్ యజమానులు.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచన మేరకు ఊరి బయటే మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. అలానే ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే మద్యం విక్రయాలు మొదలుపెడుతున్నారు. సాయంత్రం 6 గంటలకు పర్మిట్‌రూంలోకి అనుమతి ఇస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తన మాట నెగ్గించుకున్నారని కామెంట్ చేస్తున్నారు స్థానికులు. అన్ని గ్రామాల్లో ఇదే అనుసరిస్తే.. చాలా బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే సమయంలోనే ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి.. మునుగోడు నియోజకవర్గంలోని మద్యం దుకాణాల యజమానులతో కీలక భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మద్యం షాపు ఓనర్స్‌కు కీలక సూచనలు చేశారు. బెల్ట్ షాపులు నిర్వహించొద్దని, సిండికేట్ ఏర్పడకూడదని.. ఊరి చివరే మద్యం అమ్మకాలు జరపాలని.. అలానే పర్మిట్‌రూంలకు పర్మిషన్ ఇవ్వొద్దని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వారికి సూచించిన సంగతి తెలిసిందే.అనంతరం మద్యం దుకాణాలు దక్కించుకున్న యజమానులతో ఎమ్మెల్యే



రాజగోపాల్ రెడ్డి.. హైదరాబాద్‌లోని తన నివాసంలో ప్రత్యేక భేటీ నిర్వహించారు. ఆయన పెట్టిన కండీషన్లకు మద్యం దుకాణాదారులు, వ్యాపారులు ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఊరి బయటే మద్యం షాపులను ఏర్పాటు చేయగా.. తాజాగా సోమవారం వాటిని ప్రారంభించారు. అలానే ఎమ్మెల్యే సూచించనట్లుగానే మధ్యాహ్నం ఒంటి గంట తర్వాతనే మద్యం విక్రయాలు ప్రారంభించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తొలి విడత ఏకగ్రీవాలు లెక్క తేలింది

## వికారాబాదలో 16.. జగిత్యాలలో ఒకటి

హైదరాబాద్,డిసెంబర్ 03(భారత శక్తి):

తొవిడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పర్వ ముగిసింది. ఈక్రమంలో తొలి విడతలోని మొత్తం పంచాయతీల్లో 5 సర్పంచి, 133 వార్డు స్థానాలకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. అలానే 129 సర్పంచి స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి. ఏకగ్రీవాల్లో ఆదిలాబాద్ అత్యధికంగా 30 సర్పంచ్ స్థానాలతో ప్రథమ స్థానంలో ఉంది. ఇదిలా ఉంటే తొలి విడతలో భాగంగా 133 వార్డులకు నామినేషన్ దాఖలు కాలేదు. ఇక మిగిలిన 37,179 వార్డులకు 85,428 మంది నామినేషన్లు వేశారు. తొలి విడత నామినేషన్ల పరిశీలన పూర్తయిందితెలంగాణ పంచాయతీ ఎన్నికల హోడావుడి మొదలైంది. ఈక్రమంలో తొలి విడత పంచాయతీలకు సంబంధించి నామినేషన్ల పర్వం ముగిసింది. ఇక తొలి విడతలో భాగంగా 4,236 పంచాయతీలకు, 37, 179 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వీటికి సంబంధించి నామినేషన్ల పర్వ ముగిసింది. ఈ క్రమంలో తొలి విడతలో భాగంగా 5 పంచాయతీలకు, 133 వార్డులకు ఎన్నికలు జరిగే అవకాశం లేదని తెలుస్తోంది. కారణం ఇక్కడ నామినేషన్లు వేయలేదు.తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక వివరాలు వెల్లడించింది. తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 5 సర్పంచ్ స్థానాలకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎస్ఈసీ తెలిపింది. అలాగే 133 వార్డుల్లోనూ పోటీకి ఎవరూ ముందుకు రాలేదని.. ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 37, 440 వార్డులకు గాను 133 మినహా మిగతా 37,179 స్థానాలకు.. 85,428 మంది నామినేషన్లు వేశారు.తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 4,236 పంచాయతీల్లో.. 5 మినహా మిగతా 4,231 సర్పంచ్ స్థానాలకు గాను 22,330 మంది నామినేషన్లు వేశారు. ఇదిలా ఉంటే.. 129 సర్పంచ్ స్థానాలకు ఒక్కొక్కరే నామినేషన్లు వేయడంతో అవి ఏకగ్రీవం కానున్నాయి. నామినేషన్ల పరిశీలన పూర్తయిన తర్వాత ఈ వివరాలను ఎన్నికల సంఘం ప్రకటించింది.ఈ నెల 3వ తేదీ వరకు నామినేషన్లు ఉపసంహరించుకోవడానికి గడువు ఉంది. అలానే రెండో విడత ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. మంగళవారంతో ఈ గడువు ముగిసింది. ఇక తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 129 సర్పంచి స్థానాలకు ఒక్కొక్కరే నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ఏకగ్రీవాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు అధికారులు.సర్పంచ్ పదవికి ఒకే ఒక్క నామినేషన్ దాఖలైన పంచాయతీల విషయానికి వస్తే.. ఆదిలాబాద్ జిల్లా అత్యధిక ఏకగ్రీవాలతో ప్రథమ స్థానంలో ఉంది. ఆదిలాబాద్ జిల్లాలో ఏకంగా 30 చోట్ల ఒక్కొక్కరే నామినేషన్లు వేశారు. ఆ తర్వాత స్థానాల్లో వికారాబాద్ (16), నిర్మల్ (9), కుమురం భీం ఆసిఫాబాద్, మెదక్, నారాయణపేట, సిద్ధిపేట, నిజామాబాద్ 6 చొప్పున ఉన్నాయి. ఇక కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో 5 చొప్పున ఏకగ్రీవాలయ్యాయి. ఆ తర్వాత ఖమ్మం, రంగారెడ్డి (4), నాగర్ కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, వనపర్తి (3), వరంగల్, మంచిర్యాల, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, (2), ఉమ్మడి వరంగల్‌లోని నాలుగు గ్రామాలు, జగిత్యాలఒక్కొక్కటి చొప్పున ఏకగ్రీవం అయ్యాయి.

# నా బార్డ్ నిధులతో గోదాములు

హైదరాబాదడిసెంబర్ 03(భారత శక్తి):


తెలంగాణలో మూడేళ్లలో ధాన్యం ఉత్పత్తి మూడు రెట్లు పెరిగినప్పటికీ వాటిని నిల్వ చేసేందుకు అవసరమైన మేరకు గోదాములు లేవు. దీంతో కొత్తగా 26 గోదాములను నిర్మించేందుకు రాష్ట్ర సర్కారు ఏర్పాట్లు చేస్తోంది.వీటిలో 12 గోడౌన్లను ప్రభుత్వ నిధులతో, మరో 14 గోదాములను నాబార్డు నిధులతో నిర్మిస్తుంది. వీటి కోసం రూ.295.68 కోట్లు ఖర్చుచేస్తుంది. 2.91 లక్షల టన్నుల స్టోరేజీతో గోదాముల నిర్మాణం జరగనుంది. వేర్ హౌజింగ్ శాఖ ఆధ్వర్యంలో 12 గోదాములను, 1.51 లక్షల టన్నుల స్టోరేజీ సామర్థ్యంతో నిర్మిస్తారు. నాబార్డు సహకారంతో 14 గోదాములను రూ.140 కోట్ల రుణాలతో 1.40 లక్షల టన్నుల సామర్థ్యంతో ఉండేలా గోడౌన్ల నిర్మాణం చేపట్టారు.పర్యావరణ అనుకూల పంథాలో వీటి నిర్మాణం ఉంటుంది. అందులోని పంటలకు ఎలుకలు, చీడపీడల బెడద లేకుండా చేసేందుకు గాలి వెలుతురు ఉండేలా స్టోరేజ్ వృథాను నివారించేలా నిర్మిస్తారు.కాగా, 2024-25 ఏడాది తెలంగాణలో 190 లక్షల టన్నుల ధాన్యంతో పాటు 30 లక్షల టన్నుల మక్కల దిగుబడి వచ్చింది. అలాగే, 28 లక్షల టన్నుల పత్తితో పాటు 20 లక్షల టన్నుల ఇతర పంటల దిగుబడి వచ్చింది. వాటిని నిల్వచేసుకోవడానికి గోదాములు సరిపోవడం లేదు.రైతులు ప్రతి ఏడాది పంటలను నిల్వచేసుకోవడానికి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. గోదాములు అవసరాల మేరకు లేకపోవడంతో పంట తేమ పెరగడం, తడిసిపోవడం, ఎలుకలు, పురుగులు పడుతున్నాయి.ప్రస్తుతం ప్రభుత్వ రంగంలో తెలంగాణ వ్యాప్తంగా 24.59 లక్షల టన్నుల సామర్థ్యమున్న 253 గిడ్డంగులు ఉన్నాయి. అయితే, అవి సంప్రదాయ నమూనాలో ఉండడంతో, వాటి నిర్వహణలో ఇబ్బందులు వస్తున్నాయి.

## ఆదిభిక్షువు వాడినేదికోరేదీ..

# బూడిదిచ్చే వాడినేది అడిగేదీ

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

సిరివెన్నెల సినిమాలోని ఆదిభిక్షువు వాడినేదికోరేదీ..బూడిదిచ్చే వాడినేది అడిగేదీ,విధాత తలపున ప్రభవించినది, చందమామ రావే, ఈ గాలీ ఈ నేలా ఇలా ప్రతిపాట అద్భుత సాహితీ గుబాళింపులతో సాహితీ ప్రియుల మనసు దోచుకున్నాడు సీతారామశాస్త్రి. ప్రఖ్యాత దర్శకుడు విశ్వనాథ్ అవకాశం కల్పించడంతో సిరివెన్నెల సినిమాలో పాటలన్నీ రాశారు. సిరివెన్నెల చిత్రం సూపర్ హిట్ కావడంతో సిరివెన్నెల సీతారామశాస్త్రిగా ప్రసిద్ధి గాంచారు.



సిరివెన్నెల పూర్తి పేరు చేంబోలు సీతారామశాస్త్రి. విశాఖ జిల్లా అనకాపల్లిలో1955 మే 20న జన్మించారు . ఆయన తల్లిదండ్రులు డాక్టర్ సి.వి.యోగి, తల్లి సుబ్బలక్ష్మి. కాకినాడలో ఇంటర్మీడియెట్ వరకూ చదువుకున్నా ఆయన , ఆంధ్ర విశ్వ కళాపరిషత్తులో బిఏ పూర్తి చేశారు. ఆయన కొంతకాలంపాటు టెలిఫోన్స్ శాఖలో పని చేశారు. సిరివెన్నెల సినిమాలోని అన్ని పాటలను ఆయనే రాశారు. ప్రతి పాట సూపర్ హిట్టయింది. స్వయంకృషి, రుద్రవీణ, స్వర్ణకమలం, శృతిలయలు, శివ, క్షణక్షణం, గాయం , గులాబీ, మనీ, శుభలగ్నం, నిన్నే పెళ్లాడతా, సింధూరం, దేవీపుత్రుడు, చంద్రలేఖ, నువ్వే కావాలి, నువ్వు నాకు నచ్చావు, శుభసంకల్పం, పట్టుదల..ఇలా అనేక సినిమాల్లో ఆయన రాసిన ప్రతిపాటా ఆణిముత్యమే. పండితులను పామరులను ఆకట్టుకున్న అద్భుత కవితామృత గుళికలే. కె. విశ్వనాథ్, వంశీ, క్రాంతికుమార్, బాలచందర్, జంధ్యాల, రాఘవేంద్రరావు, రామ్ గోపాల్‌వర్మ, సింగీతం శ్రీనివాసరావు, శివనాగేశ్వరరావు, కోదండరామిరెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణవంశీ, మణిరత్నం, వి.ఎన్ . ఆదిత్య, రాజమౌళి, పూరీ జగన్నాథ్, త్రివిక్రమ్ శ్రీనివాస్, శ్రీనువైట్ల, ఇంద్రగంటి ఇలా ఎంతో మంది దిగ్గజ దర్శకులనుంచి, కొత్త దర్శకులదాకా అందరూ ఆయన పాటల పరిమళాల్ని ప్రజలకు పంచారు.2019లో పద్మశ్రీ పురస్కారంతో కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. ఇక ఉత్తమ గేయ రచయితగా ఆయన పొందిన పురస్కారాలకు లెక్క లేదు. మొదట్లో భరణి అనే కలం పేరుతో కథలు, కవిత్వ రచనలు చేసిన సీతారామశాస్త్రి సిరివెన్నెల సినిమా హిట్టుతో ఆ సినిమా పేరే ఇంటిపేరుగా మార్చుకున్నారు.ప్రముఖ తెలుగు, హిందీ చలనచిత్ర దర్శకుడు రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన గాయం తెలుగు సినిమాలో నిగ్గదీసి అడుగు ఈ సిగ్గు లేని జనాన్ని అని పాట పాడే ప్రభావశీలమయిన పాత్రలో తను వ్రాసి నటించారు.తను వ్రాసిన పాటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది పురస్కారం లభించటం విశేషం.సిరివెన్నెల సీతారామ శాస్త్రి అనారోగ్యంతో బాధపడుతూ సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 2021 నవంబరు 30న మరణించాడు.

# దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

## ఉన్నత చదువులకు సౌకర్యాలను కల్పిస్తాం
## ఐదు శాతం ఇందిరమ్మ ఇళ్లను కేటాయిస్తాం
## రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



కరీంనగర్, డిసెంబర్ 3(భారతశక్తి ప్రతినిధి):

దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా సహాయ సహకారాలు అందిస్తామని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం శాతవాహన యూనివర్సిటీ సమీపంలో ఉన్న ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ అనితా రామచంద్రన్, వయోవృద్ధుల దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజతో కలిసి జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బధిరుల ఆశ్రమ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని బదిరుల ఆశ్రమ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, నిపుణులైన అధ్యాపకులను నియమించి సైన్ లాంగ్వేజ్ ద్వారా తరగతులు బోధిస్తామని వివరించారు. తమలోని దివ్య దృష్టిని వృధా చేయవద్దని, ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని సూచించారు. అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారుఇందిరమ్మ ఇళ్ళ మంజూరులో ఐదు శాతం దివ్యాంగులకు కేటాయించేలా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ఆర్టీసీ బస్సు పాసుల సమస్యను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. విద్యార్థులు ఉంటున్న పాఠశాలల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమను సంప్రదించాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ కి సూచించారు. వచ్చే ఏడాది (దివ్యాంగుల దినోత్సవం) కల్లా దివ్యాంగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దివ్య దృష్టి యూట్యూబ్ ఛానల్ ను ఆవిష్కరించారు. కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో దివ్యాంగులు పాడిన పాటను సీఎం ఆవిష్కరించినట్లు అతిథులు వివరించారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ అనిత రామచంద్రన్ మాట్లాడుతూమన చుట్టూ ఉన్న దివ్యాంగులలో అద్భుత ప్రతిభ ఉంటుందని వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు. సైన్ లాంగ్వేజ్ లో జనగణమన పాడిన కలెక్టర్ బృందాన్ని అభినందించారు. స్కిల్ ట్రైనింగ్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. యూపీఎస్సీ వంటి ఉన్నత ఉద్యోగాల్లో దివ్యాంగులు రాణిస్తున్నారని.. చదువును నమ్ముకుని ముందుకు సాగాలని సూచించారు. డైరెక్టర్ శైలజ మాట్లాడుతూమన రాష్ట్రంలో దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యం పెంచుకోవాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమం కోసం కలెక్టర్ చేపడుతున్న చర్యలను అభినందించారు. దివ్యాంగుల కోపరేటివ్ చైర్మన్ వీరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులతో ఇప్పటికీ స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. 40 శాతం వైకల్యం ఉన్న పరికరాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలోని డిసిబిసి భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. అనంతరం అతిథులను అధికారులు, సంక్షేమ సంఘం నాయకులు సన్మానించారు. సందర్భంగా దివ్యాంగులైన విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, మెప్మా పీడీ స్వరూప రాణి, అధికారులు, వికలాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, దివ్యాంగులు పాల్గొన్నారు. బాలుడి కుటుంబానికి అండగా ఉంటాంహైదరాబాదులో వీధి కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. అతని కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, మా శాఖ ద్వారా మెరుగైన వైద్య సేవలు, అది చదువు బాధ్యతలు చూస్తామని హామీ ఇచ్చారు.



# మైక్రో అబ్జర్వర్లు తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలి: ఆయేషా మస్రత్ ఖానం.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 3 (భారత శక్తి ): సూక్ష్మ పరిశీలకులు (మైక్రో అబ్జర్వర్లు) తమ ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం అన్నారు.

బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ ఎన్నిక విధుల్లో పాల్గొనబోయే సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనరల్ అబ్జర్వర్ అయేషా మస్రత్ ఖానం, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ, మైక్రో అబ్జర్వర్లుగా విధులు నిర్వహించబోయే అధికారులకు ముందుగానే సమాచారం అందించామని అన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ ఓటు విధానాన్ని వినియోగించుకొని తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని అన్నారు. శిక్షకులు అందించిన సమాచారాన్ని తూచా తప్పకుండా పాటిస్తూ, ఎన్నికల విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని వివరించారు.

పంచాయితీ ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం:జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.పంచాయతీ ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సూక్ష్మ పరిశీలకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా, ఎన్నికకు ముందు, ఎన్నిక సమయంలో, ఎన్నిక తర్వాత, ఓట్ల లెక్కింపు సమయంలో అనుసరించాల్సిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. సమయానుసారం ఓటింగ్ నమోదు వివరాలను పైఅధికారులకు ఎప్పటికప్పుడు అందజేయాలని అన్నారు. మైక్రో అబ్జర్వర్లకు అందించిన కరదీపికలను అనుసరించాలని చెప్పారు. ఎటువంటి సందేహాలు ఉన్న పై అధికారులను సంప్రదించాలని సూచించారు. రెండో దశలో భాగంగా మరోసారి సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ అందిస్తామని అన్నారు. ఎన్నికల నిర్వహణలో నిర్దేశించిన అన్ని రిజిస్టర్లను పకడ్బందీగా నమోదు చేయాలని తెలిపారు. పలువురు శిక్షకులు మైక్రో అబ్జర్వర్లకు తమ ఎన్నికల విధులపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో డిపిఓ శ్రీనివాస్, డీఈవో భోజన్న, ఎల్డీఎం రామ్ గోపాల్, శిక్షకులు, మైక్రో అబ్జర్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు మరమ్మత్తు పనులు పకడ్బందీగా చేపట్టాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

ఉమ్మడి అదిలాబాద్ జిల్లా బ్యూరో డిసెంబరు 3 (భారత శక్తి):నిర్మల్ పట్టణంలో చేపట్టిన రోడ్ల మరమ్మత్తుల పనులు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.



బుధవారం పట్టణంలోని బస్టాండ్, అంబేద్కర్ చౌక్ సమీపంలో కొనసాగుతున్న రోడ్డు మరమ్మత్తుల పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పట్టణంలో గత వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మత్తులను సకాలంలో గా పూర్తి చేయాలని అన్నారు. గుంతల రోడ్ల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్లను సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలని వివరించారు. మరమ్మత్తుల పనులన్నింటినీ నాణ్యవంతంగా చేయాలని పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు పనులను పర్యవేక్షించాలని సూచించారు. వర్షాకాలం రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా పనులు చేపట్టాలని తెలిపారు.

మినీ ట్యాంక్ బండ్ నుంచి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వెళ్లే మార్గంలో ఫుట్ పాత్ కు మరమ్మత్తులు చేయాలని తెలిపారు. పట్టణంలో నిరంతరం మెరుగైన పారిశుధ్యం నిర్వహించాలని అన్నారు. రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటాలని సూచించారు. ఆటో స్టాండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆటో డ్రైవర్లకు కలెక్టర్ హామీ ఇచ్చారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇటీవలి నిర్మాణం పూర్తయిన మినీ ట్యాంక్ బండ్ పార్కును పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.

ఈ పరిశీలనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, టౌన్ ప్లానింగ్ అధికారి హరిభువన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ భూ సమస్యల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి: జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

వై ఎస్ ఆర్ కడప, డిసెంబర్ 03(భారత శక్తి):



జిల్లా లో దీర్ఘకాలికంగా రెవెన్యూ డివిజన్ల పరిధిలో పెండింగ్ లో ఉన్న ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి వై ఎస్ ఆర్ కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందు లో భాగంగా బుధవారం కలెక్టరేట్ లోని సభాభవన్ లో..ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ను నిర్వహించారు. ఈ ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) లో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తో కలసి ప్రజా పిర్యాదులను పునఃపరిశీలన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ వ్యవస్థ నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తోంది. ప్రభుత్వం అందించే సేవలో రెవెన్యూ సేవలు ప్రధానమైనవి.. ఇందు లో భాగంగా దీర్ఘకాలికంగా పరిష్కారం కాని భూ సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించారు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి... ఇందుకు ఆర్ డి ఓ లు వారి పరిధి లో గల మండలాల వారీ గా అధికారులు, రికార్డులతో సహా హాజరు అయ్యారు. ప్రజా ఫిర్యాదులలో రెవెన్యూ, భూ సమస్యలు, కోర్టు వ్యవహారాలు, కుటుంబ భాగ పరిష్కారాలు తదితర అంశాలకు సంబంధించిన అందిన అర్జీలపై ఫిర్యాదు దారులతో నేరుగా మాట్లాడి పలు సూచనలు, సలహాలు అందించారు. వీటి తో పాటు గా రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కి ఈ జిల్లా కు సంబంధించి అందిన పిర్యాదులను మరియు రెండు సార్లు కన్నా ఎక్కువ సార్లు ఫిర్యాదు చేసిన వారి పిర్యాదుల పరిష్కారం నిమిత్తం జిల్లా కలెక్టర్ ప్రతి అర్జీదారులతో వ్యక్తిగతంగా మాట్లాడుతూ రెవెన్యూ కు సంబంధించి గ్రామస్థాయి రికార్డులు తో సరిచూసుకొని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. ప్రజా ఫిర్యాదుల పెండెన్సీ నమోదు శాతం "0" స్థాయి లోకి వచ్చేలా ఫిర్యాదులన్నింటినీ పునఃపరిశీలించి అర్జీ దారులకు సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపే దిశగా కృషి చేస్తున్నారు. దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారంలో జిల్లా యంత్రాంగం పరిధి లో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతూ... కుటుంబ తగాదాల నేపథ్యంలో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలపై అర్జీదారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారులు వారి వెంట వచ్చిన కుటుంబ సభ్యులకు ఎలాంటి కొరత లేకుండా సీటింగ్, భోజన సదుపాయాలను కల్పించడం జరిగింది. వై ఎస్ ఆర్ కడప జిల్లా లో ప్రజా పిర్యాదుల పరిష్కారం నకు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి పరిష్కారానికి జిల్లా కలెక్టర్ చేస్తున్న కృషి కి అర్జీదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రత్యేక ఫిర్యాదుల కార్యక్రమం లో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓ లు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, జెడ్పి సీఈవో ఓబులమ్మ, సర్వే ల్యాండ్స్ ఏడీ మురళీ కృష్ణ, అన్ని మండలాల తహశీల్దార్లు, ఆర్ఐ లు, సంబందిత అధికారులు పాల్గొన్నారు.

# కన్కల్ గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 03: మూడవ విడత నామినేషన్ ల స్వీకరణ సందర్భంగా తాడ్వాయి మండలం కన్కల్ గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు.

నామినేషన్ స్వీకరణ ప్రక్రియ నిబంధనల కనుగుణంగా చేపట్టాలని, సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్ని నామినేషన్లు దాఖలు అయ్యాయని అడిగి తెలుసుకొని, రెండవ విడత నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) , విత్ డ్రావెల్ జాగ్రత్తగా నిర్వహించాలని అన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా మూడవ విడత నామినేషన్ లో చివరి రోజు ఎక్కువ వేసే అవకాశం ఉన్నందున అధికారులు ముందుగానే ప్రజలకు అవగాహన కల్పించి రోజూ వారిగా నామినేషన్ లు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని, చివరి రోజు ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. కామారెడ్డి లో స్థానిక సంస్థల ఎన్నికల మొదటి దశ నామినేషన్ ప్రక్రియ నవంబర్ 27, 2025 న ప్రారంభమై 29 నవంబర్ 2025 న విజయవంతంగా ముగిసిందని



మొదటి విడతలో మొత్తం 10 మండలాల్లో విస్తృతంగా నామినేషన్ దాఖలు అయ్యాయని,నామినేషన్ వివరాలు1520 వార్డులకు మొత్తం 3833 నామినేషన్లు దాఖలయ్యాయి. 167 సర్పంచ్ స్థానాలకు 1224 మంది అభ్యర్థులు నామినేషన్ లు వేయడం జరిగిందనీ,ఎన్నికల ప్రకారం, పోలింగ్ , లెక్కింపు ప్రక్రియ డిసెంబర్ 11, 2025 న జరగనుందన్నారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ శ్వేత, ఎంపిడిఓ సయ్యద్ సాజిద్ ఆలి ఎన్నికల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# జర్నలిస్టుల మహా ధర్నా సూపర్ హిట్

**- తక్షణమే ప్రభుత్వం మేల్కొనాలి**

**- జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి**

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 3 :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలని, జర్నలిస్టుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టి యు డబ్ల్యూజె సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాదులో జరిగిన మహాధర్నా విజయవంతం అయిందని ఆయన పేర్కొన్నారు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున జర్నలిస్టులు తరలివచ్చారని తెలిపారు. ముఖ్యంగా సంగారెడ్డి జిల్లాలోని ప్రతి మండలం నుంచి ప్రతి పట్టణం నుంచి జర్నలిస్టులంతా తరలివచ్చి ధర్నాలో పాల్గొన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు అయ్యిందని అయినప్పటికీ కొత్త కొటేషన్ కార్డులు ఇవ్వడం లేదని, ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించడం లేదని హెల్త్ కార్డులను పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు దీనికి తోడు జర్నలిస్టులకు సంబంధించిన కమిటీలను వేయకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు హైదరాబాదులో జరిగిన ధర్నాలో ప్రతి ఒక్కరూ ఇదే విషయాన్ని డిమాండ్ చేశారని తెలిపారు. బుధవారంతో సరిగ్గా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తయ్యాయని, ఈ సందర్భంగా జర్నలిస్టులను విస్మరించడం తగదన్నారు గొంతెమ్మ కోరికలను



జర్నలిస్టులు కోరడం లేదని గతంలో అమలు చేసిన వాటినే సంపూర్ణ స్థాయిలో అమలు చేయాలని అడగడం తప్పా? అని ప్రశ్నించారు. జర్నలిస్టుల్లో అనేకమంది పేద మధ్యతరగతి వర్గాల వారు ఉన్నారని వారంతా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇబ్బందులు పడుతున్న సంగతిని గుర్తించాలన్నారు ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలని మహా ధర్నా ద్వారా ఆయన మేల్కొనాలని చెప్పారు. తక్షణమే హెల్త్ కార్డులను మంజూరు చేయాలని కొత్త అక్రిడేషన్ కార్డులను ఇవ్వాలని ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే ఫైసల్, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు అనిల్ ,ప్రధాన కార్యదర్శి ఆసిఫ్, ఇతర ముఖ్య నేతలు సిద్దన్న పాటిల్, హాజీ, మినాజ్,

అన్వర్, శ్రీనాథ్ ,బాసిత్, వెంకటరెడ్డి వెంకటేష్, యాదగిరి, మల్లేశం అంజయ్య, తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

# పీచుపల్లిలో సర్పంచ్ పదవి ఏకగ్రీవం

## బిజెపి బలపర్చిన అభ్యర్థి రాజిరెడ్డి ఎన్నిక
## గ్రామాభివృద్ధికి రూ.10 లక్షల నిధులు కేటాయిస్తానన్న కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్, డిసెంబర్ 3(భారతశక్తి ప్రతినిధి):గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండో విడత నామినేషన్ల దాఖల పర్వం పూర్తయింది. కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం పీచుపల్లి గ్రామంలో సర్పంచ్ పదవికి బీజేపీ బలపర్చిన సామ రాజిరెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల గడువు ముగియడంతో సామ రాజిరెడ్డి ఎన్నిక ఏకగ్రీవం లాంఛనమే కానుంది. సర్పంచ్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపర్చిన అభ్యర్థులను ఏకగ్రీవం చేస్తే ఆ గ్రామాలకు రూ.10 లక్షల చొప్పున ప్రోత్సాహక నిధులను కేటాయిస్తానని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రకటించిన విషయం తెలిసిందే. జిల్లాలో బీజేపీ పక్షాన తొలి ఏకగ్రీవం కావడంతో ఇచ్చిన మాట మేరకు ఆయా నిధులను అందజేస్తానని బండి సంజయ్ తెలిపారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం సైతం ఎన్నికల్లేకుండా సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యే గ్రామాలకు రూ.10 లక్షల చొప్పున ప్రోత్సాహక నిధులిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ లెక్కన పీచుపల్లి మొత్తం రూ.20 లక్షల ప్రోత్సాహక నిధులు అందనున్నాయి. ఈ నిధులను తమ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటామని ఆయా గ్రామస్తులు చెబుతున్నారు. ఈ మేరకు గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

## విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసమే మెగా పేరెంట్స్ మీట్..!

### -ప్రెస్ మీట్ లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

వైఎస్ఆర్ కడప, డిసెంబర్ 3(భారత శక్తి ): విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5న నిర్వహిస్తున్న మెగా పేరెంట్స్ మీట్ కార్యక్రమాన్ని



జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. ఈనెల 5వ తేదీన జిల్లాలో నిర్వహించనున్న 3వ మెగా పేరెంట్స్ మీట్ కార్యక్రమ నిర్వహణపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి... జిల్లా విద్యాశాఖ అధికారి శంశుద్దిన్ తోకలిసి బుధవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రెస్ మీట్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...రాష్ట్ర వ్యాప్తంగా "మెగా పేరెంట్ టీచర్ మీట్" కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రధాన్యతతో నిర్వహించడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లోనూ, కళాశాలలోనూ మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ ఈనెల 5వ తేదీన నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులతో వన్-టు-వన్ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో విద్యార్థుల యొక్క మానసిక, సామాజిక స్థితి, ప్రవర్తన, అభ్యసన సామర్థ్యం.. గురించి సంబందిత క్లాస్ టీచర్ లేదా హెడ్ మాస్టర్ లతో పేరెంట్స్ చర్చించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి బాధ్యత కేవలం పాఠశాల ఉపాధ్యాయులదే కాకుండా.. తల్లిదండ్రులది కూడా ప్రధాన భూమిక బాధ్యత అన్న విషయాన్ని ఇందులో తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థికి చాలా వివరణాత్మకంగా.. ఆ విద్యార్థి యొక్క 6 నెలల అభివృద్ధికి సంబంధించి హోలిస్టిక్ రిపోర్టుని కుడా అందివ్వడం జరుగుతుందన్నారు. పాఠశాల అభివృద్ధికి పేరెంట్స్ కమిటీ, టీచర్స్ మీటింగ్ చాలా ఉపయోగపడుతుందన్నారు. పాఠశాల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలంటే.. పేరెంట్స్ కమిటీలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలన్నారు. పాఠశాలలో సాధించిన ప్రగతి విద్యార్థుల అభ్యున్నతికి ఈ పేరెంట్స్ టీచర్స్ మెగా ఈవెంట్లు దోహదపడతాయని తెలిపారు. అదేరోజు పాఠశాల కళాశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అదే రోజు పాఠశాలల్లో మిడ్ డే మీల్ ఆరోజు మెనూ ప్రకారం తల్లిదండ్రులకు వడ్డించడం జరుగుతుందన్నారు. అనంతరం పేరెంట్స్ మీట్ నిర్వహణకు సంబంధించి పలు అంశాలను, సూచనలను తెలియజేసారు.

## ముందస్తు జాతీయ లోక్ అదాలత్ మీటింగ్


కడప, డిసెంబర్ 3(భారత శక్తి):ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఎగ్జిక్యూటివ్ చైర్మన్ , డాక్టర్ సి.యామిని, చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప మరియు జిల్లా



వ్యాప్తంగా మండల న్యాయ సేవా సమితి న్యాయమూర్తులతో వర్చువల్ పద్ధతిలో 13-12-2025 వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ కు సంబంధించి మీటింగ్ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 13-12-2025 వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలని కోరారు. ఈ వర్చువల్ మీటింగ్ లో కడప జిల్లా వ్యాప్తంగా మండల న్యాయ సేవా సమితి న్యాయమూర్తులు మరియు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు పాల్గొన్నారు.

## పి డి ఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షుడిగా బి. రాకేష్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 03: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్యు కామారెడ్డి 23వ జిల్లా మహాసభలు కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 28వ తేదీన నిర్వహించడం జరిగిందని, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కామారెడ్డి జిల్లా కేంద్రంలో పిడిఎస్యు బలమైన విద్యార్థి ఉద్యమాలను నిర్మించినందుకు రామారెడ్డి మండలానికి చెందిన



తనను జిల్లా ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు రాకేష్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో నియమించినందుకు బాధ్యతతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై సంక్షేమ హాస్టల్లో నెలకొన్న సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామన్నారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులు ఈ బాధ్యత అప్పజెప్పినందుకు హర్షం వ్యక్తం చేశారు.

# ఎన్నికల సమయంలో కేసు నమోదు అయితే భవిష్యత్తులో సమస్యలు తప్పవు: సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ

సూర్యాపేట (భారత శక్తి జిల్లా ప్రతినిధి) డిసెంబర్ 3:

సర్పంచ్ ఎన్నికలు సందర్భంగా ఎన్నికల నియమావళి అమలులో భాగంగా సూర్యాపేట జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో సమస్యాత్మక గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం రోజున సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ గారు సూర్యాపేట డివిజన్ డిఎస్పీ ప్రసన్నకుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, ఎమ్మార్వో కృష్ణ, ఎండివో రవి లతో కలిసి యర్కారం గ్రామంలో అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు, ఎన్నికలు సజావుగా సాగేలా ఎన్నికల సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో ప్రజలతో మాట్లాడి ఎన్నికల నియమావళి పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ పౌరులు వారి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడానికి పోలీస్ శాఖ పూర్తి భద్రత, రక్షణ కల్పిస్తుంది, ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళికి లోబడి నడుచుకోవాలి అని తెలిపారు, ఎన్నికల నిర్వహణకు ఐదు అంచల పోలీసు భద్రత ఉంటుంది అన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయవద్దని కోరారు, వర్గ



విభేదాలకు పోయి గొడవలు పెట్టుకోవద్దని ప్రతి ఒక్కరు కలిసిమెలిసి సమన్వయంతో మెలగాలని అన్నారు. సమస్యాత్మక గ్రామాలుగా ఉన్న గ్రామాల యొక్క చరిత్ర మారాలని భవిష్యత్తులో ప్రశాంత గ్రామాలుగా పోలీస్ రికార్డులలో నమోదు కావాలని కోరారు. ప్రజల ఓట్లను ప్రభావితం చేసేలా డబ్బు, బహుమతులు, మద్యం, ఇతర ఉచితాలు పంపిణీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల రోజు ముందు 44 గంటల నిబంధనలను అమలులోకి వస్తాయని ఈ సమయంలో అనుమానాస్పదంగా ప్రవర్తించకూడదని అన్నారు, ప్రచారాన్ని సమయపాలనతో చేయాలని అన్నారు. ఎన్నికల రోజున ఓటర్లు క్రమబద్ధతిలో ఎన్నికల బూతు వద్ద ఉండి వారి ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల అనంతరం విజయోత్సవ ర్యాలీలకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఫలితాలు వెలువడిన రోజు ఎవరు కూడా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదని అన్నారు. ఎన్నికల నిబంధనలను ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి ఎవరైనా అతి ప్రవర్తనకు వెళ్ళినట్లయితే అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అక్రమ రవాణా నిరోధం కోసం 24 గంటలకు తనిఖీలు ఉంటాయి అన్నారు. అంతరాష్ట్ర చెక్ పోస్ట్ లలో పటిష్ట నిఘా ఉంచాం అన్నారు. ఆకస్మిక తనిఖీలకు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేశాము అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట సూర్యపేట సబ్ డివిజన్ డిఎస్పీ ప్రసన్నకుమార్, సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, స్థానిక ఎస్సైలు బాలు నాయక్, శ్రీకాంత్, సిబ్బంది అన్నారు.

## విజన్ ఉన్న నాయకుడు రాహుల్ గాంధీ: టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

### -రాహుల్ గాంధీతోనే కేటీఆర్ కు పొలిటికల్ పర్సనాలిటీ
### -కాంగ్రెస్కు నష్టం జరిగిన తెలంగాణ ఇచ్చాం

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 3 :




జాతీయ నాయకులు రాహుల్ గాంధీ విజన్ ఉన్న నాయకుడని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. బుధవారం సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన కాంగ్రెస్కు నష్టమని చెప్పిన రాహుల్ గాంధీ నష్టం జరిగినా తెలంగాణ రాష్ట్రం ఇవ్వాలని డిసైడ్ అయ్యామని తెలిపారు అన్నారు. తెలంగాణను రాజకీయ కోణంలో చూడడం లేదని రాహుల్ గాంధీ స్పష్టం చేసినట్లు చెప్పాడన్నారు. అది రాహుల్ గాంధీకి ఉన్న విజన్ అన్నారు. విజన్ తో కూడుకున్న నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. 14 ఏళ్ల క్రితం తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన తెలంగాణ యువకులు ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన రాహుల్ గాంధీనే విమర్శించడం ఏంటని ప్రశ్నించారు. నీకంటూ రాజకీయ విలువలు ఉన్నాయా అని ప్రశ్నించారు. కేటీఆర్ నూటికి ఏది వస్తే అదే మాట్లాడతావు అని ఈరోజు బయటపడింది అన్నారు. నేను చట్ట సభలకు వచ్చాను అంటే కెసిఆర్ వల్లనే అన్నారు. నాకు రాజకీయ విలువలు ఉన్నాయి కాబట్టే గాంధీభవన్ కు వేదికగా ఈ విషయాన్ని చెబుతున్నానని స్పష్టం చేశారు. నీకు రాజకీయ విలువలు ఉంటే తెలంగాణ ఇచ్చిన రాహుల్ గాంధీ గురించి తప్పుగా మాట్లాడొద్దన్నారు. రాహుల్ గాంధీ గురించి కేటీఆర్ మాట్లాడడం ఆపకపోతే నేను కూడా కేసీఆర్ గురించి మాట్లాడవలసి వస్తుందన్నారు. కెసిఆర్ గురించి అనేక విషయాలు బయట మాట్లాడాల్సి వస్తుందని అన్నారు. కమిట్మెంట్ తో పనిచేసే రాహుల్ గాంధీనీ విమర్శించడం నీకు తగదన్నారు. కేటీఆర్ వయసుకు మించి మాటలు మాట్లాడుతున్నావని గుర్తు చేశారు. ఇప్పుడు నువ్వు మాజీ సీఎం కేసీఆర్ కొడుకు అని గుర్తుంచుకోవాలన్నారు. రాజకీయ పోరాటంలో మీ బెనిఫిట్స్ పొందారే కానీ త్యాగాలు చేసిన కుటుంబం కాదన్నారు. రాహుల్ గాంధీని ప్రశ్నించే నైతిక హక్కు కేటీఆర్ కు లేదన్నారు. తెలంగాణ విభజన చేయొద్దు అని రాహుల్ గాంధీకి చెప్పిన మా ప్రజలు అమాయకులు ఏపీ లీడర్స్ రాజకీయంగా చనిపోతారని చెప్పిన పార్టీ అవుట్ అవుతుందని రాహుల్ గాంధీకి చెప్పిన తెలంగాణ ఇస్తే ప్రజలు అధికారం ఇవ్వరని చెప్పిన వినలేదన్నారు. రాహుల్ గాంధీ భిక్షతోనే సీఎం కొడుకుగా పేరు వచ్చిందన్నారు. కెసిఆర్ తెలంగాణకి సీఎం అయ్యాడు అంటే రాహుల్ గాంధీ భిక్ష అన్నారు. ప్రజలు ఎవరైనా సాయం చేస్తే గుర్తు పెట్టుకుంటారు తెలంగాణలో అధికారం రాదు ఏపీలో పార్టీ చనిపోతుందంటే కూడా రాహుల్ గాంధీ తెలంగాణ నిర్ణయం జరిగిపోయిందని స్పష్టంగా చెప్పారని తెలిపారు. మేము రాజకీయంగా ఆలోచన చేయడం లేదని యువత ఆత్మహత్యలు జరుగుతున్నాయని ప్రజల కోసం నిర్ణయం తీసుకున్నామని రాజకీయంగా ఏమవుతుందో అని చూడడం లేదని రాహుల్ గాంధీ నొక్కి మరీ చెప్పాడని స్పష్టం చేశారు. కేటీఆర్ మీ ఇంట్లో ఏం జరుగుతుందో రాహుల్ గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే మీ ఇంట్లో పవర్ కొట్లాట పైసల కొట్లాట జరిగేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కేటీఆర్ విలువలతో కూడిన రాజకీయం చేయాలని రాహుల్ గాంధీ దాకా ఎందుకు మాట్లాడుతున్నావని అన్నారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడితే కేసీఆర్ను వదిలేసేది లేదన్నారు. దేవులపై రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు బిజెపి వక్రీకరించిందన్నారు. బిజెపి వక్రీకరణ పై తర్వాత మాట్లాడతానని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సకాలములో గుండె ఆపరేషన్ నిమిత్తమై "ఓ" పాజిటివ్ రక్తం అందజేత

### -రక్తదానంతో ఆదర్శంగా నిలుస్తున్న చంద్రశేఖర్ రెడ్డి

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 03: గుండె ఆపరేషన్ నిమిత్తమై హైదరాబాదు లోని ప్రైవేటు వైద్యశాలలో షేక్ మజార్ఉద్దీన్ (70) వృద్ధునికి అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో రక్తదాత చంద్రశేఖర్ రెడ్డి మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలవడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలిపారు.



ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది సకాలంలో రక్తం అందక తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వారి ప్రాణాలను కాపాడడానికి రక్తదాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. సకాలంలో రక్తం అందనట్లయితే ఎంతో విలువైన ప్రాణాలను కోల్పోవడం జరుగుతుందని అన్నారు. రక్తదానానికి ముందుకు వచ్చిన రక్తదాత చంద్రశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు: రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణీ కుముదిని

కరీంనగర్, డిసెంబర్ 3 (భారతశక్తి ప్రతినిధి)రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు, పోలీస్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ, మొదటి, రెండవ విడత నామినేషన్ల స్వీకరణ, దాఖలైన నామినేషన్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండవ విడత నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, మూడవ విడత నామినేషన్ల



స్వీకరణ ప్రక్రియను కూడా తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల సిబ్బంది కేటాయింపు, పోస్టల్ బ్యాలెట్, బ్యాలెట్ బాక్సులు, శాంతిభద్రతలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్ లోకరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ మొదటి విడతలో 92 సర్పంచ్ స్థానాలకు 730 నామినేషన్లు, 866 వార్డు సభ్యుల స్థానాలకు 2174 నామినేషన్లు దాఖలు అయ్యాయని చెప్పారు. రెండో విడతలో 113 సర్పంచ్ స్థానాలకు 888, 1046 వార్డు సభ్యుల స్థానాలకు 3056 నామినేషన్లు దాఖలు అయినట్టు వెల్లడించారు. నామినేషన్ వేయని సర్పంచ్ లేదా వార్డు సభ్యుల స్థానాలు ఇప్పటివరకు లేవని తెలిపారు. 125 వార్డు స్థానాలకు ఒకే ఒక నామినేషన్ దాఖలు అయినట్లు వెల్లడించారు. 2946 పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించినట్లు తెలిపారు. జిల్లాలో మొదటి, రెండవ విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని, మొదటి దశ నామినేషన్ల పరిశీలన కూడా నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా, మండల స్థాయిలలో అధికారులతో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలకు పోలీస్ యంత్రాంగం సంసిద్ధంగా ఉందని తెలిపారు. 19 శాతం పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైన గుర్తించి పటిష్ట బందోబస్తుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న 635 మందిని బైండోవర్ చేశామని, 33 లైసెన్స్ తుపాకులను డిపాజిట్ చేసుకున్నామని వివరించారు. ఇప్పటివరకు 70 అక్రమ మద్యం కేసులు, ఎన్ డి పి ఎస్ చట్టం కేసు ఒకటి నమోదైనట్లు వెల్లడించారు. గ్రామ పోలీసు అధికారులను కేటాయించి క్షేత్రస్థాయిలో ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్, సిపితో పాటు అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఎన్నికల పరిశీలకులు వెంకటేశ్వర్లు, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 03: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవమును పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళలు, పిల్లలు, వికలాంగులు వయోవృద్ధుల సంక్షేమశాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా సివిల్ జడ్జ్ నాగరాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శుభాకంక్షలు తెలుపుతూ, జిల్లాలో దివ్యాంగుల కొరకు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు .ప్రతీ సంవత్సరం డిసెంబర్ 3న ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. దివ్యాంగుల హక్కులు, గౌరవం, సమానత్వం సామాజిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం కొరకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు జిల్లాలోని దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలైన నెలసరి పింఛన్లు, సహాయక పరికరాలు, కృత్రిమ అవయవాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, స్వయం ఉపాధి రుణాలు, ప్రత్యేక విద్యా సదుపాయాలు వంటి కార్యక్రమాలు ద్వారా లబ్ధిపొందుతున్నారన్నారు. దివ్యాంగులు ప్రతిభ, కష్టపడి పనిచేయగల శక్తి, సంకల్పబలం ద్వారా సమాజంలో అనేక రంగాలలో రాణిస్తున్నారని ఆయన అభినందించారు. జిల్లాలో ఈ సంవత్సరంలో వికలాంగులకు 68 స్కూటీ లు, లాప్ టాప్స్- 8 స్మార్ట్ ఫోన్స్-3 బ్యాటరి ట్రై సైకల్-12 మిని ట్రేడింగ్ ఆటో-2 హైబ్రిడ్ వీల్ చైర్-2 మొదలగు వాటి ప్రతిపాదనకు డైరెక్టర్ పంపడం జరిగిందని వికలాంగులకు ఆర్థిక పునరావాసం కొరకు 28 మందికి లోన్స్ మంజూరు చేయడం జరిగింది. అదే విధంగా వికలాంగులను పెళ్లి చేసుకున్న వారికి ఆవార్డు కింద 15 మందికి 15 లక్షలు మంజురు, ప్రజావాణికి వచ్చే వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇస్తునట్లు వారికి ప్రత్యేక క్యూ లేకుండా డైరెక్ట్ గా ఫిర్యాదులు తీసుకుంటారని తెలియజేసారు. అదే విధంగా యుడిఐడి కార్డుల పంపిణిలో కామారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉందని గుర్తుచేసారు. అంతర్జాతీయ దివ్యంగుల దినోత్సవంలో భాగంగా వికలాంగులకు ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు కలెక్టర్ చేతులమీదుగా బహుమతులను ప్రాధానం చేసారు. అదే విధంగా డ్వాక్రా గ్రూపు ద్వారా ఆర్థిక సహాయం పొంది లోన్ ను త్వరితగతిన పూర్తిచేసిన గ్రూప్ సభ్యులకు సన్మానించారు. దివ్యాంగులు ఆత్మగౌరవంతో, స్వయం ఆధారితంగా జీవించే సమాజ నిర్మాణమే మన లక్ష్యమన్నారు. అందరి సహకారంతో దివ్యాంగుల అభ్యున్నతి కోసం మరింత కృషి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి ప్రమీల, జిల్లా గ్రామీణభివృది ఆధికారి సురేందర్, అధికారులు వికలాంగుల సంఘాల నాయకులూ సాయిలు, పోచవ్వ హరిసింగ్, బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులు మత్స్య సంపదపై దృష్టి సాధించాలి:జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 3 (భారత శక్తి):మత్స్యకారులు మత్స్య సంపద పెంపు పై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.



బుధవారం సాయంత్రం నిర్మల్ గ్రామీణ మండలం డ్యాంగాపూర్ గ్రామంలోని చెరువులో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మత్స్యకారులు మత్స్య సంపద వల్ల ఆర్థికంగా బలపడవచ్చు అని అన్నారు. విడుదల చేసిన చేప పిల్లలు, సరైన సైజుకు రాగానే, చేపలను పట్టి విక్రయించి లాభాలు పొందాలని ఆశించారు. ఈ చేప పిల్లల విడుదల కార్యక్రమంలో ఏడి ఫిషరీస్ రాజనర్సయ్య, తాసిల్దార్ ప్రభాకర్, మత్స్యకారులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హిందువులు బొందు గాళ్లు అన్నోళ్లు కాలగర్భంలో కలిసిపోయారు

## సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం
## బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

కరీంనగర్, డిసెంబర్ 3(భారతశక్తి ప్రతినిధి):

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయాలే పరమావధిగా జీవిస్తున్నారని , తన రాజకీయ అవసరాల కోసం ఇతర మతాల మెప్పుకోసం హిందూ దేవుళ్లను ద్వేషిస్తూ, హేళనగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి బేషరతుగా హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ వ్యతిరేక వ్యాఖ్యలపై బుధవారం బిజెపి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ చౌక్ లో నిరసన కార్యక్రమం చేపట్టి సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి కేసీఆర్ హిందువులను చులకన చేసి మాట్లాడారని , హిందుగాళ్లు , బొందు గాళ్ల నీ నాడు కెసిఆర్ చేసిన వ్యాఖ్యలకు కాలమే సమాధానం చెప్పిందన్నారు. కెసిఆర్ చేసిన వ్యాఖ్యలకు హిందూ సమాజం తగిన బుద్ధి చెప్పిందని, నేడు ఆ పార్టీ కాలగర్భంలో కలిసిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కెసిఆర్ బాటలోనే నడుస్తున్నారని , అందుకే హిందూ సమాజం తో పెట్టుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు. మూడు కోట్ల దేవతలంటూ .. ఒక్కో దేవుని పై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందూ ప్రజల మనోభావాలు దెబ్బ తీసేలా ఉన్నాయన్నారు. హిందూ దేవుళ్ళ గురించి వ్యాఖ్యలు



చేసినట్టు ఇతర మతాల దేవుళ్ళ గురించి రేవంత్ రెడ్డికి మాట్లాడే దమ్ము ధైర్యం ఉందా అని ఆయన ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి హిందూ ద్వేషిగా మారారన్నారు. హిందూ దేవుళ్ళతో , హిందూ సమాజంతో పెట్టుకుంటున్న రేవంత్ రెడ్డి గత కెసిఆర్ లాగే కాలగర్భంలో కలిసిపోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ముందుగా కొత్తపల్లి బిజెపి మండల అధ్యక్షుడు కుంట తిరుపతి ఆధ్వర్యంలో ముఖ్య నేతల సమావేశంలో పై వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిల రమేష్,వాసాల రమేష్,కళ్లెం వాసుదేవరెడ్డి, గువ్వల శ్రీనివాస్,కటకంలోకేష్, జోన్ ప్రెసిడెంట్,పాదం శివరాజ్, బండారు గాయత్రి,తణుకు సాయి కృష్ణ, అవదుర్తి శ్రీనివాస్ నరహరి లక్ష్మారెడ్డి, ఆవిడల చైతన్య, నాంపల్లి శ్రీనివాస్, ప్రసన్న, యువ క్రాంతి, అక్షయ్, కట్ట రాజు, ప్రసాద్,బోయిన్ శ్రీను,జి రవి,అనిష్,పాశం తిరుపతి,ఆకుల నరేష్, అజయ్, వెంకటేష్,సందీప్, శ్రీధర్,అనిల్,విజయ్, కలికోట మోహన్,నారాయణ, జిత్తు, నవీన్, తదితరులు పాల్గొన్నారు

# డి.ఇడ్. పరీక్షకు 79 మంది హాజరు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 3 (భారత శక్తి): నిర్మల్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కస్బా యందు జరుగుచున్న డి ఇడ్ మొదటి సంవత్సరం పరీక్షల్లో భాగంగా మూడవ రోజుబుధ వారం 88మంది విద్యార్థులకు గాను 79మంది విద్యార్థులు హాజరుకాగా 9మంది గైరాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని నిర్మల్ జిల్లా ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ముడారపు పరమేశ్వర్ సందర్శించారు. పరీక్ష కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్ ను సైతం ఏర్పాటు చేశారు మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

# అంధుల పాఠశాల విద్యార్థిని తో పాడిన జిల్లా కలెక్టర్

కరీంనగర్, డిసెంబర్ 3(భారతశక్తి ప్రతినిధి):



అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దివ్యంగులలో స్ఫూర్తి నింపేందుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విద్యార్థిని సింధుశ్రీ తో కలిసి పాటను పాడారు. అనంతరం ఈపాటను యూ ట్యూబ్ లో పోస్ట్ చేసారు. సినీ గేయరచయిత చంద్రబోస్ 2009లో విడుదలైన నింగినేల. .నాదే ....అనే సినిమా కోసం రాసిన పాట ఆరాటం ముందు ఆటంకం ఎంత అనే పాటను కలెక్టర్ పాడారు. గతంలో ఓ కార్యక్రమంలో సింధు శ్రీ పాట పాడటం చూసి ఇన్స్పెయిర్ అయ్యారు. కరీంనగర్ అంధుల పాఠశాల మ్యూజిక్ టీచర్ సరళ, మ్యూజిక్ డైరెక్టర్ కేబీశర్మ ఆధ్వర్యంలో కలెక్టర్ పాటను టెక్నీషియన్లు రికార్డు చేశారు. గతంలో ఆడపిల్లను రక్షించుకుందాం అంటూ కలెక్టర్ పాడిన " ఓ చిన్నీ పిచుక" పాటకు విశేష ఆదరణ లభిందించింది.

# స్థానిక ఎన్నికల బీఆర్ఎస్ తుడిచిపెట్టుకుపోవడం ఖాయం

## రాజేందర్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ లో చేరిన బి ఆర్ ఎస్ నాయకుడు
## కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల

కరీంనగర్, డిసెంబర్ 3(భారతశక్తి ప్రతినిధి):స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కరీంనగర్ లో బీఆర్ఎస్ పార్టీ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ కేడర్లో నిరాశ నిస్పృహ అలుముకుందని, కేడర్ ను పట్టించుకునే నాయకుడు లేరని పేర్కొన్నారనీ ఆ కార్యకర్తలు ఆవేదనతో ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని ఖాజీపూర్ గ్రామానికి చెందిన బి ఆర్ ఎస్ సీనియర్ నాయకుడు, సర్పంచ్ అభ్యర్థి సోమినేని తిరుపతి వెలిచాల రాజేందర్ రావు ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికలకు ముందే బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని, దుకాణం బంద్ కాబోతుందని



పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ కరువైందనీ, ప్రజలు పట్టించుకోవడంలేదని అందుకే నాయకులు పార్టీకి దూరంగా ఉంటున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఖాజీపూర్ సర్పంచ్ అభ్యర్థి తిరుపతి తన ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారని పేర్కొన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలంతా పనిచేసే వారికి పట్టం కట్టాలని, కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సబ్బండ వర్గాల అభివృద్ధి పెద్ద ఎత్తున జరుగుతున్నదని పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ అభ్యర్థి తిరుపతి మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు అవలంబిస్తున్న విధానాలు నచ్చక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్లో చేరానని తిరుపతి పేర్కొన్నారు. వెలిచాల రాజేందర్రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కరీంనగర్ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ చెందిన నాయకులు సర్పంచులు గా గెలవబోతున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత పటిష్టం కానుందని రాజేందర్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ అభ్యున్నతికి పాటుపడతానని తిరుపతి తెలిపారు.

# రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు అల్ఫోర్స్ విద్యార్థులు అభినందించిన అల్ఫోర్స్ అధినేత నరేందర్ రెడ్డి

కరీంనగర్, డిసెంబర్ 3(భారతశక్తి ప్రతినిధి):విద్యార్థులకు వైజ్ఞానిక శాస్త్రం పట్ల అవగాహన కలిగించాలని, ఆ విషయాలపై సంపూర్ణంగా సమాచారం అందిస్తే విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయడానికి ఆసక్తిని ప్రదర్శిస్తారని అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. వైజ్ఞానిక అంశాలపై పట్టు సాధించడం వల్ల విజయాలను సైతం సులభంగా నమోదు చేయగలుగుతారని చెప్పారు. బుధవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు ఇటీవల జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రాష్ట్రస్థాయికి ఎంపికైన సందర్భంగా విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ వైజ్ఞానిక శాస్త్రం చదవడం ద్వారా విద్యార్థులకు చాలా అవగాహన వస్తుందని, ప్రత్యేకంగా విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతుందని తెలిపారు. విద్యార్థులకు నిపుణులైన ఉపాధ్యాయులచే శిక్షణ ఇప్పిస్తున్నామని, వైజ్ఞానిక శాస్త్రంలోని విషయాల పట్ల పరిశోధనాత్మకంగా ప్రత్యక్షంగా బోధించడంలో విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీస్తున్నామని చెప్పారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీయడానికై ప్రాథమికంగా పరీక్ష నిర్వహిస్తూ చక్కటి ప్రతిభ చాటిన వివిధ దశలో నిర్వహిస్తున్నటువంటి పోటీ పరీక్షలకు ఎంపిక చేయడం జరుగుతుందని చెప్పారు.అ

ల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల కొత్తపల్లి

పి.నిశాంత్, 9వ తరగతి చెక్కపొడితో ముద్రణ, ఆండ్రియా మదన్ జోస్ -7వ తరగతి - ఇసుక విద్యుత్, బి.స్నితిక్, 7వ తరగతి - స్వర్ణ నిష్పత్తి..

అల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల - వెదిర



ఎస్.నితీష్ కుమార్ - 10వ తరగతి - హరిత శక్తి, అల్ఫోర్స్ గర్ల్స్ ఇ-టెక్నో పాఠశాల - వావిలాలపల్లి

అవిజ్ఞ - 7వ తరగతి - ఆటోమేటిక్ విత్తనాలు

నాటే యంత్రం, ఈ అభినందన సభలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ రాం మొండయ్య, జిల్లా సైన్స్ అధికారి శ్రీ జైపాల్ రెడ్డి, డిసిఇబి కార్యదర్శి శ్రీ భగవంత రావు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నూతన ఉత్సాహన్నీ, అత్యుత్తమ నమూనాలతో ప్రదర్శనకై కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందిస్తూ జాతీయస్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ చాటే విధంగా ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# నిర్మల్ జిల్లాను వదిలి ఆయా జిల్లాలకు తరలిస్తున్న ధాన్యంతో జిల్లా రైస్ మిల్లర్ల ఆవేదన

## మా ధాన్యం మాకు కావాలని డిమాండ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 3 (భారత శక్తి): జిల్లాలో పండిన నెంబర్%-%1 రబ్బి ప్యాడ్ను ఇతర జిల్లాలకు తరలింపుపై మిల్లర్ల భగ్గుమన్న ఆవేదన స్థానిక మిల్లులను రక్షించాలంటే వెంటనే చర్యలు తీసుకోవాలి' %-% రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నిర్మల్ జిల్లా రైస్ పరిశ్రమ ఎన్నడూ చూడని విధంగా ప్రస్తుతం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. జిల్లా రైతులు పండించిన అత్యుత్తమ నాణ్యత కలిగిన రబ్బి ప్యాడ్ స్థానిక మిల్లులకు కేటాయించకపోవడం వల్ల భారీ నష్టాలు జరుగుతున్నాయని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని ఈ అన్యాయాన్ని ఆపాలని వారు అన్నారు."నిర్మల్ ప్యాడ్కు రాష్ట్రవ్యాప్తంగా మంచి డిమాండ్%ొ% కానీ మాకు మాత్రం అందట్లేదు'' అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ"నిర్మల్ జిల్లా ప్యాడ్కి ప్రత్యేకమైన పేరు, గుర్తింపు ఉంది. ఇక్కడ పండే రబ్బి ప్యాడ్ రాష్ట్రంలోనే అత్యుత్తమ నాణ్యత కలిగినదిగా గుర్తింపు పొందింది. ఇలాంటి మంచి ప్యాడ్ను స్థానిక మిల్లులకు కేటాయించడం బదులు ఇతర జిల్లాలకు తరలిస్తున్నారు. దీంతో మా మిల్లులు పనిచేసే పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు.ఉత్పత్తి నగానికి తగ్గింది%ొ% మిల్లులు నష్టాల్లో మునుగుతున్నాయని హెచ్చరికస్థానిక మిల్లర్ల ప్రకారం, గత రెండు సీజన్లుగా ప్యాడ్ సరఫరా తీవ్రంగా తగ్గడంతో మిల్లుల ఉత్పత్తి 40%-%60 శాతం వరకు పడిపోయింది. మిల్లుల నిర్వహణ ఖర్చులు, విద్యుత్ చార్జీలు, కార్మిక వేతనాలు పెరుగుతూనే ఉండగా, ప్యాడ్ అందకపోవడం వల్ల పరిస్థితి అత్యంత కష్టంగా మారిందని వారు చెప్పారు."మిల్లులు ఖాళీగా ఉండడం వల్ల కోట్ల రూపాయల పెట్టుబడులు ప్రమాదంలో పడుతున్నాయి. ఈ రీతిలో కొనసాగితే నిర్మల్ జిల్లా రైస్ పరిశ్రమ పూర్తిగా దెబ్బతింటుంది" అని నాయకులు స్పష్టం చేశారు."మాకు నష్టం వచ్చినా రైతులను ఆదుకున్నాం%ొ% కానీ ఇప్పుడు మనపై అన్యాయం జరుగుతోంది"గత రబ్బి సీజన్ను గుర్తుచేసుకుంటూ మిల్లర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు."వర్షాల కారణంగా ప్యాడ్లో మొలకలు వచ్చినా కూడా రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో మేం ఆ ప్యాడ్ మొత్తం కొనుగోలు చేశాం. అప్పట్లో భారీ నష్టాలు మాకు వచ్చాయి. రైతులను ఆదుకున్నాం. కానీ ఇప్పుడు మంచి ప్యాడ్ గురించి వచ్చినప్పుడే మాకు అవకాశం ఇవ్వకుండా ఇతర జిల్లాలకు తరలించడం చాలా అన్యాయం" అని మిల్లర్లు అన్నారు.స్థానిక పరిశ్రమల భవిష్యత్తు ప్రమాదంలోఅసోసియేషన్ నాయకులు హెచ్చరిస్తూ "నిర్మల్ జిల్లా రైస్ మిల్లర్లు జెన్యూన్ గా, నిష్పక్షపాతంగా పనిచేస్తున్నారు. అయినప్పటికీ నెంబర్%-%1 ప్యాడ్ను కేటాయించకపోవడం వల్ల మొత్తం రైస్ పరిశ్రమ వెనకబడే పరిస్థితి ఏర్పడుతోంది. ఇది ఇలా కొనసాగితే అనేక మిల్లులు మూతపడే పరిస్థితి రావచ్చు" అన్నారు.ప్రభుత్వం తక్షణ జోక్యం తప్పనిసరిరైస్ మిల్లర్లు ప్రభుత్వానికి ప్రత్యేక విజ్ఞప్తి చేస్తూ"మొదటగా నిర్మల్ జిల్లాలో పండిన ప్యాడ్ను స్థానిక మిల్లులకు కేటాయించేలా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి. రైతులు%-%మిల్లర్లు రెండూ బతికేలా విధానాలు అమలు చేయాలి. జిల్లా అభివృద్ధికి రైస్ మిల్లులు కీలకం. అవి మూతపడితే వందలాది కుటుంబాల జీవనోపాధి కూడా ప్రమాదంలో పడుతుంది" అని డిమాండ్ చేశారు.అసోసియేషన్ చివర్లో హెచ్చరిస్తూ''ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే, జిల్లా వ్యాప్తంగా రైస్ మిల్లర్లతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాల్సి వస్తుంది" అని వినిపిస్తోంది.







# ఏపీ డిప్యూటీ సీఎం ప్రజలకు క్షమాపణ చెప్పాలి: ఆర్.పి.ఐ రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్

కరీంనగర్, డిసెంబర్ 3(భారతశక్తి ప్రతినిధి):




అంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, సినీ హీరో పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని రిపబ్లికన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర యువత. ప్రజలు. విద్యార్థులు. ఉద్యోగులు నిరుద్యోగులు సాధించుకొన్నామని చెప్పారు. తెలంగాణ ప్రజల వల్లనే ఎపిలో కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని సిగ్గుచేటన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అడుగు పెట్టనివ్వమని కుతాడి శివరాజ్ హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ లో నమ్ముతారేమో గానీ, తెలంగాణ ప్రజలు నిన్ను ఎప్పుడో మరిచిపోయారాని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులు, మేధావులు, కుల సంఘాలు ఆధ్వర్యంలో రాష్ట్ర సాధనలో భాగస్వాములు అయితేనే తెలంగాణ వచ్చిందన్నారు. శాంతియుతంగా సంవత్సరాలు పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. మా తెలంగాణ ప్రాంతాన్ని కించపరచడం దర్శింధికదన్నారు. రాజకీయం తెలియకపోతే తెలుసుకోవాలనీ, తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని కించపరిచి మాట్లాడడం మి విజ్ఞతకే వదిలేస్తున్నామని హెచ్చరించారు.




# దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్.. భారత జట్టు ఇదే!

భారత్, సౌతాఫ్రికా మధ్య డిసెంబరు 9 నుంచి ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీస్ కోసం భారత సెలక్టర్లు జట్టును ప్రకటించారు. ఈ సిరీస్‌తో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య పునరాగమనం చేయనున్నాడు. రింకు సింగ్‌పై వేటుపడింది. సఫారీలతో టెస్టు సిరీస్‌లో మెడ నొప్పితో మైదానాన్ని వీడిన శుభ్‌మన్ గిల్‌ను టీ20 సిరీస్‌కు ఎంపిక చేశారు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇస్తే గిల్ మ్యాచ్‌లు ఆడతాడు.



భారత జట్టు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య, శివమ్ దూబె, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, సంజు శాంసన్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, కుల్‌దీప్ యాదవ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్.

**ఐదు టీ20ల సిరీస్ షెడ్యూల్**

తొలి టీ20 డిసెంబర్ 9 (కటక్)
రెండో టీ20 డిసెంబర్ 11 (ముల్లాన్‌పూర్)
మూడో టీ20 డిసెంబర్ 14 (ధర్మశాల)
నాలుగో టీ20 డిసెంబర్ 17 (లఖ్‌నవూ)
ఐదో టీ20 డిసెంబర్ 19 (అహ్మదాబాద్)

# వారిద్దరూ వరల్డ్‌కప్ 2027 ఆడకుంటే మాకు సంతోషమే!

## : అఫ్గానిస్థాన్ క్రికెటర్




రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి.. వన్డే వరల్డ్ కప్ 2027 ఆడకుంటే తమకు సంతోషమే అని అఫ్గానిస్థాన్ వికెట్ కీపర్ రహ్మనుల్లా గుర్బాజ్ అన్నాడు. నిజానికి రోకో లాంటి లెజెండ్స్ వరల్డ్‌కప్‌లో భాగం కాకుంటే బాగోదని తన అభిప్రాయం వెల్లడించాడు. రోహిత్, కోహ్లి ఇప్పటికే టీ20, టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. ప్రస్తుతం వారు కేవలం వన్డే క్రికెట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు. వన్డే వరల్డ్‌కప్ 2027లో పాల్గొనడమే ధ్యేయంగా ముందుకుసాగుతున్నారు. అయితే వారి భవిష్యత్తుపై ప్రస్తుతం ఊహాగానాలు నడుస్తున్నాయి. వీరిద్దరూ ఆస్ట్రేలియా టూర్‌లో రాణించారు. అలాగే దక్షిణాఫ్రికాతో రాంచీ వేదికగా జరిగిన మొదటి వన్డేలోనూ సత్తా చాటారు. కోహ్లి భారీ సెంచరీ (135), రోహిత్ అద్భుత హాఫ్ సెంచరీ (57) సాధించారు. అలాగే రెండో వికెట్‌కు వీరు 136 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. 'ఒక అఫ్గానిస్థాన్ ఆటగాడిగా.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి భారత జట్టులో లేకుంటే నేను ఆనందపడతా. వారు టీమ్ఇండియాలో ఉంటే.. ఆ జట్టుకే విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయి. వారిద్దరూ లెజెండ్స్. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి జట్టులో లేరు అని ఎవరూ చెప్పలేరు. నిజానికి వారు జట్టులో లేకుంటే.. ప్రత్యర్థి జట్లు చాలా సంతోషపడతాయి' అని రహ్మనుల్లా గుర్బాజ్ అన్నాడు. 'నేను ఇబ్బందుల్లో ఉన్నప్పుడు విరాట్ భాయ్‌ను సాయం అడిగేవాన్ని. గత మూడు సంవత్సరాలుగా ఎప్పుడు నేను కాల్ చేసినా, మెసేజ్ చేసినా అతడు వెంటనే స్పందిస్తున్నాడు. ఇటీవలే నేను పరుగులు సాధించలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు అతన్ని సంప్రదించా. ఆ తర్వాతి మ్యాచ్‌లో నేను 90 పరుగులు స్కోర్ చేశా. కోహ్లి చాలా సింపుల్ వ్యక్తి. అతడు దేన్నీ క్లిష్టంగా మార్చడు. అతడు హార్డ్‌వర్క్ చేస్తాడు. అదే సమయంలో పనిని ఆస్వాదిస్తాడు. క్రికెట్‌లో అదే అవసరం. ఆటను ఆస్వాదించలేనప్పుడు మెరుగైన ప్రదర్శనలు చేయలేం' అని గుర్బాజ్ పేర్కొన్నాడు.

# రాయ్‌పుర్‌లో రప్ఫాడించారు..

## సఫారీలతో రెండో వన్డేలో టీమ్ఇండియా భారీ స్కోరు





రాయ్‌పుర్: భారత్, సౌతాఫ్రికా (IND vs SA) మధ్య మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇవాళ రెండో మ్యాచ్ జరుగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమ్ఇండియా భారీ స్కోరు సాధించింది. నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (22), రోహిత్ శర్మ (14) తక్కువ స్కోరుకే వెనుదిరిగిన వేళ.. రుతురాజ్ గైక్వాడ్ (105; 83 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సులు), విరాట్ కోహ్లి (102; 93 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సులు) శతకాలతో చెలరేగి జట్టుకు భారీ స్కోరు అందించారు. గైక్వాడ్‌కు వన్డేల్లో ఇది తొలి శతకం కావడం విశేషం. కేఎల్ రాహుల్ (66*; 43 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులు) చివర్లో మెరుపులు మెరిపించాడు. రవీంద్ర జడేజా (24*) పరుగులు చేశాడు. సౌతాఫ్రికా బౌలర్లలో మార్కో యాన్సెన్ 2, నంద్రీ బర్గర్, లుంగి ఎంగిడి ఒక్కో వికెట్ పడగొట్టారు. అర్ధ శతకం తర్వాత రుతురాజ్ దూకుడు పెంచాడు. కేశవ్ మహరాజ్ వేసిన 28 ఓవర్‌లో రుతురాజ్ రెండు ఫోర్లు, ఓ సిక్స్ బాదేశాడు. తర్వాత బాష్ బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు కొట్టి సెంచరీకి చేరువయ్యాడు. కాసేపటికే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే శతకం సాధించిన వెంటనే రుతురాజ్ అవుటైపోయాడు. 90 బంతుల్లో శతకం చేసిన కోహ్లి.. కొద్దిసేపటికే వెనుదిరిగాడు. విరాట్, రుతురాజ్ మూడో వికెట్‌కు 195 పరుగుల భాగస్వామ్యం (156 బంతుల్లో) నెలకొల్పారు. తర్వాత వచ్చిన వాషింగ్టన్ సుందర్ (1) రనౌట్ కాగా.. కేఎల్ రాహుల్ దూకుడుగా ఆడి 33 బంతుల్లో హాఫ్ సెంచరీ అందుకున్నాడు.




## పసిడితో వెండి పోటీ..

# రికార్డు గరిష్ఠాలకు సిల్వర్!



సరిగ్గా ఏడాది క్రితం వెండి ధర కిలో తొలిసారి లక్ష రూపాయలు దాటితే వామ్మో! అనుకున్నారంతా. కానీ, ఇప్పుడు అదే వెండి పసిడికి ఏమాత్రం తక్కువ కానంటోంది. పట్టపగ్గాల్లేకుండా దూసుకెళుతోంది. దేశీయంగా కిలో వెండి రూ.1.84 లక్షల వద్ద సరికొత్త రికార్డు గరిష్ఠాలను నమోదు చేసింది. అటు పసిడి సైతం రూ.1.30 లక్షల పైనే పలుకుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర పెరగడానికి తోడు, రూపాయి విలువ పతనం కావడమూ ఈ లోహాల ధరల పెరుగుదలకు కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో (MCX) గోల్డ్ ఫ్యూచర్స్‌లో 2026 ఫిబ్రవరి కాంట్రాక్ట్ 10 గ్రాముల ధర రూ.1.30 లక్షలు పలుకుతోంది. అదే సమయంలో ఎంసీఎక్స్‌లో మార్చి డెలివరీ వెండి అత్యధికంగా రూ.3,126 పెరిగి రూ.1,84,727 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరింది. బుధవారం డాలరుతో రూపాయి మారకం విలువ 90 మార్కు దాటింది. దీంతో దేశీయంగా వీటి ధరలు పెరిగాయి. దీనికితోడు యూఎస్ ఫెడ్ వడ్డీరేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో ఫ్యూచర్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు పెరుగుదలకు కారణమని అనలిస్టులు విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4,204 వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 57.90 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి రూ.1.32 లక్షలు పలుకుతుండగా.. కిలో వెండి రూ.1.83 లక్షలుగా ఉంది.

**వెండికీ అందుకే అంత డిమాండ్**

గతంలో దేవుళ్ల బొమ్మలు, పూజా సామగ్రి, సంపన్నుల ఇళ్లల్లో పళ్లాలు, గ్లాసులకు వెండిని దేశీయంగా వినియోగించేవారు. కొవిడ్ తర్వాత పరిస్థితులు మారాయి. పారిశ్రామికంగా వెండి వినియోగం పెరిగింది. సౌర విద్యుత్ రంగం, విద్యుత్ కార్లు, మొబైల్స్ తదితర రంగాల నుంచి దీనికి డిమాండ్ పెరిగింది. దీనికితోడు చిన్న మదుపరులు పెట్టుబడి కోసం వెండిని కొనడం ప్రారంభించారు. ద్రవ్యోల్బణాన్ని తట్టుకునే శక్తి బంగారంతో పాటు వెండికి ఉందని చెబుతుండటంతో, మదుపరుల్లో ఆసక్తి పెరుగుతోంది. దీంతో ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెడుతున్నారు.

# రూపాయి పతనం.. సామాన్యుడిపై భారమెంత?

భారత రూపాయి మారకం విలువ అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూ.90 మార్క్ దాటింది. ఇది చారిత్రక కనిష్ఠం. రూపాయి పతనం కొత్తేం కాదు. కానీ, దాని పర్యవసానాలు మాత్రం సందర్భాన్ని బట్టి తీవ్రంగా ఉంటాయి. దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు సామాన్యుడి జీవితంపై కూడా దీని ప్రభావం ఉంటుంది. దిగుమతుల నుంచి విదేశీ చదువుల దాకా అన్నీ భారం అవుతాయి.



**కారణాలు..**

రూపాయి విలువ క్షీణతకు మూడు కారణాలున్నాయి. అమెరికాతో వాణిజ్య విభేదాలు ప్రధాన కారణం. భారతీయ ఎగుమతులపై 50 శాతం వరకు సుంకాలు విధించడం రూపాయి సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. మరోవైపు ఈ ఏడాది విదేశీ మదుపరులు భారత ఈక్విటీల నుంచి దాదాపు 17 బిలియన్ డాలర్లు వెనక్కి తీసుకున్నారు. ఇది రూపాయిపై ఒత్తిడిని పెంచింది. అలాగే, ఆర్బీఐ పాలసీ మార్పు కూడా ప్రభావం చూపుతోంది. రూపాయి విలువను కాపాడటానికి కేంద్ర బ్యాంకు చర్యలు తీసుకోవడం లేదు. మార్కెట్ గమనాన్ని అనుసరించి ముందుకు వెళ్లేందుకు అనుమతిస్తోంది.

**రూపాయి పతన ప్రభావం**

మన దేశ అవసరాల్లో దాదాపు 85 శాతం చమురు విదేశాల నుంచే దిగుమతి అవుతోంది. ఎలక్ట్రానిక్స్, ఎరువులు, వంట నూనెల కోసం కూడా విదేశీ సరఫరాదారులపై ఆధారపడుతోంది. రూపాయి పడటం వల్ల ఈ దిగుమతి బిల్లులు పెరుగుతాయి. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులు 2023తో పోలిస్తే ఏటా అదనంగా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఉదాహరణకు, 50,000 డాలర్ల వార్షిక ఫీజు ఒకప్పుడు రూ.80 రూపాయిల దగ్గర రూ.40 లక్షలు అయితే.. ఇప్పుడు రూ.90 వద్ద అది రూ.45 లక్షలకు చేరుతుంది. విదేశీ విద్య కోసం డాలర్లలో లోన్లు తీసుకున్నవారు ఇప్పుడు రూపాయల్లో తిరిగి చెల్లించేటప్పుడు 12 నుంచి 13 శాతం అధికంగా చెల్లించాల్సిన పరిస్థితి. ముడి చమురు దిగుమతుల ఖర్చు పెరిగితే పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయి. ఫలితంగా రవాణా ఖర్చులు భారం అవుతాయి. తద్వారా నిత్యావసరాల ధరలు ఎగబాకుతాయి.

**గతం కంటే భిన్నం..**

గతంలో రూపాయి సంక్షోభాల కంటే ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. 2022లో బలమైన డాలర్ కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక కరెన్సీలు బలహీనపడ్డాయి. కానీ, ఈసారి డాలర్ విలువ స్థిరంగా ఉన్నప్పటికీ రూపాయి పడిపోయింది. మరోవైపు ఆర్బీఐ వద్ద ఇప్పుడు 690 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు ఉన్నాయి. 2013 నాటి 'Taper tantrum' సంక్షోభం, 2018 నాటి చమురు ధరల పెరుగుదల సమయంలో ఈ స్థాయిలో నిల్వలు లేవు. అందుకే ఆర్‌బీఐ అత్యవసరమైతే తప్ప పెద్దగా జోక్యం చేసుకోకుండా మార్కెట్‌ను గమనిస్తోంది. తక్షణ సమస్యల పరిష్కారానికి బదులు, దీర్ఘకాలికంగా ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండాలని చూస్తోంది.

**ప్రవాసులకు పండగే**

రూపాయి విలువ తగ్గడం కొంతమందికి మంచి వార్త కూడా. ప్రపంచంలోనే అత్యధికంగా రెమిటెన్స్‌లు భారత్‌కు వస్తున్నాయి. 2024లో భారత్ సుమారు 137 138 బిలియన్ డాలర్లు పొందింది. ప్రతి నెల 500 డాలర్లు పంపేవారికి, ఇప్పుడు రూ.40,000కు బదులు రూ.45,000 వస్తాయి. అలాగే డాలర్లలో ఆదాయం పొందే ఐటీ, ఫార్మా కంపెనీలకు కూడా ఆదాయాలు పెరుగుతాయి.

# వివాదం వేళ సంచార్ సాథీ డౌన్‌లోడ్స్‌లో బిగ్ జంప్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంచార్ సాథీ యాప్ డౌన్‌లోడ్స్ అనూహ్యంగా పెరిగాయి. ఈ యాప్‌ను ప్రీ ఇన్‌స్టాల్ యాప్‌గా ఇవ్వాలని మొబైల్ తయారీ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం.. దీన్నో 'స్నూపింగ్' యాప్‌గా విపక్షాలు పేర్కొనడంతో దీనిపై వివాదం రాజుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ యాప్ డౌన్‌లోడ్స్ ఒక్కసారిగా పెరిగాయని డాట్ (DoT) వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటివరకు ఈ యాప్‌ను 1.5 కోట్ల మంది ప్రజలు తమ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకున్నారు. వివాదానికి ముందువరకు రోజుకు సగటున 60 వేల మంది ఇన్‌స్టాల్ చేసుకున్నారు. తాజాగా సగటున డౌన్‌లోడ్ల సంఖ్య ఒక్కసారిగా 60 వేల నుంచి 6 లక్షలకు పెరిగాయని డాట్ వర్గాలు తెలిపాయి. గతంతో పోలిస్తే 10 రెట్లు అధికమని పేర్కొన్నారు. కొత్తగా వచ్చే సెల్‌ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను ముందుగానే ఇన్‌స్టాల్ చేసి ఇవ్వాలని కేంద్రం నవంబర్ 28న ఆదేశాలు ఇచ్చింది. ఇది ప్రజల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగిచూసే చర్య అని విపక్షాలు ఆందోళన వ్యక్తంచేశాయి. అయితే కంపెనీలు ముందుగానే ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి ఇచ్చినా.. వినియోగదారులు డిలీట్ చేసుకోవచ్చని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఈ యాప్ ద్వారా స్నూపింగ్ గానీ, కాల్స్ పర్యవేక్షణ గానీ జరగబోదని టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఇప్పటివరకూ 2.75 కోట్ల మోసపూరిత మొబైల్ కనెక్షన్లను తొలగించామని, చోరీకి గురైన 20 లక్షల ఫోన్ల లొకేషన్‌ను గుర్తించి అందులో 7.5 లక్షల ఫోన్లను పోగొట్టుకున్నవారికి అందజేశామని తెలిపారు.

**ఏమిటీ యాప్ ప్రత్యేకత?**

సంచార్ సాథీ యాప్‌లో అనేక అధునాతన ఫీచర్లున్నాయి. ఈ యాప్‌ను మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయిన తర్వాత ఫోన్ నంబరు కేంద్రీకృత డేటాబేస్ దీంతో అనుసంధానం అవుతుంది. చట్టబద్ధంగా తీసుకున్న ప్రతి మొబైల్ వివరాలు రికార్డయి ఉంటాయి. ఫోన్ పోయినా, దొంగతనానికి గురైనా ఈ




యాప్ ద్వారా బ్లాక్ చేసేలా ఫిర్యాదు చేసుకోవచ్చు. ఆ తర్వాత సంబంధిత మొబైల్ ఎక్కడా పని చేయకుండా అన్ని నెట్‌వర్క్‌లను అలర్ట్ చేస్తుంది. దాంతో సిమ్ మార్చినా ఫోన్‌తో ఉపయోగం లేకుండాపోతోంది. అనుమానిత కాల్స్, మెసేజ్‌లు వచ్చినప్పుడు కాల్‌లాగ్ నుంచే నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చు. మీ పేరు మీద ఎన్ని మొబైల్ కనెక్షన్లు ఉన్నాయో తెలుసుకోవచ్చు. అనధికారికంగా ఏవైనా నంబర్లు ఉంటే ఫిర్యాదు చేయొచ్చు. మొబైల్ చోరీకి గురైనా, పొరపాటున పారేసుకున్నా బ్లాక్ చేసే సదుపాయం ఉంది. మొబైల్ ఫోన్ ప్రామాణికతను సంచార్ సాథీ యాప్ సాయంతో గుర్తించొచ్చు.

# సినిమా

## అలాంటి వారికి శిక్ష విధించాలి: రష్మిక



ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం ఎక్కువైంది. ఈ అధునాతన సాంకేతికతతో కొందరు అద్భుతాలు చేస్తుంటే.. మరికొందరు దుర్వినియోగం చేస్తున్నారు. కొందరిని టార్గెట్ చేసుకుని, ముఖ్యంగా సెలబ్రిటీల ఫొటోలు/ వీడియోలను అసభ్యకర రీతిలో ఎడిట్ చేసి, సోషల్ మీడియాలో పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారు. దీనిపై ఇప్పటికే పలువురు హీరోయిన్లు స్పందించగా.. తాజాగా రష్మిక గళం విప్పారు. మనుషుల్లాగా ప్రవర్తించని వారికి శిక్ష విధించాలంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'సైబర్ దోస్త్' ఖాతాను ట్యాగ్ చేశారు. 'ఏఐ అనేది అభివృద్ధికి ఊతంలాంటిది. కానీ, మహిళలను లక్ష్యంగా చేసుకుని దీనిని దుర్వినియోగం చేస్తుండటం కొంతమంది వ్యక్తులలో నైతిక క్షీణతను సూచిస్తుంది. నిజానికి ఇంటర్నెట్ ప్రతిబింబంలాంటిది కాదని గుర్తుపెట్టుకోండి. ఏదైనా వక్రీకరించగలిగే కాన్వాస్ ఇది. గౌరవప్రదమైన, మెరుగైన సమాజం కోసం ఏఐని వినియోగిద్దాం. నిర్లక్ష్యాన్ని వదిలి బాధ్యత తీసుకుందాం'' అని సూచించారు. ఏఐ దుర్వినియోగంపై కొన్ని రోజుల క్రితం కీర్తి సురేశ్, గిరిజా ఓక్ తదితరులు మాట్లాడిన సంగతి తెలిసిందే. ఏఐ ఓ రకంగా వరమే అయినా మరో కోణంలో శాపంగా చూడాల్సి వస్తోందని కీర్తి ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో తన మార్ఫింగ్ ఫొటో చూసి షాక్ అయ్యానని తెలిపారు.


## బాలీవుడ్‌కు దిల్‌రాజు.. ఆ వార్తలను ఖండించిన టీమ్



టాలీవుడ్ అగ్ర నిర్మాత దిల్ రాజు బాలీవుడ్‌పై ఫోకస్ చేయనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. బీటౌన్‌లో ఆయన ఆరు ప్రాజెక్ట్‌లు చేయనున్నారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. తాజాగా ఆ వార్తలపై దిల్ రాజు టీమ్ అధికారికంగా స్పందించింది. వాటిని ఖండిస్తూ నోట్ విడుదల చేసింది. ''కొన్ని రోజులుగా శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ అప్‌కమింగ్ ప్రాజెక్ట్ గురించి వస్తోన్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవి. మేము ప్రస్తుతం చేస్తోన్న సినిమాలను బాలీవుడ్ వాటితో సంబంధం ఉన్నట్లు వార్తలు సృష్టిస్తున్నారు. బాలీవుడ్‌లో ఒక్క ప్రాజెక్ట్ మాత్రమే చేస్తున్నాం. అక్షయ్‌కుమార్ హీరోగా అనీస్ బాజ్మీ దర్శకత్వంలో అది రానుంది. ప్రస్తుతం దాని ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే అధికారిక ప్రకటన విడుదల చేస్తాం. అప్పటివరకూ ఈ రూమర్స్‌ను నమ్మొద్దు. అవాస్తవాలను ప్రచారం చేయొద్దు'' అని నిర్మాణ సంస్థ విజ్ఞప్తి చేసింది. తెలుగులో బ్లాక్‌బస్టర్‌ను సొంతం చేసుకున్న 'సంక్రాంతికి వస్తున్నాం'ను దిల్ రాజ్ హిందీలో రీమేక్ చేయనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తున్నాయి. అందులో హీరో అక్షయ్‌కుమార్ అని కూడా ప్రచారం జరుగుతోంది.


## చిరంజీవితో సినిమా.. ఎన్నో జ్ఞాపకాలు

**: అప్‌డేట్ ఇచ్చిన వెంకటేశ్**



చిరంజీవితో కలిసి నటించాలని ఎప్పటి నుంచో అనుకున్నానని, ఇన్నాళ్లకు అది సాధ్యమైందంటూ ప్రముఖ నటుడు వెంకటేశ్ ఆనందం వ్యక్తం చేశారు. 'మన శంకర వరప్రసాద్ గారు' ఉద్దేశించి అన్నారు. ఈ మూవీలోని తన పాత్రకు సంబంధించిన షూటింగ్ బుధవారంతో పూర్తయిందని తెలియజేస్తూ.. సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ''నా ఫేవరెట్ చిరంజీవితో కలిసి పని చేయడం ఆనందంగా ఉంది. ఈ సినిమా ఎన్నో జ్ఞాపకాలు అందించింది. 2026 సంక్రాంతిని ఈ సినిమాతో థియేటర్లలో సెలబ్రేట్ చేసుకునేందుకు ఎదురుచూస్తున్నా'' అని పేర్కొన్నారు.


## ఆరుగురు హీరోయిన్లు అబద్ధం



హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేసుకుంటూ వెళ్తున్నాడు రవితేజ. ఒక సినిమా సెట్స్ మీద ఉండగానే ఇంకో చిత్రాన్ని తీసుకెళ్తూ ఏడాది పొడవునా బిజీగా గడుపుతున్నాడు. ఇటీవల 'మాస్ జాతర' మూవీతో ప్రేక్షకులను పలకరించిన హీరో.. ఇప్పుడు 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రాన్ని సంక్రాంతికి రెడీ చేస్తున్నాడు. మరోవైపు తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ని పట్టాలెక్కించే పనిలో ఉన్నాడు. అయితే ఈ సినిమాకి సంబంధించిన అధికారిక ప్రకటన రాకముందే ఓ ఆసక్తికరమైన రూమర్ ప్రచారంలోకి వచ్చింది. ఇందులో రవితేజ సరసన ఆరుగురు హీరోయిన్లు నటిస్తున్నట్లుగా గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై చిత్ర బృందం తాజాగా క్లారిటీ ఇచ్చింది. ఈ వార్తలను ఖండించింది. అవన్నీ ఫేక్ అని స్పష్టం చేసింది. ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మొద్దని, ఈ చిత్రానికి సంబంధించి అఫీషియల్ అప్‌డేట్స్ మాత్రమే షేర్ చేయాలని విజ్ఞప్తి చేసింది.

## మాటలు రానంత సంతోషం





నటి సమంత వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. దర్శకుడు రాజ్ నిడిమోరుని ఆమె ఈ నెల 1న పెండ్లి చేసుకున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు రావడంతో ఈ జంటకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. పెండ్లి తర్వాత మరుసటి రోజు ఆమెకు అత్త గారింట్లో గ్రాండ్ వెల్‌కమ్ లభించింది. దర్శకుడు రాజ్ నిడిమోరు సోదరి శీతల్ ఈ జంటకు శుభాకాంక్షలు తెలుపుతూ పంచుకున్న నోట్‌ను ఫ్యాన్స్ షేర్ చేస్తున్నారు. 'గొప్ప భక్తుడు ఆర్తితో నిండిన హృదయంతో శివలింగాన్ని ఆలింగనం చేసుకుంటే ఎంత ఆనందంగా ఉంటాడో.. అంతే ఆనందంతో నా హృదయం ఉప్పొంగుతోంది. మాటలు రావడం లేదు. నేడు మా కుటుంబం పరిపూర్ణమైంది' అని పేర్కొంది. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ ముందుకు సాగడం తమకు గర్వంగా ఉందన్న శీతల్.. తాము వారికి ఎప్పుడూ అండగా ఉంటామని రాసుకొచ్చింది. ఈషా ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలిపింది. ఇక ఈ పోస్ట్‌పై స్పందించిన నటి సమంత లవ్ అని రిప్లై పెట్టింది.

## వర్కింగ్ అవర్స్ డిబేట్ కంటిన్యూ..



సినిమా ఇండస్ట్రీలో ఎప్పుడూ చర్చనీయాంశమైన అంశాల్లో వర్కింగ్ అవర్స్ ఒకటి. ఇటీవల దీపికా పదుకొణె వివాదం తర్వాత ఇది హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు దీనిపై స్పందించగా తాజాగా మరో ఇద్దరు నటులు మాట్లాడారు. 8 గంటలు మాత్రమే వర్క్ చేయాలన్న అభిప్రాయంపై రానా దగ్గుబాటి స్పందిస్తూ అన్ని రంగాల కంటే సినిమా రంగం భిన్నమైందన్నారు. 'నటన అంటే ఉద్యోగం కాదు. ఇది లైఫ్‌స్టైల్. దీన్ని దైనందిన జీవితంలో అలవాటు చేసుకోవాలి. ఈ జీవనశైలిని పాటించాలా, వద్దా అనేది పూర్తిగా మీ నిర్ణయమే. 8 గంటలు కదలకుండా కూర్చొని పనిచేస్తే అద్భుతమైన అవుట్‌పుట్ రావడానికి యాక్టింగ్ అనేది ప్రాజెక్ట్ కాదు' అని పేర్కొన్నాడు. ఇక దుల్కర్ స్పందిస్తూ మలయాళ చిత్ర పరిశ్రమలో వర్క్ నేచర్ గురించి ప్రస్తావించాడు. షూటింగ్ ప్రారంభించిన తర్వాత ఎప్పుడు పూర్తి చేస్తారో కూడా తెలియదన్నాడు. తెలుగులో మాత్రం మహానటి మూవీ చేస్తున్న సమయంలో ఒక్కోసారి సాయంత్రం ఆరు గంటలకే ఇంటికి వెళ్లేవాడినని చెప్పాడు. ఇక తమిళంలో రెండు ఆదివారాలు కూడా సెలవు ఇస్తారన్నాడు.



## 'అఖండ 3' టైటిల్ ఇదేనా.. హింట్ ఇచ్చిన టీమ్!

ప్రస్తుతం ఎక్కడ చూసినా 'అఖండ 2' పేరే వినిపిస్తోంది. బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కిన ఈ సినిమా డిసెంబర్ 5న థియేటర్‌లలో సందడి చేసేందుకు సిద్ధమైంది. ఇప్పుడు ఈ క్రేజీ కాంబినేషన్‌కు సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గతంలో ఒక ఇంటర్వ్యూలో తమన్ మాట్లాడుతూ 'అఖండ' 5 పార్ట్‌లు వచ్చే అవకాశం ఉంటుందని చెప్పిన విషయం తెలిసిందే. తాజాగా దీని మూడో పార్ట్ టైటిల్ బయటకు వచ్చేసిందని అభిమానులు భావిస్తున్నారు. తాజాగా ఈ సినిమా పనులు అన్నీ పూర్తయ్యాయని.. ఈ శివ తాండవాన్ని (అఖండ 2 తాండవం) థియేటర్‌లలో చూడడానికి అందరూ సిద్ధంగా ఉండండి అని తమన్ ఒక ఫొటో పంచుకున్నారు. ఆ ఫొటోలో స్క్రీన్‌పై 'జై అఖండ' అని రాసి ఉంది. దీంతో పార్ట్ 2 చివర్లో మూడో భాగాన్ని అధికారికంగా ప్రకటిస్తారని దాని టైటిల్ 'జై అఖండ' అని ఫ్యాన్స్ భావిస్తున్నారు. గతంలో 'పుష్ప 2' సమయం లోనూ మూడో భాగం ఉన్నట్లు అలానే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవల తమన్ 'అఖండ' గురించి మాట్లాడుతూ.. "బాలకృష్ణపై ఉన్న ప్రేమను ఆయన సినిమాలకు సంగీతం అందించి తెలిపే అవకాశం వచ్చింది. ఆయన ఎప్పుడు కలిసినా 'ఈ సినిమాలో కొత్తగా ఏం చేస్తున్నావు' అని అడుగుతారు. అందరూ ఒక పార్ట్‌లోనే కథంతా చూపించేశారు కదా.. ఇక రెండో భాగంలో ఏమి ఉంటుంది అని అంటుంటారు. కానీ, అఖండని ఐదు భాగాలుగా అయినా తీయొచ్చు. దానికి కూడా బాలయ్య సిద్ధంగానే ఉంటారు. శివుడి గురించి ఎంతైనా చెప్పొచ్చు" అని అన్నారు.





## సీఎం రేవంత్ రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు

ఎల్బీనగర్, డిసెంబర్ 03 (భారత శక్తి): నిండు సభలో రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయి ఉండి హిందూ దేవుళ్ళు, దేవతలను అవమానపరుస్తూ, అపహాస్యం చేస్తూ, మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డిపై న్యాయపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ కార్పొరేటర్లు పోలీస్ స్టేషన్ నందు ఎస్ఐ లక్ష్మణ్ కు ఫిర్యాదు పత్రం అందచేశారు. సనాతన ధర్మాన్ని అవమానించే విధంగా మాట్లాడి హిందువుల భావాలను దెబ్బ తీస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ నేపథ్యంలో ఆయనపై బుధవారం సరూర్నగర్ పోలీస్ స్టేషన్లో అధికారికంగా ఫిర్యాదు నమోదు చేశామని తెలిపారు. హిందూ భావాలను కించపరిచే, ధర్మాన్ని అవమానించే మాటలకు రాజకీయ రక్షణ ఉండదని. ప్రజల మనోభావాలను కాపాడే బాధ్యత ప్రతి ప్రజాస్వామ్య ప్రభుత్వానిది. అందుచేత ఈ విషయంలో తక్షణమే సరైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సరూర్నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి, గడ్డిఅన్నారం డివిజన్ బీజేపీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి సరూర్నగర్ బీజేపీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, గడ్డిఅన్నారం బీజేపీ అధ్యక్షుడు జయప్రకాశ్, సీనియర్ నాయకులు కబీర్ దాస్ గోవర్ధన్, నాగరాజ్, దోషి తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# పటిష్టంగా గ్లోబల్ సమ్మిట్ బందోబస్తు

* ఏర్పాట్లను దగ్గర ఉండి పరిశీలించిన ఏడిజీ మహేష్ భగవత్



రాచకొండ, డిసెంబర్ 03 (భారత శక్తి): రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం ఫ్యూచర్ సిటీలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, బందోబస్త్ మీద వివిధ విభాగాల అధికారులతో అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ బుధవారం ఫ్యూచర్ సిటీలో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. రాచకొండ సిపి సుధీర్ బాబు, అడిషనల్ డీజీ మహేష్ భగవత్, ఐజిపి రమేష్ రెడ్డితో కలిసి బందోబస్త్ ఏర్పాట్లను గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి మొత్తం



మీటింగ్ ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం మహేష్ భగవత్ మాట్లాడుతూ, బందోబస్త్ విషయంలో ఏ మాత్రం పొరపాటు చేయవద్దని, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన అధికారులకు సూచించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో ఈ సమ్మిట్ నిర్వహిస్తునందున, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులతో పాటు స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్, అక్టోపస్, గ్రేహౌండ్స్, డాగ్, బాంబ్ స్క్వాడ్స్ తో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమ్మిట్ కి కావాల్సిన సదుపాయాలపై, బేరక్స్, మెస్, కిచెన్, మరుగుదొడ్ల వంటి మౌలిక సదుపాయల గురించి అధికారులతో చర్చించారు. అంతర్జాతీయ పెట్టుబడి సంస్థల ప్రతినిధులు, బహుళ సంస్థల అధినేతలు, దేశీయ సంస్థల ప్రముఖులు, పారిశ్రామిక దిగ్గజాలతో కలిపి సుమారు 6వందల మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు అధికారులు వెల్లడించారు. వీఐపీ ప్రతినిధుల చుట్టూ మూడంచెల భద్రత ఉంటుంది. గ్లోబల్ సమ్మిట్ జరిగే ప్రాంతంలో అడుగడుగునా నిఘా పెట్టేందుకు సుమారు వెయ్యికిపైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇవన్నీ సెంట్రల్ పోలీసు కంట్రోల్ రూమ్ కు అనుసంధానమై ఉంటాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం సుమారు వెయ్యి మంది ట్రాఫిక్ పోలీసులను నియమించనున్నారు. రహదారుల మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ నిర్వహణ వంటి వాటి కోసం ట్రాఫిక్ మార్షల్స్ నియమించుకోనున్నారు. ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం, ఇబ్బందులు కలుగకుండా ఆయా మార్గాలను పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుంది. సాధారణ ప్రజలు, వాహనదారులకు రెండు రోజుల పాటు ఆయా మార్గాలలో రహదారుల మళ్లింపులు ఉంటాయని తెలిపారు.




## సీఎం చేసిన అవమానకర వ్యాఖ్యలను ఖండిస్తూ బీజేపీ నిరసన

ఎల్బీనగర్, డిసెంబర్ 03 (భారత శక్తి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూ దేవీ-దేవతలు, హిందూ సమాజంపై చేసిన అవమానకర వ్యాఖ్యలు, వ్యంగ్య భాష హిందువుల భావోద్వేగాలను దెబ్బతీసే విధంగా ఉండడం ఖండనీయమైంది. ఈ హిందూ ద్వేషపూరిత ధోరణికి నిరసనగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు పిలుపుమేరకు, బుధవారం గడ్డిఅన్నారం డివిజన్ కమలానగర్ చౌరస్తా వద్ద బీజేపీ గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షుడు దాసరి జయప్రకాష్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గడ్డిఅన్నారం డివిజన్ బీజేపీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి హాజరై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు "సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ " అంటూ తీవ్రంగా నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నిరసనలో భాగంగా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, బీజేపీ కార్యకర్తలను సరూర్నగర్ పోలీస్ సిబ్బంది అదుపులోకి తీసుకుని సరూర్నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హిందూ ధర్మాన్ని అవమానించే వ్యాఖ్యలు, హిందూ సమాజాన్ని విధ్వంసం చేసే చర్యలపై బీజేపీగా ఎప్పటికప్పుడు పోరాటం కొనసాగిస్తామని కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఏనుగు శ్రీధర్ రెడ్డి, మురళి, చిలకూరి మధుసూదన్ రెడ్డి, బాబు చౌదరి, రాజు, సిరి రెడ్డి, అమంచి శ్రీనివాస్, సిద్ధు, వంశీ యాదవ్, టీంకు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం తీవ్రతరం చేస్తాం

* చలో హైదరాబాద్ కు రంగారెడ్డి జిల్లా నుండి భారీగా తరలిన జర్నలిస్టులు.
* వందలాదిగా తరలి వచ్చి విజయవంతం చేసిన జర్నలిస్టులు
* వారికి ధన్యవాదాలు తెలిపిన కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, సలీమ్, మేకల సత్యనారాయణ.





ఎల్బీనగర్, డిసెంబర్ 03 (భారత శక్తి): జర్నలిస్టుల సమస్యలు తీర్చే వరకు, ప్రభుత్వం దిగి వచ్చే వరకు ఇలాగే ఉద్యమిస్తామని రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎండి సలీం పాషా, కార్యదర్శి మేకల సత్యనారాయణలు అన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోరుతూ టియుడబ్ల్యూజే ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మహా ధర్నా విజయవంతం అయిందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా వందలాది మంది జర్నలిస్టులు హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున జర్నలిస్టులు తరలి వచ్చి ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా జిల్లా కార్యదర్శి మేకల సత్యనారాయణ తదితరుల ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి, చేవెళ్ల, షాద్ నగర్, ఎల్బీనగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల నుండి పెద్ద ఎత్తున ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొత్త ప్రభుత్వం అని ఇన్నాళ్లు వేచి చూసామని సమస్యలు పరిష్కరించకపోతే పోరుబాటనే ఎంచుకుంటామన్నారు. నూతనంగా జర్నలిస్టులకు అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, వృత్తి కమిటీలు నియమించాలని చిన్న మధ్యతరగతి పత్రికలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల నినాదాలతో దద్దరిల్లిన మహా నగరం. జర్నలిస్టుల నినాదాలతో హైదరాబాద్ మహా నగరం దద్దరిల్లింది. సమస్యల పరిష్కారం కోరుతూ టియుడబ్ల్యూజే ఆధ్వర్యంలో చేపట్టిన 'హలో జర్నలిస్ట్ చలో హైదరాబాద్' పిలుపుకు మంచి స్పందన వచ్చింది. రంగారెడ్డి జిల్లా నుండి పెద్ద ఎత్తున జర్నలిస్టులు నియోజకవర్గాల నుండి భారీ సంఖ్యలో ర్యాలీగా తరలివచ్చారు. జిల్లాతో పాటుగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ కార్ల ర్యాలీతో మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున జర్నలిస్టులకు వారు ధన్యవాదములు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా సానుకుల నిర్ణయం తీసుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల మహా ధర్నాకు పోలీసులు భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు.



## హరిహరసుతుడైన అయ్యప్ప స్వామి పూజలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మీర్ పేట్, డిసెంబర్ 03 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 36వ డివిజన్‌లో, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి భక్తులకు ఆ స్వామి ఆశీస్సులు ఉండాలని భక్తి మార్గం అనేది మనసును పవిత్రం చేసేది, సమాజాన్ని శాంతి-సౌఖ్యాలతో నింపేదని ఆమె అన్నారు. హరిహరసుతుడైన అయ్యప్ప స్వామి పట్ల భక్తుల అనురాగం అపారమని, ప్రతి సంవత్సరం జరిగే అయ్యప్ప పూజలు సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దిండు రాజు గౌడ్, అర్కల భూపాల్ రెడ్డి, అర్కల కామేష్ రెడ్డి, దిండు శంకర్ గౌడ్, మదారి రమేష్, జిల్లా విజయ్, లక్ష్మణ్ ముదిరాజ్, రాజ్ కుమార్, సిద్దాల అంజయ్య, గోపి యాదవ్, ప్రభాకర్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ సిల్వేరి సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

# వేగవంతమైన అభివృద్ధి పనులు ప్రారంభం : బస్తీ బాటలో హామీ



హైదరాబాద్, డిసెంబర్ 03 (భారత శక్తి): గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డితో కలిసి తార్నాక డివిజన్‌లోని మాణికేశ్వరి నగర్, రవీంద్ర నగర్, పార్థివాడ ప్రాంతాల్లో బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి, జలమండలి, విద్యుత్ శాఖ, రెవెన్యూ శాఖ, ఆరోగ్య శాఖ, నగర పల్లె అభివృద్ధి విభాగాలు, పర్యావరణ శాఖ అధికారులతో పాటు అనేక మంది స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అధికారులు ప్రతి బస్తీలో ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను సమగ్రంగా నమోదు చేశారు. బస్తీ బాట సందర్శనలో ప్రధానంగా రహదారుల మరమ్మతులు, కొత్త రహదారుల నిర్మాణం, చెత్త వ్యవస్థలో లోపాలు, వీధిదీపాల పనితీరు, డ్రైనేజ్ బ్లాకేజీలు, నాళాల డీసిల్టింగ్, మంచినీటి సరఫరాలో అంతరాయాలు, కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ, పాఠశాలల చుట్టుపక్కల శుభ్రత, స్మశాన వాటిక అభివృద్ధి, బస్తీ దవాఖాన సేవల బలోపేతం వంటి పలువురు అత్యవసర సమస్యలు ప్రజల ద్వారా ప్రస్తావించబడ్డాయి. ప్రతి సమస్యపై అక్కడికక్కడే సంబంధిత అధికారులను డిప్యూటీ మేయర్ ఆదేశించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను నేరుగా వినడం, వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవడం తమ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. బస్తీ బాట కార్యక్రమం కేవలం సమస్యలను వినడానికి మాత్రమే కాకుండా, బస్తీ అభివృద్ధిని సమగ్రంగా పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన ఒక ప్రజామిత్ర కార్యక్రమమని వివరించారు. జిహెచ్ఎంసిలోని పలు డివిజన్లలో ఈ కార్యక్రమం ఇప్పటికే ప్రారంభించబడిందని, ప్రజల నుండి వస్తున్న స్పందనను దృష్టిలో ఉంచుకుని దీనిని మరింత విస్తరించనున్నట్లు ఆమె చెప్పారు. బస్తీ అభివృద్ధి కోసం జిహెచ్ఎంసి కౌన్సిల్ మంజూరు చేసిన రెండు కోట్ల రూపాయల నిధుల వినియోగంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఈ నిధులు పారదర్శకతతో పాటు అత్యవసర అవసరాలను బట్టి ఖర్చు చేయాలని సంబంధిత శాఖలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ముఖ్యంగా ఇంటీరియర్ రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, వర్షాకాల డ్రైనేజ్ సమస్యలు, పార్కుల అభివృద్ధి, చిన్నారుల ఆట స్థలాలు, మహిళల కోసం రక్షిత ప్రదేశాల ఏర్పాటు వంటి అంశాలకు ప్రాధాన్యమివ్వాలని ఆమె సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి జిహెచ్ఎంసి వ్యవస్థపై చూపుతున్న నిబద్ధతను డిప్యూటీ మేయర్ ప్రశంసిస్తూ, ఆయన బస్తీ స్థాయి నుండి నగర స్థాయి వరకు విస్తృతంగా పర్యవేక్షిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచిస్తున్నారని తెలిపారు. అలాగే నగర ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా హైదరాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రతి విభాగంతో సమన్వయం చేసి పనులు నిర్వహిస్తున్నారని ఆమె అభినందించారు. బస్తీ బాట కార్యక్రమం ద్వారా ప్రజలకు దగ్గరగా ఉండే పాలనను అందించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ప్రజలు అభినందిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. స్థానిక ప్రజలు తమ ప్రాంతంలోని సమస్యలను నేరుగా డిప్యూటీ మేయర్‌తో పంచుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఇంత కాలం పెండింగ్‌లో ఉన్న పనులు ఈ కార్యక్రమం ద్వారా వేగంగా పరిష్కారమవుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యలు, చెత్త సేకరణ, డ్రైనేజ్ క్లీయరెన్స్, నాళాల శుభ్రత, రోడ్ల మరమ్మతులపై తక్షణ స్పందన వస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ బస్తీ బాట కార్యక్రమం ద్వారా తార్నాక డివిజన్‌లోని మాణికేశ్వరి నగర్, రవీంద్ర నగర్, పార్థివాడ ప్రాంతాలు త్వరలోనే అభివృద్ధి దిశగా ముందుకు సాగుతాయని అధికారులు తెలిపారు. ప్రజలతో మమేకమై సమస్యలను ప్రత్యేకంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# జీహెచ్ఎంసీ విస్తరణ ప్రక్రియ..
## నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం

* **గ్రేటర్ హైదరాబాద్ శివారులోని మున్సిపాలిటీలను విలీనం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం**
* **మంత్రివర్గ నిర్ణయానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం**
* **27 మున్సిపాలిటీలను విలీనం చేస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్**

హైదరాబాద్, డిసెంబర్ 03 (భారత శక్తి):గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) విస్తరణ ప్రక్రియ పూర్తయింది. గ్రేటర్ హైదరాబాద్ శివారులోని పట్టణ స్థానిక సంస్థలను విలీనం చేయాలన్న రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయానికి జిష్ణుదేవ్ వర్మ సోమవారం ఆమోదం తెలిపారు. దీంతో హైదరాబాద్ నగర పరిధిలోని మొత్తం 27 మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. నిన్నటి నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. విలీనమైన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల రికార్డులను స్వాధీనం చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బాధ్యతలను డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్లకు అప్పగించింది.

**A. చార్మినార్ జోన్:**
1. ఆదిభట్ల
2. బడంగ్ పేట్
3. జల్ పల్లి
4. శంషాబాద్
5. తుర్కయాంజాల్.

**B. శేరిలింగంపల్లి జోన్:**
1. బండ్లగూడ జాగీర్
2. మణికొండ
3. నార్సింగి
4. అమీన్ పూర్
5. తెల్లాపూర్

**C. ఎల్బీనగర్ జోన్:**
1. మీర్ పేట్
2. పెద్ద అంబర్ పేట
3. తుక్కుగూడ
4. దమ్మాయిగూడ
5. ఘట్ కేసర్
6. పీర్జాదిగూడ
7. పోచారం

**D. సికింద్రాబాద్ జోన్**
1. బోడుప్పల్
2. జవహర్ నగర్
3. నాగారం
4. తూంకుంట

**E. కూకట్ పల్లి జోన్:**
1. దుండిగల్
2. గుండ్లపోచంపల్లి
3. కొంపల్లి
4. మేడ్చల్
5. నిజాంపేట్
6. బొల్లారం.

# బస్తర్ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

ఛత్తీస్ గఢ్, డిసెంబర్ 03 (భారత శక్తి): ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ డివిజన్‌లో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య భీకరమైన ఎదురుకాల్పులు జరిగాయి. బీజాపూర్‌దంతేవాడ అంతర్ జిల్లా సరిహద్దుల్లో జరిగిన ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఆపరేషన్‌లో ముగ్గురు డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ) సిబ్బంది కూడా ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. పశ్చిమ బస్తర్ డివిజన్ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలపై సమాచారం అందడంతో భద్రతా బలగాలు కూంబింగ్ ప్రారంభించాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు హతమయ్యారు. ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరణించిన జవాన్లను హెడ్ కానిస్టేబుల్ మోను వాడారి, కానిస్టేబుల్ దుకారు గొండే, జవాన్ రమేష్ సోడిగా గుర్తించారు. గాయపడిన మరో ఇద్దరు సిబ్బందిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు.ఘటనా స్థలం నుంచి ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, 303 రైఫిళ్లు వంటి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని భద్రతా బలగాలు చుట్టుముట్టి, అదనపు బలగాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఈ ఆపరేషన్‌పై బీజాపూర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర యాదవ్ మాట్లాడుతూ, ప్రస్తుతం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నందున పూర్తి వివరాలను వెల్లడించలేమని తెలిపారు.

# కోకాపేటలో మరోసారి కోట్లు పలికిన భూములు..
## రూ.131 కోట్లు ఎకరా భూమి

హైదరాబాద్, డిసెంబర్ 03 (భారత శక్తి): హైదరాబాద్ పరిసర ప్రాంతమైన కోకాపేటలో భూములు మరోసారి కోట్లాది రూపాయలు పలికాయి. ఫ్లాట్ నెంబర్ 19లో ఎకరా భూమి ఏకంగా రూ.131 కోట్లకు అమ్ముడుపోయింది. మొత్తం నాలుగు ఎకరాల భూమిని వేలం వేయగా ప్రభుత్వానికి రూ.524 కోట్ల ఆదాయం సమకూరింది. అదేవిధంగా, ఫ్లాట్ నెంబర్ 20లో కూడా వేలం నిర్వహించారు. కోకాపేటలోని నియోపొలిస్ భూములకు సంబంధించి ఈరోజు మూడో విడత వేలం ప్రక్రియ ముగిసింది. ఈ వేలంలో ఫ్లాట్ నెంబర్ 19లో ఎకరా భూమి రూ.131 కోట్లు, ఫ్లాట్ నెంబర్ 20లో ఎకరం రూ.118 కోట్ల ధర పలికింది. ఈరోజు జరిగిన వేలంలో 8.04 ఎకరాలకు గాను హెచ్ఎండీఏకు సుమారు రూ. వెయ్యి కోట్ల ఆదాయం వచ్చింది.మొత్తంగా మూడు విడతల్లో ఆరు ప్లాట్లలోని 27 ఎకరాలకు రూ.3,708 కోట్ల ఆదాయం సమకూరింది. ఈసారి మొత్తం 44 ఎకరాల భూమిని నాలుగు విడతల్లో హెచ్ఎండీఏ వేలం వేస్తోంది. కోకాపేట గోల్డెన్ మైల్‌లోని 2 ఎకరాలు, మూసాపేటలోని 15 ఎకరాలకు డిసెంబర్ 5న ఈవేలం నిర్వహించనున్నారు.



# తెలంగాణ అభివృద్ధి మా లక్ష్యం

**: పెద్దపల్లి ఎంపీ**

హైదరాబాద్, డిసెంబర్ 03 (భారత శక్తి): తెలంగాణ అభివృద్ధి మా లక్ష్యం అని, రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కు ప్రధానమంత్రి మోదీని రావాలని కోరామని పెద్దపల్లి వంశీకృష్ణ తెలిపారు. బుధవారం ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం తో కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా కేంద్ర మంత్రులను తెలంగాణకు రావాలని ఆహ్వాన అందించామని తెలిపారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025కు హాజరుకావలసిందిగా ఆహ్వానించారు. పార్లమెంట్‌లో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రైల్వే, ఐటీ, సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తో విడివిడిగా సమావేశమై సమ్మిట్ ఆహ్వాన పత్రాలను అందించారు. సమ్మిట్‌లో ఆవిష్కరించనున్న తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్, రాష్ట్ర మౌలిక వసతుల అభివృద్ధి, పెట్టుబడి అవకాశాలు, పరిశ్రమల విస్తరణ, భవిష్యత్ ప్రాధాన్యత అంశాలపై విశ్లేషణాత్మక చర్చ జరుగుతుందని వంశీ తెలిపారు.

# వ్యవసాయ రంగం బలోపేతానికి పంచసూత్రాలు..
## గత పాలనను సరిదిద్దుతాం

అమరావతి, డిసెంబర్ 03 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి, రైతు ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇందుకోసం 'పంచసూత్రాల'ను అమలు చేస్తున్నామని, ప్రతి రైతు వీటిని ఆచరించి లబ్ధి పొందాలని పిలుపునిచ్చారు. 'రైతన్నా... మీ కోసం' సభలో ప్రసంగించిన ఆయన, గత ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రం అన్ని రంగాల్లో విధ్వంసానికి గురైందని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని విమర్శించారు.గత ఐదేళ్లలో జరిగిన భూ అవకతవకలను, ల్యాండ్ గోల్మాల్‌ను సరిదిద్దడంపై ప్రత్యేక దృష్టి సారించానని చంద్రబాబు తెలిపారు. తమకు నచ్చిన భూములు ఇవ్వని వారిని 22ఏ జాబితాలో పెట్టి వేధించారని,వాటన్నింటినీ చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నామని హామీ ఇచ్చారు. నాటి ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ ప్రజలు చరిత్రాత్మక తీర్పు ఇచ్చారని, పవన్ కల్యాణ్, బీజేపీతో కలిసి కూటమి ఏర్పడిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, దివ్యాంగులకు పెంచిన పింఛన్లు, దీపం 2.0 కింద మూడు ఉచిత సిలిండర్లు వంటి పథకాలను వివరించారు. సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని రోడ్లపై ఒక్క గుంత కూడా లేకుండా చేస్తామని భరోసా ఇచ్చారు. వ్యవసాయమే రాష్ట్రానికి బలమని, పోలవరం పూర్తిచేసి, నదుల అనుసంధానం ద్వారా ప్రతి ఎకరాకు నీరందిస్తామని చెప్పారు. మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా రైతులు పంటల సరళిని మార్చుకోవాలని,అంతర పంటలపై దృష్టి సారించాలని సూచించారు. ఏపీ వ్యవసాయ ఉత్పత్తులను గ్లోబల్ బ్రాండ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## మూగ బాలుడిపై కుక్కల దాడి..
# సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 03 (భారత శక్తి): హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో వీధి కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడిన మూగ బాలుడు ప్రేమ్ చంద్ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన, ఈ ఉదయం పత్రికల్లో ఈ వార్తను చూసి కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులతో మాట్లాడి, బాలుడికి అత్యుత్తమ వైద్య సహాయం అందించాలని ఆదేశించారు. గాయపడిన బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన సీఎం... బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారికి అవసరమైన తక్షణ సహాయాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. కమిషనర్ స్వయంగా ఆసుపత్రికి వెళ్లి బాలుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వపరంగా అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా, నగరంలో వీధి కుక్కల సమస్యపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. గతంలో జరిగిన సంఘటనలను గుర్తుచేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి దురదృష్టకర ఘటనలు పునరావృతం కాకుండా వీధి కుక్కల నియంత్రణకు తక్షణమే పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని అధికారులను గట్టిగా ఆదేశించారు.

# దేశవ్యాప్తంగా ఎయిర్ పోర్టుల్లో చెక్ ఇన్ సమస్య..
## విమానాలు తీవ్ర ఆలస్యం

హైదరాబాద్, డిసెంబర్ 03 (భారత శక్తి): మైక్రోసాఫ్ట్ విండోస్ లో ఏర్పడిన సమస్య వల్ల దేశవ్యాప్తంగా విమానాల రాకపోకల్లో తీవ్ర ఆలస్యం చోటుచేసుకుంటోంది. ప్రయాణికుల చెక్ ఇన్ వ్యవస్థ మొరాయించడంతో విమానాలు ఆలస్యమవుతున్నాయని అధికారులు తెలిపారు. దీంతో దేశంలోని పలు విమానాశ్రయాల్లో ప్రయాణికులు పడిగాపులు పడుతున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో పలు విమానాల రాకపోకలు ఆలస్యమవుతున్నాయి. దీంతో శబరిమల వెళ్లాల్సిన అయ్యప్ప భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**శంషాబాద్ లో పలు విమానాలు రద్దు..**

శంషాబాద్ నుంచి ఢిల్లీ, మదురై, బెంగళూరు, గోవా, కోల్‌కతా, భువనేశ్వర్ వెళ్లాల్సిన 7 విమానాలను అధికారులు రద్దు చేశారు. అదేవిధంగా వివిధ నగరాల నుంచి శంషాబాద్‌కు రావాల్సిన 12 విమానాలు కూడా రద్దయినట్లు అధికారులు పేర్కొన్నారు. నిర్వహణ కారణాల వల్ల ఈ విమాన సర్వీసులు రద్దయినట్లు విమానయాన సంస్థలు వెల్లడించాయి.

**విండోస్ సేవల్లో అంతరాయం వల్లే..**

ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ విండోస్ సేవలకు అంతరాయం కలిగిందని నిపుణులు తెలిపారు. దీంతో ఎయిర్‌పోర్టుల వద్ద ఐటీ సర్వీసులు, చెక్ ఇన్ వ్యవస్థలు పనిచేయడంలేదని వెల్లడించారు. దీంతో విమానాశ్రయాల్లో చెక్ ఇన్, బోర్డింగ్ ప్రక్రియలను ఎయిర్ పోర్ట్ సిబ్బంది మాన్యువల్ గా చేస్తున్నారు. దీనివల్ల విమాన సర్వీసులు ఆలస్యమవుతున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ సమస్యపై మైక్రోసాఫ్ట్ సంస్థ కానీ, విమానయాన సంస్థలు కానీ ఇంతవరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

## ఆటోలో మృతదేహాలు..
# హైదరాబాద్ పాతబస్తీలో కలకలం

హైదరాబాద్, డిసెంబర్ 03 (భారత శక్తి): హైదరాబాద్ లోని పాతబస్తీలో కలకలం చోటుచేసుకుంది. బుధవారం ఉదయం చాంద్రాయణగుట్టలోని ఫ్లైఓవర్ కింద నిలిపి ఉంచిన ఆటోలో ఇద్దరు యువకులు విగతజీవులుగా కనిపించడంతో, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతులను జహంగీర్ (24), ఇర్ఫాన్ (25)లుగా గుర్తించారు. డ్రగ్ ఓవర్ డోస్ కారణంగానే యువకులు చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. ఘటనాస్థలంలో మూడు సిరంజీలను క్లూస్ టీమ్ గుర్తించింది. దీంతో ముగ్గురు యువకులు డ్రగ్స్ తీసుకున్నట్లు తెలుస్తోందని, చనిపోయిన యువకులతో కలిసి డ్రగ్స్ తీసుకున్న మూడో వ్యక్తి ఎవరనేది గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నామని, యువకుల మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

# బీసీ రిజర్వేషన్ల పై హై కోర్టులో విచారణ

* **బీసీ రిజర్వేషన్ల పై హై కోర్టులో విచారణ**
* **కౌంటర్ దాఖలకు నాలుగు వారాల సమయం కోరిన ప్రభుత్వ అడ్వకేట్**
* **జనవరి 29కి విచారణ వాయిదా**



హైదరాబాద్, డిసెంబర్ 03 (భారత శక్తి): తెలంగాణ బ్యూరో: బీసీ రిజర్వేషన్ల పై దాఖలైన పిటిషన్‌ను హై కోర్టు బుధవారం విచారణ చెపట్టింది. జీవో 9 రద్దును కొరుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను సవాల్ చేస్తూ మాదవ రెడ్డి అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు.పిటిషన్ పై ఛీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ చెపట్టింది. విచారణ సందర్భంగా ప్రభుత్వం తరపున కౌంటర్ దాఖలు చేసేందుకు నాలుగు వారాల సమయం కావాలని ప్రభుత్వ తరపున లెర్నెడ్ కౌన్సిల్ అభ్యర్ధన మేరకు హై కోర్టు అనుమతిచ్చింది. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిన రెండు వారాల తరువాత పిటిషనర్ రిప్లై అఫడవిట్ దాఖలు చేయాలని పేర్కొంది. తదుపరి విచారణ జనవరి 29వ తేదికి వాయిదా వేసింది.



# సైబర్ జాగృతి దివస్ కొనసాగుతున్న ఆరు వారాల "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్"

ఎల్బీనగర్, డిసెంబర్ 03 (భారత శక్తి): చైతన్యపురి సీఐ కె. సైదులు, అడ్మిన్ ఎస్ఐ పి. భద్రయ్య, ఏఎస్ఐ ఎం.గోవర్ధన్ సైబర్ వారియర్ వీ.మీనా కుమారి, శ్రీకాంత్, ప్యాట్రోల్ మొబైల్ 2 సిబ్బంది, బీసీ2 సిబ్బంది సమక్షంలో చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని శివాజీ విగ్రహం సమీపంలో సైబర్ క్రైమ్ 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సుమారు 100 మంది ప్రజలు హాజరయ్యారు.ఈ అవగాహన కార్యక్రమం సందర్భంగా ప్రజలకు వివిధ రకాల సైబర్ మోసాల గురించి అవగాహన కల్పించబడింది. ప్రధానంగా వివరించిన అంశాలు : ఓటీపీ స్కామ్‌లు,డిజిటల్ అరెస్ట్ మోసాలు, సైబర్ బుల్లీయింగ్, లోన్‌యాప్ వేధింపులు,గేమింగ్ మోసాలు, ఫిషింగ్ లింకుల ద్వారా జరిగే మోసాలు,అదేవిధంగా, ప్రజలందరితో సైబర్ భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. సైబర్ నేరాలు గమనించిన వెంటనే సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 తెలియజేయాలని సీఐ సైదులు ప్రజలకు సూచించారు.

# కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగిందా..?

# బీఆర్ఎస్ ఉనికి చాటుకుంటుందా..? బీజేపీ బలపడిందా..?

- మూడు పార్టీల భవితవ్యాన్ని తేల్చనున్న సర్పంచ్ ఎన్నికలు..
- తమకే అనుకూలం అంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు..
- బీసీ రిజర్వేషన్ల అంశం ప్రభావం చూపే అవకాశం..
- పార్టీల బలాబలాలపై వివిధ వ్యాఖ్యలు చేస్తున్న రాజకీయ విశ్లేషకులు..
- స్పెషల్ అధికారుల పాలనకు ఇక ముగింపు కలుగనుంది..
- ఆచి తూచి జాగ్రత్తగా అడుగులు వేస్తున్న ఎన్నికల కమిషన్..
- జిల్లా కలెక్టర్లను అలెర్ట్ చేసిన అధికార కాంగ్రెస్ ప్రభుత్వం..
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గెలుపుతో జోష్ మీదున్న రేవంత్ సర్కార్..
- ఉనికిని చాటుకుంటామంటున్న భారత రాష్ట్ర సమితి..
- ఈసారి సత్తా చాటుతామని చెబుతున్న భారతీయ జనతా పార్టీ..
- స్థానికంగా ఎన్నెన్నో ప్రభావాలు వుంటాయంటున్న విశ్లేషకులు..
- పంచాయతీ ఎన్నికల సరళి, పార్టీల బలాబలాలు, బీసీ రిజర్వేషన్ల ప్రభావంపై " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " అందిస్తున్న ప్రత్యేక కథనం..

**(స్పెషల్ కరస్పాండెంట్)**

**హైదరాబాద్, డిసెంబర్ 03 ( భారత శక్తి ) :** తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ రాజకీయాల్లో అత్యంత కీలకమైన గ్రామ పంచాయతీ ఎన్నికల సమరానికి సమయం ఆసన్నమైంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల తర్వాత వస్తున్న ఈ ఎన్నికలు రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలకు అత్యంత ప్రతిష్టాత్మకంగా మారాయి. ఈ నేపథ్యంలో, తెలంగాణ పంచాయతీ ఎన్నికల సరళి, పార్టీల బలాబలాలు, బీసీ రిజర్వేషన్ల ప్రభావంపై ఒక విశ్లేషణ..

తెలంగాణలో ఐదేళ్ల సర్పంచుల పదవీకాలం ముగియడంతో, ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలన నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

*** ఎన్నికల సరళి : ఎలా ఉండబోతున్నాయి..?**

ఈసారి పంచాయతీ ఎన్నికలు మునుపెన్నడూ లేనంత రసవత్తరంగా సాగే అవకాశం ఉంది. ఇవి పార్టీ గుర్తులు లేకుండా జరిగే ఎన్నికలు అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రతి అభ్యర్థి వెనుక ఏదో ఒక ప్రధాన పార్టీ మద్దతు ఖచ్చితంగా ఉంటుంది. ఇక స్థానిక అంశాల ప్రాధాన్యత కూడా ఇక్కడ ప్రభావం చూపుతుంది.. రాష్ట్ర స్థాయి విధానాల కంటే గ్రామంలోని కుల సమీకరణాలు, అభ్యర్థి వ్యక్తిగత ప్రతిష్ట, స్థానిక సమస్యలే ఎన్నికల ఫలితాలను శాసిస్తాయి.

*** డబ్బు, మద్యం ప్రభావం :**

గత అనుభవాల దృష్ట్యా, సర్పంచ్ పదవి కోసం




అభ్యర్థులు భారీగా ఖర్చు చేసే అవకాశం ఉంది. కొన్ని గ్రామాల్లో ఏకగ్రీవాల కోసం 'వేలం పాటలు' జరిగే సంస్కృతి ఆందోళన కలిగిస్తోంది.

రాజకీయ పార్టీల బలాబలాల విషయానికి వస్తే..ఏ పార్టీకి లాభం చేకూరనుంది..? ప్రస్తుత రాజకీయ పరిస్థితుల ఆధారంగా ప్రధాన పార్టీల స్థితిగతులు ఇలా విశ్లేషించారు రాజకీయ మేధావులు..పార్టీ ప్రస్తుత పరిస్థితి..లాభ నష్టాల అంచనా.. చూస్తే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంది. ఇది అతిపెద్ద ప్లస్ పాయింట్ కానుంది..

ఎక్కువ శాతం అధికార పార్టీ వైపే గ్రామీణ ఓటర్లు మొగ్గు చూపే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ పథకాలు అంటే ఆరు గ్యారంటీలు అమలు తీరుపై ఈ ఎన్నికలు ఒక తీర్పులా మారనున్నాయన్నది యదార్ధం..

బీఆర్ఎస్ పార్టీ విషయానికి వస్తే.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత డీలా పడింది. ఇప్పుడు ఈ ఎన్నికలు సవాలుతో కూడుకున్నవి..క్షేత్రస్థాయిలో బలమైన క్యాడర్ ఉన్నప్పటికీ, అధికారంలో లేకపోవడం మైనస్. ఉనికిని చాటుకోవడానికి ఈ ఎన్నికలు అత్యంత కీలకమని చెప్పవచ్చు..

ఇక బీజేపీ పరిస్థితి ఎలా ఉందంటే..పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో ఉత్సాహంగా ఉంది. ఇంకాస్త మెరుగుపడే అవకాశం ఈ ఎన్నికలు కల్పిస్తున్నాయి.. గ్రామీణ ప్రాంతాల్లో పట్టు పెంచుకోవాలని చూస్తోంది బీజేపీ..కొన్ని జిల్లాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది. అయితే గ్రామాల్లో పాత కక్షలు, కొత్త సమీకరణాలు పార్టీల అధికారిక లెక్కలను తలకిందులు చేయగలవన్నది జగమెరిగిన సత్యమే..

*** ఇక బీసీ రిజర్వేషన్లు :**

ఈ ఎన్నికలపై బీసీల ప్రభావం ఖచ్చితంగా ఉంటుంది..ఈ ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల అంశం అత్యంత కీలకమైనది. జనాభా ప్రాతిపదికన డిమాండ్ కూడా కీలకంగా వుండబోతోంది..బీసీ కుల గణన చేపట్టి, వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

*** ప్రభుత్వ నిర్ణయం :**

కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసే ప్రక్రియలో ఉంది. 50 శాతం లోపు పరిమితి ఉండాలా..? లేదా పెంచాలా అనే దానిపై చట్టపరమైన అంశాలు ముడిపడి ఉన్నాయి. ఒకవేళ బీసీలకు ఎక్కువ సీట్లు దక్కితే, గ్రామీణ రాజకీయాల్లో వారి పట్టు మరింత పెరుగుతుంది. ఏ పార్టీ అయితే బీసీ రిజర్వేషన్ల విషయంలో స్పష్టమైన, అనుకూలమైన స్టాండ్ తీసుకుంటుందో, ఆ పార్టీకి బీసీ ఓటర్ల మద్దతు లభించే అవకాశం ఉంది. రిజర్వేషన్ల ఖరారులో ఆలస్యం లేదా అసంతృప్తి ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

అయితే తెలంగాణ పంచాయతీ ఎన్నికలు కేవలం గ్రామాధికారులను ఎన్నుకునే ప్రక్రియ మాత్రమే కాదు. ఇది రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగిందా..? బీఆర్ఎస్ కోలుకుంటోందా...? ఇక బీజేపీ బలపడుతోందా? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పనుంది. బీసీ రిజర్వేషన్ల తుది నిర్ణయం ఈ ఎన్నికల స్వరూపాన్నే మార్చేయగలదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.. చూద్దాం భవిష్యత్తులో ఏమి జరగనుందో..?







## ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా
# పారా క్రీడాకారులకు సన్మానం

ఎల్బీనగర్, డిసెంబర్ 03 (భారత శక్తి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 3వ తేదీన సరూర్నగర్ శ్రీ వెంకటేశ్వర కాలనీ రోడ్ నెంబర్ 3 కమ్యూనిటీ హాల్ నందు ద్రోణాచార్య పారా స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి సహకారంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పారా పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారులకు ఘన సన్మానం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎల్బీనగర్ ఏసీపి కృష్ణయ్య పాల్గొని క్రీడాకారులను సత్కరించారు. ఏసీపీ ప్రసంగిస్తూ,కాలనీ వారి సహాయ సహకారాలతో మరెన్నో సామాజిక కార్యక్రమాలు చెయ్యాలని శ్రీ వెంకటేశ్వర కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారిని అలాగే ద్రోణాచార్య పారా స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్ వేణుతో పాటు పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ఉపాధ్యక్షుడు మారోజు శ్రీనివాస్ రావు, మునగాల నరేష్, సుధాకర్ చారి, కిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రెడీ టూ సర్వ్, ఎంవైజీ
# సారధ్యంలో వైద్య శిబిరం



ఎల్బీనగర్, డిసెంబర్ 03 (భారత శక్తి): కామినేని హాస్పిటల్ సిబ్బంది సారధ్యంలో వృద్ధాశ్రమంలో గల వృద్ధులకు వైద్య శిబిరం నిర్వహించి, బిపి, షుగర్, కంటి, సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన మందులను అందించారు. ఈ కార్యక్రమానికి మద్దతు ఇవ్వడానికి తక్షణమే ముందుకు వచ్చినందుకు కామినేని ఆసుపత్రి సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో విలువైన సహాయాన్ని అందించిన వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు శంకర్, ప్రకాష్ యాదవ్, సతీష్ గౌడ్, లయన్స్ క్లబ్ వనస్థలిపురం కృష్ణ కిషోర్ కామినేని హాస్పిటల్ శ్రీధర్, నరేష్ గౌడ్,కుంచా సాయికిరణ్ గౌడ్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని రెడీ టూ సర్వ్ ఫౌండేషన్, ఎంవైజీ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు.

## గుండెపోటుతో
# సబ్ ఇన్స్పెక్టర్ మృతి



ఎల్బీనగర్, డిసెంబర్ 03 (భారత శక్తి): పోలీసు శాఖా పరమైన విధులు ముగించుకుని ఉన్న ఎస్సై గుండెపోటుతో మృతిచెందిన సంఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో బుధవారం ఉదయం జరిగింది. సిఐ వినోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... సంజయ్ సావంత్ (58)ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. రోజువారి మాదిరిగానే మంగళవారం విధులు ముగించుకొని, అలసటగా ఉందని స్టేషన్ లోనే నిద్రకు ఉపక్రమించాడు.అతని కుమారుడు తండ్రిని ఇంటికి తీసుకుపోదామని స్టేషన్ కు రాగా నిద్రపోతున్నాడని గమనించి సరే ఉదయమే వస్తాడు కదాని ఇంటికి వెళ్ళిపోయాడు. బుధవారం ఉదయం 7:30 గంటల సమయంలో పడుకున్న బెడ్ పై అపస్మారక స్థితిలో ఉండగా తోటి సిబ్బంది గమనించి వెంటనే కామినేని హాస్పిటల్ కు తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. 1989లో కానిస్టేబుల్ గా పోలీస్ శాఖలో చేరిన ఎస్సై సంజయ్ సావంత్ 2023లో ఎస్సైగా ప్రమోషన్ పొంది ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్నాడు. ఎస్సై అకాల మృతి పట్ల సిఐ వినోద్ కుమార్, స్టేషన్ ఎస్సైలు, సిబ్బంది కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసారు.




వాసవీ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాసవీ మాత ఆలయ తృతీయ వార్షికోత్సవాలు వైభవంగా జరుతున్నాయి. బుధవారం వాసవీ మాతా, గణపతి, సుబ్రహ్మణ్యస్వామికి వెండి కలశాలతో అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివ పార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది.కల్యాణాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మి ఆలయ ట్రస్ట్ ఫౌండర్ ఛైర్మన్, కాలనీ అధ్యక్షులు గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి అయిత అంజయ్య, కోశాధికారి టీ. కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్, డిసెంబర్ 03 (భారత శక్తి ):

# నాయకుడిని కాదు మీ సేవకుడిని...

*** సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా - మొద్దు లచ్చిరెడ్డి**

ఎల్బీనగర్, డిసెంబర్ 03 (భారత శక్తి): బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సచివాలయ నగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం, సచివాలయ నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సత్కార సభ కార్యక్రమంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు మరియు సంక్షేమ సంఘం సభ్యులు మాట్లాడుతూ, సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనానికి నూతన రంగులు వేయించాలని కోరిన వెంటనే కార్పొరేటర్ సొంత నిధుల్లో నుంచి రంగులు వేయించినందుకు, కాలనీలో నూతన రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు సంక్షేమ సంఘం సభ్యులు కార్పొరేటర్ కి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కాలనీలో కొంతమేర భూగర్భ డ్రైనేజ్




మరమ్మతు పనులు, మరి కొన్ని రోడ్ల నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీల అభివృద్ధికి సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ నగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షులు బసవయ్య, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు సాంబశివరావు,అసోసియేషన్ సొసైటీ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ అధ్యక్షులు కూర్మారావు, సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి నరసరాజు, కాలనీ ప్రధాన కార్యదర్శి బాల్ రెడ్డి కాలనీ సీనియర్ సిటిజన్స్ ఫారం సభ్యులు, సంక్షేమ సంఘం సభ్యులు, సొసైటీ సభ్యులు, మహిళా సోదరీమణులు,పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి, పవన్ రెడ్డి, నాయకులు పిట్ట శ్రీనివాస్ రెడ్డి, ఇప్ప నరసింహారెడ్డి, సుధీర్, మధుసూదన్ రెడ్డి,బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.